www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 5-5-2024 | పేజీలు: 10 + 8 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 19 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి సా. 5.42 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా. 7.57 తదుపరి రేవతి; వర్జ్యం: ఉ. 6.51-8.18; దుర్ముహూర్తం: సా. 4.51-5.42; అమృతఘడియలు: మ. 3.35-5.02; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 5.50; సూర్యాస్తమయం: 6.32 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

NEET-2023 ద్వారా ప్రభుత్వ వైద్యకళాశాలల్లో సీట్లు సాధించిన నారాయణ విద్యార్థులు



స్థలాభావం కారణంగా మెడికల్ కాలేజీల్లో చేరిన 3128 వారి పూర్తి వివరాలు ప్రచురించలేకపోతున్నాం...

2024-25 అడ్మిషన్లు జరుగుచున్నవి

SCAN QR CODE FOR ADMISSIONS

SRAMAYEVA JAYATHE

NARAYANA
EDUCATIONAL INSTITUTIONS

TOLL FREE : 1800 102 3344 | www.narayanagroup.com

TWO YEARS INTEGRATED CLASSROOM COURSE	ONE YEAR CLASSROOM COURSE	FOUNDATION	REPEATER COURSE	Get Up to
JEE/NEET - 2025	JEE/NEET - 2025	One / Two / Three / Four Years Course	JEE/NEET - 2025	90%
Eligibility : X to XI moving Students	Eligibility : XI to XII moving students		Eligibility : XII Pass Students	Scholarship*

Narayana Admission-Cum-Scholarship Test : 28th May 2024, 1st బ్యాచ్ క్లాసులు ప్రారంభం : 05-06-2024



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 5-5-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ

మీ భూమి.. నా ఇష్టం!



'టైటిలింగ్ బిల్లు'లోనే బయటపడ్డ జగన్ స్వరూపం

బ్రహ్మ రాక్షసంగా టైటిల్ బిల్లు తొలి ప్రతి

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ - 2022. రాష్ట్రంలోని రైతులను, భూ యజమానులను వణికిస్తున్న చట్టమిది! భూములను వివాదాస్పదం చేసి... దురాక్రమణదారులకు 'చట్టప్రకారం' ఊతమిచ్చే చట్టం! భూములను మింగేసే రాక్షస చట్టం! ఈ విషయం ఇప్పటికే అందరికీ స్పష్టమైంది. అసలు సంగతి ఏమిటంటే... దీని తొలి స్వరూపం మరింత క్రూరం, ఘోరం! ఇప్పుడున్న చట్టమే రాక్షసమైతే... దీని మూలరూపమైన బిల్లు బ్రహ్మ రాక్షసం! బారెడు కోరలతో రూపొందించిన ఈ బిల్లుపై కేంద్రం ఒకటికి రెండుసార్లు మండిపడటంతో... ఆ కోరలను కాస్త అరగదీశారు! అంతే! మిగిలిందంతా సేమ్ టు సేమ్!

- కేంద్ర చట్టాలు బేఖాతరు చేస్తూ నిబంధనలు
- రెండుసార్లు తిప్పి పంపిన కేంద్ర ప్రభుత్వం
- రాజ్యాంగబద్ధమేనా? శాసన పరిధిలోనే ఉందా?
- బిల్లు తీరుపై రాష్ట్రానికి చీవాట్లు, సూటి ప్రశ్నలు
- కోరలు కాస్త తగ్గించి మూడోసారి కేంద్రానికి
- ట్రైబ్యునళ్ల స్థానంలో 'అధికారుల' ద్వారా తీర్పులు
- లాబీయింగ్ చేసి మరీ ఆమోదం పొందిన జగన్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

"అసలు ఇది చట్టమేనా? రాజ్యాంగానికి లోబడే ఉందా? మీకున్న శాసన పరిధిలోనే రూపొందించారా? అన్నీ చూసుకునే మాకు పంపారా?" ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం నిలదీసిన వైనమిది! ఈ బిల్లును జగన్ సర్కారు అంత ఘోరంగా,

మిగతా 8వ పేజీలో...

సాక్షులను లేపేద్దాం!

- జనం ఆస్తులు కొట్టేసే ప్లాన్‌లో తదుపరి వ్యూహమా?
- ఇకపై సాక్షులు లేకుండానే రిజిస్ట్రేషన్లు
- టైటిల్ కుట్రకు పదును
- ప్రతిపాదనకు ప్రభుత్వం ఓకే.. రెడీగా ఉత్తర్వులు

ఇక తేల్చుకోవాల్సింది జనమే!



తాము దగా పడుతున్నామా, లాభపడుతున్నామా అన్నది తెలుసుకోవాల్సింది ఆంధ్రప్రదేశ్ ప్రజలే. జగన్మోహన్ రెడ్డి వంటి వారు అధికారంలో కొనసాగడానికి అర్హులా? కాదా? అన్నది కూడా ఈ ఎన్నికల్లో ప్రజలే నిర్ణయించుకోవాలి. తల్లిని, చెల్లిని సైతం విసిరికొట్టిన వ్యక్తి నైజం తెలుసుకోవడం అవసరం.

ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో ప్రజల వ్యక్తిగత ఆస్తులకు కూడా భద్రత ఉండదు. వివాదాలు సృష్టించి కబ్జాలకు పాల్పడతారు. దేవుడిని, మతాన్ని విశ్వసించే జగన్మోహన్ రెడ్డి ప్రజలు ఇచ్చిన అధికారంతో న్యాయపాలన చేయాలన్న సూక్ష్మాన్ని ఎలా విస్మరిస్తున్నారో తెలియదు.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 2లో

సీఎం రమేశ్‌పై దాడి

- డిప్యూటీ సీఎం బూడి అనుచరుల అరాచకం
- ముత్యాలనాయుడు స్వగ్రామంలో డ్రోన్‌తో బీజేపీ జెండా ఎగరేసిన బావమరిది
- ఆయనపై విరుచుకుపడిన బూడి అనుచరులు
- పరామర్శకు వెళ్లిన సీఎం రమేశ్ అడ్డగింత.. దాడి
- ప్రతికూల సమయంలో గ్రామానికి వెళ్లారంటూ రమేశ్‌పై కేసు నమోదు.. అరెస్టు, విడుదల

4




జగన్ బొమ్మ ముద్రించిన పాస్‌బుక్ ప్రతిని దర్శి సభలో చించేస్తున్న చంద్రబాబు.. గుడివాడ రోడ్‌షోలో పవన్

చించి చెత్తబుట్టలో!

చీకటి చట్టంతో బానిసలమవుతాం: చంద్రబాబు

- ల్యాండ్ టైటిలింగ్ యాక్టు కాదు.. అది జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు
- క్రిటికల్ కంపెనీ ఆయన బినామీ సంస్థే
- పేదలను చంపి రాజకీయ లబ్ధి పొందే కుట్ర
- క్లాస్‌వార్ అబద్ధం.. క్యాష్ కోసం వార్
- ఫ్యాన్ రెక్కలు విరవండి.. సైకిల్‌కే పట్టం కట్టండి
- ఓటమి భయంతో జగన్ గజగజ
- ప్రజాగళంలో టీడీపీ అధినేత విసుర్లు

7

మీ ఆస్తుల తనఖాకే ఆ చట్టం

మీ భూములను మీకు కాకుండా చేసే కుట్ర: పవన్

- మీ ఆస్తులపై మీకు నియంత్రణ ఉండదు.. కోర్టుకూ వెళ్లలేరు
- మిథున్‌రెడ్డో, పెద్దిరెడ్డో, మోపిదేవో మీ భూములు కబ్జాచేసేస్తారు
- వైసీపీకి ఓటేస్తే మీ ఆస్తులను మీరే వారి చేతుల్లో పెట్టినట్లే
- దొంగ చేతికి మీ అంతట మీరే తాళాలు ఇచ్చినట్లే
- జగన్ అవినీతి సామ్రాజ్యాన్ని బద్దలు కొడతాం: జనసేనాని

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

ఇక తేల్చుకోవాల్సింది జనమే!

"ఒక అద్భుతమైన లోకంలో మనం బ్రతుకుతున్నాం. ఇక్కడ శాస్త్రవేత్తలు జ్యోతిష్యం మాట్లాడతారు. బాబాలు సైన్స్ బోధిస్తారు. పౌరాణికులు చరిత్ర రాస్తారు. సినీ నటులు భక్తిని వ్యాప్తి చేస్తారు. ధనవంతులు సాదా జీవనం గురించి పాఠాలు చెబుతారు. ప్రవాస భారతీయులు దేశాన్నెలా ప్రేమించాలో చెబుతారు. నేరగాళ్లు విలువలను బోధిస్తారు. రాజకీయ నాయకులు దేవుడి గురించి మాట్లాడతారు. దేవుడు మాత్రం నిశ్శబ్దం పాటిస్తాడు!" అని దేవులపల్లి కృష్ణశాస్త్రి అనే రచయిత ఫేస్‌బుక్ పోస్ట్‌లో ఆవేదన చెందాడు. ఈయన ప్రసిద్ధ తెలుగు కవి స్వర్గీయ దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి మనవడు. ఇప్పుడు మన దేశంలోని పరిస్థితులను గమనించిన వారికి ఈ మాటలు అక్షర సత్యాలని అనిపించకమానదు. శాస్త్రవేత్తలు జ్యోతిష్యం గురించి మాట్లాడడం, బాబాలు సైన్స్ గురించి చెప్పడం చూస్తున్నాం కదా! ప్రవాస భారతీయులు దేశాన్ని ప్రేమించడం ఎలాగో చెప్పడంతోపాటు ఎన్నికల్లో కూడా పాల్గొంటున్నారు. నేరగాళ్లు, రాజకీయ నాయకుల విషయానికి వద్దాం! ఈ ఇరువురి మధ్య పెద్ద తేడా ఉండడంలేదు. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టుగా నేరగాళ్లే రాజకీయ నాయకులుగా అవతరిస్తున్నారు. అయితే, ఒక తేడా ఉంది. సాధారణ దొంగ మీ వ్యక్తిగత సొమ్మును మాత్రమే దోచుకుంటాడు. రాజకీయ దొంగ మాత్రం మీ భవిష్యత్తును, జీవితాన్ని, వ్యాపారాన్ని కూడా దోచుకుంటాడు. విచిత్రం ఏమిటంటే, సాధారణ దొంగ ఎవరిని దోచుకోవాలో తానే నిర్ణయించుకుంటాడు. మనల్ని దోచుకొనే రాజకీయ దొంగను మాత్రం మనమే ఎంచుకుంటాము. సాధారణ దొంగను పోలీసులు తరిమి తరిమి పట్టుకుంటారు. రాజకీయ దొంగకు ఆ పోలీసులే రక్షణ కల్పిస్తారు. ఈ మొత్తం వ్యవహారంలో తమాషా ఏమంటే సాధారణ దొంగను మనం అసహ్యించుకుంటాం! దొరికితే చావగొడతాం. రాజకీయ దొంగకు మాత్రం భజన చేస్తాం. వాడికోసం మనం పరస్పరం కొట్టుకు చస్తాం. ఇది మన సమాజంలో ఉన్న దౌర్భాగ్య పరిస్థితి. దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న వేళ ఈ మాటలు గుర్తుకు వస్తున్నాయి. శాస్త్రవేత్తలు, బాబాలు, సినీనటులు, ధనవంతుల విషయం పక్కనపెట్టి... నేరగాళ్లు, రాజకీయ నాయకుల విషయానికి వద్దాం! ఇటీవలి కాలంలో నేరగాళ్లు బాబాలుగా కూడా అవతరిస్తుండగా ఆర్థిక నేరస్తులు రాజకీయ నాయకులుగా రూపాంతరం చెందుతున్నారు. రాజకీయ నాయకులకు దేవుడు ముడి సరుకుగా మారిపోయాడు. ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకొని బాబాలుగా అవతరించిన వాళ్లు ప్రజలను ఎన్ని విధాలుగా మోసం చేస్తున్నారో మనం చూస్తున్నాం. అదే ప్రజల బలహీనతలను అడ్డుపెట్టుకొని రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకోవడం ఇప్పుడు నిత్యకృత్యం అయింది. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాలకోసం దేవుడితోపాటు కులం, మతం, ప్రాంతాన్ని కూడా వాడుకుంటున్నారు. కులం కూడు పెట్టదని తెలిసినా ఆ కులం కోసమే కొట్టుకు చస్తున్నారు. ఎన్నికల్లో ఫలానా కులం వాళ్లకు అన్ని టికెట్లు ఇచ్చాం, ఇన్ని టికెట్లు ఇచ్చాం అని ప్రకటించుకోవడం చూస్తున్నాం. మెజారిటీ కులాల వాళ్లకు మైనారిటీ కులం వాళ్లు టికెట్లు ఇవ్వడం ఏమిటి? అని ఒక్కరూ ఆలోచించరు. సామాజిక న్యాయం అంటే ఏమిటి? అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకొని ఆర్థిక, సహజ వనరులన్నింటినీ చెరబట్టిన వాళ్లు ఏ అధికారం లేని పదవులకు టికెట్లు కేటాయించడం సామాజిక న్యాయం అవుతుందా? కులం కాదు గుణం ముఖ్యం అని ఒకప్పుడు చెప్పేవాళ్లు. ఇప్పుడు అధికారం చెలాయిస్తున్న నాయకులకు ప్రజలను కులాల వారీగా విడగొట్టడం అవసరంగా మారింది.

> ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎన్నికలు ప్రత్యేకమైనవి. జగన్‌రెడ్డి కేంద్ర బిందువుగా ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. జగన్ కావాలనుకొనేవారు ఒకవైపు, వద్దనుకొనేవారు మరొకవైపు మోహరించారు. సమాజం రెండుగా విడిపోయింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రధానం కాదు. జగన్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఇంటికి పంపాలనుకొనే వారు మరేమీ చూడటంలేదు! కులాలకు అతీతంగా కూటమినే ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. ప్రజలను ఆకర్షించడానికి పోటీపడి ప్రకటిస్తున్న పథకాల ప్రభావం కూడా ఈ ఎన్నికల్లో ఉండదు. రాష్ట్రంలో నాగరిక పాలన, అభివృద్ధి ఉండాలని కోరుకొనే వారందరూ జగన్మోహన్ రెడ్డిని ఈసారి ఇంటికి పంపాలని నిర్ణయించుకున్నారు. కులం, మతం ప్రాతిపదికన ఆలోచిస్తున్నవారు మాత్రం జగన్ వైపు ఉన్నారు. ఈ ఐదేళ్ల అరాచకాలను గమనిస్తున్నవాళ్లు బటన్ల నొక్కుడుకు పడిపోవడం లేదు.

అయినా... పదవికి దూరమైన కేసీఆర్!

తెలుగు రాష్ట్రాల విషయానికి వద్దాం! మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కుల బలం లేదు. అందుకే ఆయన ప్రాంతీయ వాదం అందుకొని అందలం ఎక్కారు. గత ఎన్నికల్లో ప్రజలు ఆయనను ఓడించినప్పటికీ ఆత్మవిమర్శ చేసుకోకుండా తెలంగాణను పాలించే సత్తా తనకు తప్ప మరొకరికి లేదన్నట్టుగా ఆయన మాట్లాడుతున్నారు. కేసీఆర్ కూడా అధికారంలో ఉన్నప్పుడు యజ్ఞయాగాదులు నిర్వహించారు. యాదాద్రిని పునర్నిర్మించారు. అయినా దేవుడు కనికరించకుండా నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ఫలితంగా కేసీఆర్ ఎన్నికల్లో ఓడిపోయారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ న్యాయ నిర్ణేతలు అని చెప్పుకొంటున్న మనమే పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు అదే ప్రజలను విస్మరిస్తాం. కేసీఆర్ కూడా ప్రజలను విస్మరించారు. అందుకే ఆయన అధికారం కోల్పోయారు. కులాలు, మతాలు, ప్రాంతాలు ఎన్నికల్లో పదే పదే ఉపయోగపడవు. 2014, 2018 ఎన్నికల్లో కేసీఆర్‌కు ఉపయోగపడిన ప్రాంతీయ వాదం 2023 ఎన్నికల్లో పనిచేయలేదు. తెలంగాణ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్దిష్టమైన లక్ష్యంతో కేసీఆర్ చర్యలను టార్గెట్‌గా చేసుకొని అందలాన్ని అందుకున్నారు. కేసీఆర్‌నుగానీ, రేవంత్‌నుగానీ ఎన్నుకున్నదీ, ఎంచుకున్నదీ ప్రజలే. వ్యవస్థలు పతనమైనప్పటికీ ప్రజాస్వామ్యంలో ప్రజల ఓటు హక్కు ఇంకా పదిలంగానే ఉంది. అందుకే ఎంత అధికారం, ధనం ఉన్నప్పటికీ ఓటమి నుంచి కేసీఆర్ తప్పించుకోలేకపోయారు. తెలంగాణలో ప్రస్తుతం ముక్కోణపు పోటీ జరుగుతోంది. ప్రధాన పోటీ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ మధ్యే కేంద్రీకృతమైనట్టు కనిపిస్తున్నప్పటికీ భారత రాష్ట్ర సమితి కూడా కొద్దో గొప్పో పుంజుకుంటోంది. బీఆర్ఎస్ బలపడేకొద్దీ ఆ ప్రభావం బీజేపీపైన పడుతుంది. అధికారంలో ఉన్నందున కాంగ్రెస్ బలం తగ్గే అవకాశాలు తక్కువ. మనది కర్మభూమి. ఈసడించుకున్న ప్రజలే కొంతసేపటికి అయ్యో పాపం అనవచ్చు. ఈ ప్రభావం రాజకీయాల్లో కూడా కనిపిస్తుంటుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల సానుభూతి పొందగలరా? లేదా? అన్నది తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెల్లడైతేగానీ తెలియదు. ఆంధ్రప్రదేశ్‌లో క్రైస్తవ మతం ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుండగా తెలంగాణలో ముస్లింలు ప్రభావం చూపుతారు. ఇటీవల ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉమ్మడి మెదక్ జిల్లాలో మాట్లాడుతూ తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మత ప్రాతిపదికన ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వబోనని ప్రకటించారు. దీంతో ముస్లింలు అంతా కాంగ్రెస్ పార్టీకి అండగా సంఘటితం అయ్యారు. అదే సమయంలో హిందువులు బీజేపీకి అనుకూలంగా సంఘటితం అవుతారా? అంటే చెప్పలేం. తెలంగాణ సమాజాన్ని కూడా కులాల వారీగా విడదీసినందున హిందువులలో ఐకమత్యం రావడం కష్టం. ప్రధాని మోదీ మాటలు బీజేపీకి నష్టం చేస్తాయా? లాభం చేకూరుస్తాయా? అన్నది వేచిచూడాలి.

ఏపీలో ఇలా...

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు వద్దాం! అక్కడి రాజకీయాలను పరిశీలిస్తే పైన చెప్పిన ఫేస్‌బుక్ సూక్తి మళ్లీ గుర్తుకొస్తుంది. ఆర్థిక నేరగాళ్లు విలువలను బోధిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డినే తీసుకుందాం. ఆయన అనేక ఆర్థిక నేరాల్లో నిందితుడిగా ఉన్నారు. అయినా విలువలు బోధిస్తున్నారు. రాజకీయాలు ఇంతగా కలుషితమయ్యాయా? అని ఈసడించుకుంటున్నారు. రాజకీయాలే కాదు సమాజం కూడా కలుషితమైనందునే తాను ముఖ్యమంత్రిని కాగలిగానని ఆయన విస్మరిస్తున్నారు. దేవుడి ప్రస్తావనను కూడా జగన్మోహన్ రెడ్డి తరచుగా తీసుకువస్తారు. ఆ దేవుడి చల్లని దీవెనలతో అని అంటూ ఉంటారు. మరి కొద్ది రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో మరింత గొప్ప స్క్రిప్ట్ రాసే పనిలో దేవుడు బిజీగా ఉన్నట్టు ఆయన చెబుతున్నారు. ఆ స్క్రిప్ట్ ఎలా ఉండబోతున్నదో మరో నెల రోజుల్లో తేలిపోనుంది. ధనవంతులు నిరాడంబర జీవనం గురించి పాఠాలు చెబుతారు అన్న మాటలు కూడా జగన్మోహన్ రెడ్డికి వర్తిస్తాయి. దేశంలోకెల్లా ధనిక ముఖ్యమంత్రిగా రికార్డులకెక్కిన ఆయన క్లాస్‌వార్‌లో భాగంగా తాను పేదలకు ప్రాతినిధ్యం వహిస్తున్నానని చెప్పుకొంటున్నారు. రాజకీయ నాయకులకు భజన చేసేవాళ్లు ఉండనే ఉంటారు కనుక జగన్మోహన్ రెడ్డిని పేదల ప్రతినిధిగా అభివర్ణించడానికి కొంతమంది సిద్ధమయ్యారు. సామాజిక న్యాయం గురించి జగన్మోహన్ రెడ్డి తరచుగా ప్రవచిస్తున్నారు. అతగాడి పాలనలో సామాజిక న్యాయానికి నిర్వచనమే మారిపోయింది. అయితే, 'ఆహా ఓహో' అని కీర్తించేవారికి ఆయన రోత మీడియాలో స్థానం లభిస్తోంది. దేశ రాజకీయాల్లోనే ఏ నాయకుడూ చేయని విధంగా జగన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటించారని ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల్లో కొంత మందికి కొన్ని టికెట్లు ఇచ్చినంత మాత్రాన సామాజిక న్యాయం జరిగినట్టేనా? 'నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీలూ' అని జగన్ రాగాలు తీసి పాడుతున్నారు సరే, ఆ వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా పురోగతి సాధించాయా? అంటే లేదనే చెప్పుకోవాలి. అధికారం, ధనం, వనరులు అన్నీ జగన్మోహన్ రెడ్డి వద్ద కేంద్రీకృతమైనప్పుడు సామాజిక న్యాయం ఎలా సాధ్యం? ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ముఖ్యమంత్రి సామాజిక వర్గానికి చెందినవారే కదా ఉన్నారు? చట్టాలు, రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారమే బడుగులకు చట్టసభలు, ఇతర పదవుల్లో వాటా లభిస్తోంది. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఐదుగురికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చానని గొప్పలు చెప్పుకొంటున్నారు గానీ ఆ ఐదుగురూ ఎవరో, వారికి ఉన్న అధికారం ఏ పాటిదో సదరు ఉప ముఖ్యమంత్రులకు కూడా తెలియదు. పార్టీలో, ప్రభుత్వంలో జగన్ సామాజిక వర్గానికి చెందిన వారే రాజ్యం ఏలుతున్నప్పుడు సామాజిక న్యాయం పాటించినట్టు ఎలా అవుతుంది? అధికారంలో వాటా దక్కనీయకుండా సామాజిక న్యాయం సాధించామని అనడం నేతి బీరకాయలో నెయ్యి చందంగానే ఉంటుంది.

అటూ... ఇటూ!

తాము దగా పడుతున్నామా, లాభపడుతున్నామా అన్నది తెలుసుకోవాల్సింది ఆంధ్రప్రదేశ్ ప్రజలే. జగన్మోహన్ రెడ్డి వంటి వారు అధికారంలో కొనసాగడానికి అర్హులా? కాదా? అన్నది కూడా ఈ ఎన్నికల్లో ప్రజలే నిర్ణయించుకోవాలి. తల్లిని, చెల్లిని సైతం విసిరికొట్టిన వ్యక్తి నైజం తెలుసుకోవడం అవసరం. అమ్మకు అన్నం పెట్టని వాడు పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తాననని అన్నాడట... అని దివంగత రాజశేఖర రెడ్డి తరచూ అంటూ ఉండేవారు. తన మాటలు తన కుమారుడికే వర్తించబోతున్నాయని ఆనాడు ఆయనకు తెలియదు పాపం. తల్లినీ చెల్లినీ దూరం చేసుకున్న జగన్ బహిరంగ సభల్లో మాత్రం అక్కచెల్లెమ్మలు అని మహిళలను ఉద్దేశించి అంటూ ఉంటారు. రక్తం పంచుకు పుట్టిన వాళ్లకే న్యాయం చేయడానికి నిరాకరిస్తున్న జగన్, పరాయి మహిళలకు న్యాయం చేస్తారా? ఆయనకు రక్త సంబంధాలు ముఖ్యం కాదు— తాను అధికారంలో కొనసాగడమే ప్రధానం. అందుకోసమే క్లాస్ వార్, కులం, మతం వంటి మాటలను తరచుగా వాడుతుంటారు. రాజకీయ ప్రత్యర్థులను నీచులుగా అభివర్ణిస్తారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎన్నికలు ప్రత్యేకమైనవి. జగన్‌రెడ్డి కేంద్ర బిందువుగా ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. జగన్ కావాలనుకొనేవారు ఒకవైపు, వద్దనుకొనేవారు మరొకవైపు మోహరించారు. సమాజం రెండుగా విడిపోయింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రధానం కాదు. జగన్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఇంటికి పంపాలనుకొనేవారు మరేమీ చూడటంలేదు! కులాలకు అతీతంగా కూటమినే ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. ప్రజలను ఆకర్షించడానికి పోటీపడి ప్రకటిస్తున్న పథకాల ప్రభావం కూడా ఈ ఎన్నికల్లో ఉండదు. రాష్ట్రంలో నాగరిక పాలన, అభివృద్ధి ఉండాలని కోరుకొనే వారందరూ జగన్మోహన్ రెడ్డిని ఈసారి ఇంటికి పంపాలని నిర్ణయించుకున్నారు. కులం, మతం ప్రాతిపదికన ఆలోచిస్తున్నవారు మాత్రం జగన్ వైపు ఉన్నారు. ఈ ఐదేళ్ల అరాచకాలను గమనిస్తున్నవాళ్లు బటన్ల నొక్కుడుకు పడిపోవడం లేదు.

> నాయకులు ప్రజల గుండెల్లో ఉండాలిగానీ ఆస్తి పత్రాలపై కాదు. ఈ చిన్న లాజిక్‌ను మరచిపోయిన జగన్మోహన్ రెడ్డికి, ఆయన ఆజ్ఞలను అమలు చేస్తున్న అధికారులకు భారతదేశ చట్టాలపై శిక్షణ ఇప్పిస్తే మంచిది.



పరాకాష్ఠకు ఫొటోల పిచ్చి

ప్రజల గుండెల్లో తాను పదిలంగా ఉండేలా తన పాలన ఉంటుందని అధికారంలోకి వచ్చిన కొత్తలో జగన్ చెప్పారు. ఐదేళ్లు గడిచే సరికి ప్రజల గుండెల్లో ఉండే విషయం అలా ఉంచితే, ప్రజలు తనను గుర్తుపెట్టుకుంటారా అన్న అనుమానం ఆయనకు వచ్చినట్టుంది! అందుకే, ప్రతిచోటా తన ఫొటో ముద్రిస్తున్నారు. రైతుల వ్యక్తిగత ఆస్తి పత్రాలైన పట్టాదారు పాసు పుస్తకాలలో ప్రతి పేజీలో ఆయన తన ఫొటోను ముద్రింపజేస్తున్నారు. పరిమిత కాలం మాత్రమే అధికారంలో ఉండే ముఖ్యమంత్రికి శాశ్వతంగా ఉండే ఆస్తి పత్రాలపై తన ఫొటోలు ముద్రించుకొనే అధికారం ఉంటుందా? బలహీనవర్గాలకు కేటాయించిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన స్టాంప్ పేపర్లపై కూడా ఆయన ఫొటోను ముద్రించుకోవడం పరాకాష్ఠ. స్టాంప్ పేపర్‌పై ఇలా ఫొటోలు ముద్రించడాన్ని చట్టం అనుమతించదు. అందుకే బ్యాంకులు సదరు స్టాంప్ పేపర్ డాక్యుమెంట్లను తిరస్కరిస్తున్నాయి. జగన్మోహన్ రెడ్డి ముచ్చటపడుతున్నారే అనుకుందాం— చట్టం సమర్థించని విధంగా స్టాంప్ పేపర్లపై ఆయన ఫొటో ముద్రింపజేసిన అధికారిని సన్నాసి అంటే కూడా తప్పులేదు. నాయకులు ప్రజల గుండెల్లో ఉండాలిగానీ ఆస్తి పత్రాలపై కాదు. ఈ చిన్న లాజిక్‌ను మరచిపోయిన జగన్మోహన్ రెడ్డికి, ఆయన ఆజ్ఞలను అమలు చేస్తున్న అధికారులకు భారతదేశ చట్టాలపై శిక్షణ ఇప్పిస్తే మంచిది. గతంలో కూడా రంగుల పిచ్చితో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భవనాలపై వైసీపీ రంగులు వేసి వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారు. స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించి, తీరా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్వదేశీయుడి చేతిలో హత్యకు గురైన మహాత్మా గాంధీ తనను జాతిపితగా గుర్తించి గౌరవించాలని కోరలేదు! దేశం ఆయనకు ఇచ్చిన గౌరవం అది. అధికారంలో ఒక్కరోజు కూడా లేని నాయకులను కూడా మనం గుర్తించి గౌరవించుకున్నాం. ఎమర్జెన్సీ కాలంలో నాటి ప్రధాని ఇందిరాగాంధీ కుమారుడు సంజయ్‌గాంధీ జనాభా నియంత్రణ కోసం ప్రజలకు బలవంతంగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించారు. ఇప్పుడు మళ్లీ ఇంత కాలానికి జగన్‌రెడ్డి ప్రతి ఒక్కరి ఇంట్లో తన ఫొటో ఉండాలని కోరుకుంటున్నారు. ఒకవేళ మళ్లీ ఆయనే అధికారంలోకి వస్తే ప్రజల గుండెలపై బలవంతంగా తన బొమ్మను పచ్చబొట్టుగా వేయించినా ఆశ్చర్యపోవలసింది ఏమీ లేదు. నేరగాళ్లు రాజకీయాల్లోకి వచ్చి అధికారం అందుకుంటే పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పడానికి ఆంధ్రప్రదేశ్‌లోని పరిస్థితులే నిదర్శనం.

రూల్ ఆఫ్ లా... ఏదీ?

జగన్ పాలనలో ఏ వ్యవస్థకు కూడా గౌరవం లేదు. ఇసుక అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టు స్వయంగా ఇచ్చిన ఆదేశాలు కూడా రాష్ట్రంలో అమలు కావడం లేదంటే పాలనా యంత్రాంగం ఎంత భ్రష్టుపట్టి పోయిందో అర్థం చేసుకోవచ్చు. న్యాయస్థానాలు ఆదేశాలు మాత్రమే ఇవ్వగలవు. వాటిని అమలుచేసే యంత్రాంగం న్యాయస్థానాల వద్ద ఉండదు. అందుకే జగన్‌రెడ్డి సుప్రీంకోర్టు ఆదేశాలను లెక్కచేయడం లేదు. ఇటువంటి ధోరణులకు అడ్డుకట్ట పడని పక్షంలో ఆంధ్రప్రదేశ్‌లో రూల్ ఆఫ్ లా కుప్పకూలిపోతుంది. ఇదే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ ఉంటుందా? అన్న సందేహం కలగక మానదు. ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో ప్రజల వ్యక్తిగత ఆస్తులకు కూడా భద్రత ఉండదు. వివాదాలు సృష్టించి కబ్జాలకు పాల్పడతారు. దేవుడిని, మతాన్ని విశ్వసించే జగన్మోహన్ రెడ్డి ప్రజలు ఇచ్చిన అధికారంతో న్యాయపాలన చేయాలన్న సూత్రాన్ని ఎలా విస్మరిస్తున్నారో తెలియదు. కృష్ణశాస్త్రి చెప్పిన అద్భుతలోకం జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో ఆవిష్కృతమైంది. దేవుడు నిశ్శబ్దంగా ఉన్నప్పటికీ ప్రకృతి తన ధర్మాన్ని నిర్వర్తిస్తూనే ఉంటుంది. అధర్మం పెచ్చరిల్లినప్పుడు ప్రకృతి విధిగా కల్పించుకుంటుంది. గుంటూరు జిల్లాలో జనసేనాని పవన్ కల్యాణ్ కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను దుండగులు ధ్వంసం చేయడం వంటి దురాగతాలు జగన్ పాలనలోనే సాధ్యం. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఉంది. అయినా దుండగులు బరితెగించి మరీ హెలిప్యాడ్‌ను ధ్వంసం చేయగలిగారంటే రూల్ ఆఫ్ లా అమలు కావడం లేదని భావించాల్సిందే. ఈ దుస్థితిని చక్కదిద్దడానికి ప్రకృతి రంగ ప్రవేశం చేయవలసిందే. చూద్దాం! ఏం జరగనుందో! జగన్ చెబుతున్నట్టు దేవుడు రాయబోతున్న స్క్రిప్ట్ ఎలా ఉండబోతున్నదో వేచి చూద్దాం!

> ఎన్నికల్లో కొంతమందికి కొన్ని టికెట్లు ఇచ్చినంత మాత్రాన సామాజిక న్యాయం జరిగినట్టేనా? 'నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీలూ' అని జగన్ రాగాలు తీసి పాడుతున్నారు సరే, ఆ వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా పురోగతి సాధించాయా? అంటే లేదనే చెప్పుకోవాలి. అధికారం, ధనం, వనరులు అన్నీ జగన్మోహన్ రెడ్డి వద్ద కేంద్రీకృతమైనప్పుడు సామాజిక న్యాయం ఎలా సాధ్యం? ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ముఖ్యమంత్రి సామాజిక వర్గానికి చెందినవారే కదా ఉన్నారు? చట్టాలు, రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారమే బడుగులకు చట్టసభలు, ఇతర పదవుల్లో వాటా లభిస్తోంది. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఐదుగురికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చానని గొప్పలు చెప్పుకొంటున్నారు గానీ ఆ ఐదుగురూ ఎవరో, వారికి ఉన్న అధికారం ఏ పాటిదో సదరు ఉప ముఖ్యమంత్రులకు కూడా తెలియదు. పార్టీలో, ప్రభుత్వంలో జగన్ సామాజిక వర్గానికి చెందిన వారే రాజ్యం ఏలుతున్నప్పుడు సామాజిక న్యాయం పాటించినట్టు ఎలా అవుతుంది?

> జగన్ పాలనలో ఏ వ్యవస్థకు కూడా గౌరవం లేదు. ఇసుక అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టు స్వయంగా ఇచ్చిన ఆదేశాలు కూడా రాష్ట్రంలో అమలు కావడం లేదంటే పాలనా యంత్రాంగం ఎంత భ్రష్టుపట్టి పోయిందో అర్థం చేసుకోవచ్చు. న్యాయస్థానాలు ఆదేశాలు మాత్రమే ఇవ్వగలవు. వాటిని అమలుచేసే యంత్రాంగం న్యాయస్థానాల వద్ద ఉండదు. అందుకే జగన్‌రెడ్డి సుప్రీంకోర్టు ఆదేశాలను లెక్కచేయడం లేదు. ఇటువంటి ధోరణులకు అడ్డుకట్ట పడని పక్షంలో ఆంధ్రప్రదేశ్‌లో రూల్ ఆఫ్ లా కుప్పకూలిపోతుంది. ఇదే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ ఉంటుందా? అన్న సందేహం కలగక మానదు. ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో ప్రజల వ్యక్తిగత ఆస్తులకు కూడా భద్రత ఉండదు. వివాదాలు సృష్టించి కబ్జాలకు పాల్పడతారు. దేవుడిని, మతాన్ని విశ్వసించే జగన్మోహన్ రెడ్డి ప్రజలు ఇచ్చిన అధికారంతో న్యాయపాలన చేయాలన్న సూత్రాన్ని ఎలా విస్మరిస్తున్నారో తెలియదు.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

సాధికారత ఎవరికి?

చుట్టూ మోహరించిన
కార్పొరేట్ బలాల నిఘాలో
ఈవీఎంలలో నిక్షిప్తమైన
మన వర్తమాన దేశ భవిష్యత్తు,
మీడియా స్వేచ్ఛ, న్యాయవ్యవస్థ—
ఊగిసలాటలో మొకరిల్లిన దుర్దశలో
భయం నీడలో మూలుగుతున్న
ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యం,
నిత్యావసర ధరల సుడిగుండంలో చిక్కి
విలవిలలాడుతున్న పౌరజీవితం
ఏ కూటమి గెలిచినా
వొరిగేదేమిటనే సామాన్యుడి నిర్వేదం,
ఉపాధి—మనుగడకు గ్యారంటీ ఇవ్వలేని
ఒకే ఒక వ్యక్తి ఆరాధనాస్వామ్యంలో
లోక్‌సభ నామినేషన్ల పరుగులో
కోటీశ్వరులదే ముందంజ—
నిజంగానే ఇది
శ్రమవిలువను కాజేస్తున్న సంపన్నుల దేశం!
నిత్యం గంగ కావేరీ తీరాలలో
మహాహారతిలో కరిగిపోతున్న కోట్ల ఆశలు,
కృష్ణాగోదావరి ప్రవాహాల సాక్షిగా
వ్యక్తిగత క్షుద్ర రాజకీయాల బురదను
పోటీపడుతూ మోస్తున్న ఊరేగింపులు,
ఇంతకు ఎవరికోసమీ సాధికారత?
వోటర్లకా? రాజకీయ దళారులకా?

— నిఖిలేశ్వర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

రాజభోగం

అన్ని పనులూ స్వయంగా చేసుకునేవాడు రాజెందుకవుతాడు?

రాజులను చారచక్షువులంటారు. అంటే రాజుకు గూఢచారులే కళ్ళు అన్నమాట. రాజుకు గూఢచారులే చూసి పెడతారు. మంత్రులే ఆలోచించి పెడతారు. సైన్యాధిపతులే యుద్ధాలు చేసి పెడతారు. మంత్రులు, సైన్యాధిపతులు కలిసి రాజ్యాలు జయించి పెడతారు. కవులు కావ్యాలు రాసి పెడతారు. వందిమాగధులు కీర్తిని సంపాదించి పెడతారు. అంటే కీర్తిని కూడా స్వయంగా సంపాదించుకోనక్కరలేదు.

విచిత్ర వీర్యుడి లాంటి వ్యసనపరుడికి భీష్ముడి లాంటి నమ్మిన బంటులు స్వయంవరాలకి వెళ్లి అందమైన రాకుమార్తెలను లాక్కొచ్చి పెళ్ళి చేస్తారు. వాడు చస్తే సంతానాన్ని కూడా సపె[illegible]స్తారు చచ్చినోడి ఎకౌంట్‌లో. గుడ్డి పెళ్ళికొడుకుని చూపించకుండా, గుడ్డివాడని చెప్పకుండా గాంధార దేశం లాంటి దూరదేశం నుంచి గాంధారి లాంటి అందమైన రెడీమేడ్ అమాయక పతివ్రతను తెచ్చి పెళ్ళి చేస్తారు. అనుభవించడమే గుడ్డి రాజు పని. రాజ్యమును భోగించడమే అతడి పని. దుర్యోధనుడి లాంటి ఆశబోతు తన భోగం కోసం పదిహేను అక్షౌహిణుల జనాన్ని చంపి, ఆ తర్వాత చిట్టచివరికి తను చచ్చాడు.

రాజుకు పిండివంటలన్నీ రుచి చూసి పెట్టే వాళ్ళు ఉంటారు. ఏమో ఎవరైనా విషం కలిపారేమో... డేంజరు కదా! టేస్టర్లు టేస్ట్ చేసి ఓకే అన్న తర్వాతే రాజు తింటాడు. రాజు బతికుండగా స్వయంగా చేసుకునేవి ఆహార నిద్రా మైథునాలే. అన్నీ అయ్యాక చివరికి చావడం మాత్రం స్వయంగా చేయక తప్పదు. అయినా రాచపీనుగు ఒంటిగా పోదు. తోడుగా ఇంకొక బంటు శవాన్ని శ్మశానానికి పంపుతారు.


నేనేదో వేళాకోళంగా అంటున్నాననుకోకండి. ఇప్పుడూ అటువంటి 'పాలకులు' ఉన్నారు. ఇది ప్రజాస్వామ్యం కనుక రాజులకు బదులు మంత్రులున్నారు. వీళ్ళల్లో కూడా చాలామందికి భోగించడమే పని. అన్ని పనులు చేసి పెట్టే వాళ్ళు ఉంటారు. వీళ్ళ తరఫున సంతకాలు చేసి, సాక్ష్యాలు చెప్పి, జైళ్ళకి పోయేవాళ్ళు ఉంటారు. పరిహారంగా ఎంగిలి చేయి విదిలిస్తారు. హత్యలైతే యావజ్జీవ కారాగార శిక్షలు కూడా అనుభవిస్తారు.

స్వయంగా యుద్ధం చేసేవారు, స్వయంగా కవిత్వం రాసేవారు, స్వయంగా పాలన చేసేవారు కృష్ణదేవరాయల్లాంటి వాళ్ళు అరుదుగా ఉంటారు.

మనం చేసుకోలేని పనిని డబ్బిచ్చి ఎవరి చేతనో చేయించుకుంటాం. వండుకోలేకపోతే వండిపెట్టే వాళ్ళని, గిన్నెలు తోమిపెట్టే వాళ్ళని, ఇల్లూడ్చిపెట్టే వాళ్ళని కిరాయికి తెచ్చుకుంటాం. రాజస్థాన్‌లో అయితే ఏడ్చేవాళ్ళు కూడా దొరుకుతారట. రాజులు, జమీందార్ల ఇంట్లో ఎవరైనా చచ్చిపోతే తాము ఏడవకుండా తమ బదులు ఏడ్చేవాళ్ళని కిరాయికి తెచ్చుకుంటారు. అలా ఏడ్చేవాళ్ళని (ఆడ వాళ్ళని) 'రుదాలీ' అంటారు. రోగమొచ్చి, ఓపిక లేక మూలుగు వస్తే మూలిగేవాళ్ళని కూడా కిరాయికి తెచ్చుకుంటారేమో అక్కడ! 'రుదాలీ'ల గురించి కల్పనా లాజ్మి అనే ఆవిడ హిందీలో సినిమా తీసింది. 1992లో ఆ చిత్రం విడుదలైయింది.

ఈ వ్యాసంలో ఇంతవరకు చెప్పినవి చాలామందికి తెలిసిన విషయాలే. కాని, మన సంగీత సాహిత్య చరిత్రకారులు, విమర్శకులు, పండితులు చెప్పిన మాటలన్నీ నిజాలేనని నమ్మవలసి వస్తే మన దేశంలోనే కాదు యావత్ ప్రపంచంలోనే కంఠీరవ రాజు వంటి అసాధారణ ప్రజ్ఞావంతుడు ఇంతకు ముందు పుట్టలేదు, ఇకముందు పుట్టబోడు. అంతటి అదృష్టవంతులు కూడా ఉండరు. ఇంతకీ ఎవరా 'మహా' పురుషుడు? అతడి పూర్తి పేరు కంఠీరవ నరసరాజు. క్రీస్తు శకం 1704 నుంచి 1713 వరకు మైసూరును పరిపాలించిన రాజు. అతడి గురించి ప్రత్యేకంగా మహాద్భుత విశేషంగా చెప్పుకోవలసినదేమిటంటే అతడు పుట్టు మూగవాడు, పుట్టు చెవిటివాడు. మూకరసు (మూగ రాజు) అనేది అతడి నామాంతరం. మాతృభాష కన్నడం అయినప్పటికీ సంస్కృతం, ప్రాకృతం, కన్నడం, తెలుగు, తమిళం భాషలలో యక్షగానాలు ఇతర కవితా రచనలు చేశాడట. అంతేకాదు సంగీత నాట్యాలలో విశారదుడట. 'వినికిడి', 'పలుకుబడి' అసలే లేని ఈ రాజు కేవలం హస్తసంజ్ఞలతోనే పదేళ్లు ప్రజారంజకంగా రాజ్యపాలన చేశాడట.

పుట్టుకతోనే మూగవాడు, చెవిటివాడు అయిన తాను సంగీత సాహిత్య నృత్య కళల సమాహారమైన యక్షగానాలు రచించాడు అని చెప్పుకుంటే జనం తన మొహం మీద కాకపోయినా చాటుగానైనా నవ్వుకుంటారేమోనన్న అనుమానం అతడికి రాలేదు. వచ్చినా 'డోంట్ కేర్. అయితే ఏంటంటా' అనుకున్నాడు. ఈ రాజు మీద సుప్రసిద్ధ సాహిత్య విమర్శకుడు నిడదవోలు వెంకటరావు గారు ఏడు దశాబ్దాల క్రిందట 1952లో 'భారతి' సాహిత్య పత్రిక రెండు వరుస సంచికలలో సుదీర్ఘ వ్యాసం రచించారు. ఆ వ్యాసాన్ని 'స్వరార్ణవం' మొదటి సంపుటంలో ప్రచురించాం. నిడదవోలు వారి వ్యాసంలో కొద్ది వాక్యాలు మచ్చుకు—



> రాజు బతికుండగా స్వయంగా చేసుకునేవి ఆహార నిద్రా మైథునాలే. అన్నీ అయ్యాక చివరికి చావడం మాత్రం స్వయంగా చేయక తప్పదు. అయినా రాచపీనుగు ఒంటిగా పోదు. తోడుగా ఇంకొక బంటు శవాన్ని శ్మశానానికి పంపుతారు. నేనేదో వేళాకోళంగా అంటున్నాననుకోకండి. ఇప్పుడూ అటువంటి 'పాలకులు' ఉన్నారు. ఇది ప్రజాస్వామ్యం కనుక రాజులకు బదులు మంత్రులున్నారు. వీళ్ళల్లో కూడా చాలామందికి భోగించడమే పని.

"...సాహిత్య పథకము యొక్క పరిణామమును సంగీత సాహిత్యములకు గల పరస్పర సంబంధమును వ్యక్తము సేయుచు, సంద్రతాముద్రను ప్రదర్శించు నీయక్షగానములు మిక్కిలి సూక్ష్మముగా పరిశీలింపదగినవి. అట్టివానిలో నీవఱకు పరిశోధకుల కెఱుగ రాకుండ కాల గర్భము నణగియున్న కంఠీరవ రాజు యక్షగానకృతులను గూర్చి, పదములను గూర్చి నేడు తెలుపుచున్నాను".

"... ఇతడు పుట్టుకచే మూగవాడును, చెవిటి వాడునై యుండెను. అందుచే నీతనికి 'మూకరసు' అను నామాంతరము. కేవలము హస్తసంజ్ఞల తోడనే రాజ్య కార్యములను నిర్వహించెడివాడు. అయితే భగవంతుడేదేని యంగవైకల్యమును గలిగించినప్పుడా వ్యక్తికేదేనొక విలక్షణమైన శక్తిని ప్రసాదించును. కంఠీరవ రాజునకు కమనీయమగు కవన శక్తియేగాక బహుభాషా వేతృత్వమును పరమేశ్వరుడు ప్రసాదించినాడు. ఇతని యక్షగాన రచనముల మూలమున నితడు సంగీత సాహిత్య నాట్య విద్యలందు నేర్పరియగుటతో పాటు సంస్కృతమున, ప్రాకృతమున, మాతృభాషయగు కన్నడమున, తెనుగున, తమిళమున కవితారచన చేయగలవాడని విశదమగుచున్నది. ఈతని విద్యా విశేషము మైసూరు చరిత్రకారులెవ్వరును నీవఱకు గుర్తించియుండలేదు.

"ఈ యక్షగాన రచనల వలన నీతడు దక్షిణాంధ్ర వాఙ్మయమునసేకాక యాంధ్ర వాఙ్మయమున గల రాజకవులలోనొక 'ప్రశస్తకవిగా నెన్నదగినవాడు".

అదీ సంగతి —

కంఠీరవ రాజుతోపాటు నిడదవోలు వారి 'ప్రతిభ'ను మెచ్చుకోవాల్సిందే.

■ నం.పా.సా

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఎన్నికల పరిశీలనకు 23 దేశాల ప్రతినిధుల రాక

న్యూఢిల్లీ, మే 4: భారత్ ఆహ్వానం మేరకు లోక్‌సభ ఎన్నికల పరిశీలనకు 23 దేశాలకు చెందిన ఎన్నికల సంఘాల ప్రతినిధులు ఢిల్లీ చేరుకున్నారు. ఆస్ట్రేలియా, రష్యా, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి వచ్చిన 75 మంది ప్రతినిధులు బృందాలుగా పర్యటిస్తారు. వారు మహారాష్ట్ర, గోవా, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించనున్నారు. వారితో పాటు ఐఎఫ్ఈఎస్ సభ్యులు, భూటాన్, ఇజ్రాయెల్‌కు చెందిన మీడియా బృందాలు కూడా పర్యటించనున్నాయి. సీఈసీ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధూ ఆదివారం విదేశాల ప్రతినిధులతో భేటీ కానున్నారు.

ప్రజ్వల్ తండ్రి హెచ్‌డీ రేవణ్ణ అరెస్టు

» రాసలీలలు, బాధితురాలి కిడ్నాప్ కేసుల్లో సిట్ చర్యలు



బెంగళూరు, మే 4(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వ్యవహారంలో ఆయన తండ్రి, జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణను ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అరెస్టు చేసింది. బాధితురాలి కిడ్నాప్, రాసలీలల కేసుల్లో ఏ1 నిందితుడైన హెచ్‌డీ రేవణ్ణ ముందస్తు బెయిల్ అభ్యర్థనను ప్రజాప్రతినిధుల కోర్టు శనివారం తిరస్కరించింది. ఆ వెంటనే రంగంలోకి దిగిన సిట్ అధికారులు.. పద్మనాభనగర్‌లోని మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ ఇంట్లో ఉన్న రేవణ్ణను అరెస్టు చేశారు. సిట్ అధికారులు నమోదు చేసిన మొదటి కేసులో బెయిలబుల్ సెక్షన్లు ఉండటంతో రేవణ్ణ అరెస్టు సాధ్యం కాదని తొలుత భావించారు. అయితే, బాధితురాలు కిడ్నాప్‌కు గురైన కేసులో ఆమెను ఇంటినుంచి తీసుకెళ్లిన రేవణ్ణ అనుచరుడు సతీశ్‌బాబణ్ణను శుక్రవారమే సిట్ అరెస్టు చేసింది. తాజాగా ఏ1 నిందితుడు రేవణ్ణను సిట్ అధికారులు అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా, ప్రజ్వల్ రాసలీలల వ్యవహారంపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య శనివారం సిట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజ్వల్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఆదేశించారు. సీబీఐ త్వరలోనే ప్రజ్వల్‌పై బ్లూ కార్నర్ నోటీస్ జారీ చేయనుందని, తద్వారా ప్రజ్వల్ కదలికలను గుర్తించేందుకు సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, ప్రజ్వల్ జర్మనీ నుంచి దుబాయ్‌కి అక్కడి నుంచి హంగేరీలోని బుడాపెస్ట్‌కి వెళ్లి తలదాచుకున్నట్లు సిట్ గుర్తించింది. ఇదిలా ఉండగా, రేవణ్ణ, ప్రజ్వల్‌ల నివాసాలలో సిట్ అధికారులు సోదాలు నిర్వహించి, పలు ఆధారాలను సేకరించారు.

వచ్చే ఐదేళ్లూ అవినీతిపై కొరడా

» అవినీతి ఊబిలో ఇండియా కూటమి నేతలు: మోదీ

సిసయియా, పలాము(ఝార్ఖండ్), మే 4: దేశంలోని అవినీతిపరుల మాస్కులను ఎన్డీయే ప్రభుత్వం తొలగించివేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. అవినీతికి పాల్పడినవారందరూ వచ్చే ఐదేళ్లలో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అవినీతి పరులకు మద్దతుగా ప్రతిపక్ష ఇండియా కూటమి ర్యాలీలు చేస్తోందని ఎద్దేవా చేశారు. ఝార్ఖండ్‌లోని లోహర్‌దగా, పలాము నియోజకవర్గాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అవినీతికి పాల్పడినందుకు ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి(హేమంత్ సోరెన్) కటకటాలపాలయ్యారు. ఆ రుగ్మతను అంతం చేయడానికి మోదీ కట్టుబడి ఉన్నాడు. అవినీతికి పాల్పడినవారందరూ వచ్చే ఐదేళ్లలో చట్టపరమైన చర్యలు ఎదుర్కొంటారు. పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిన ఇండియా కూటమి నేతలు అవినీతిపరులకు మద్దతుగా ఢిల్లీ, రాంచీలలో సహా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. అదే వారి నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తోంది' అన్నారు. ఉగ్రవాదం విషయంలో పాకిస్థాన్ పట్ల గత కాంగ్రెస్ ప్రభుత్వం మెతక వైఖరి అవలంబించిందని మోదీ విమర్శించారు. ఈ ఎన్నికల తర్వాత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవ్వాలని పాక్ నేతలు కోరుకుంటున్నారని చెప్పారు. 'గతంలో ఉగ్రవాదులు స్వేచ్ఛగా అమాయకులను చంపేసేవారు. నాటి ప్రభుత్వాలు పాకిస్థాన్‌కు ప్రేమ లేఖలు రాసేవి. వాటికి స్పందనగా పాకిస్థాన్ మరింతమంది ఉగ్రవాదులను పంపేది. కానీ, మీ ఒక్క ఓటు బలంతో నేను ఇక చాలని చెప్పాను. నేటి కొత్త భారతదేశం పత్రాలు ఇవ్వదు. ఇంట్లోకి దూరి కొట్టింది' అన్నారు. ఇటీవల మిలటరీ సమర్థ చర్యలు పాకిస్థాన్‌ను కోలుకోకుండా చేశాయని, దీంతో అంతర్జాతీయ సాయం కోసం ఆ దేశం వేడుకుంటోందని మోదీ ఎద్దేవా చేశారు. 'సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ దాడి పాకిస్థాన్‌ను వణికించాయి. దీంతో ఆ దేశం ఏడుస్తూ ప్రపంచమంతా తిరుగుతోంది. కాపాడండి.. కాపాడండి.. అని అరుస్తోంది' అన్నారు. గిరిజన జిల్లాల వెనుకబాటుకు కాంగ్రెసే కారణమని మోదీ నిందించారు. ఓటు బ్యాంకు కోసం గత కాంగ్రెస్ ప్రభుత్వం మావోయిస్టులపై చర్యలు చేపట్టలేదన్నారు. యూపీఏ పాలనలో గిరిజన చిన్నారులు పోషకాహార లోపంతో చనిపోతుంటే ఆహారధాన్యాలు గిడ్డంగుల్లో ముక్కిపోయేవని విమర్శించారు. ఇప్పుడు ఆ రాజకుటుంబం ఏమి చెప్పినా.. పేదలకు ఉచిత రేషన్ పంపిణీని భూమిపైనున్న ఏ శక్తీ అడ్డుకోలేదన్నారు. ఇదే మోదీ గ్యారెంటీ అని చెప్పారు.

మోదీ కోటలో ఉండే చక్రవర్తి

» ఆయన ప్రజలకు దూరమయ్యారు: ప్రియాంక గాంధీ

లఖానీ (గుజరాత్), మే 4: కాంగ్రెస్ నేత, తన సోదరుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి 'యువరాజు' అంటూ ప్రధాని మోదీ ఎద్దేవా పట్ల కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా దీటైన జవాబిచ్చారు. ప్రధాని మోదీ తన సోదరుడిని యువరాజు అంటున్నారని, అయితే ఈ యువరాజే కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4వేల కిలో మీటర్లు పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను విన్నారని చెప్పారు. మోదీని ప్యాలెస్‌లో ఉండే చక్రవర్తి అన్న ప్రియాంక.. ఆయన ఏనాడో ప్రజలకు దూరమయ్యారన్నారని విమర్శించారు. అధికారం కోసం గుజరాత్ ప్రజలను వాడుకుని, తర్వాత వారిని మరచిపోయారని ఆమె అన్నారు. శనివారం గుజరాత్‌లోని బనస్కాంత లోక్‌సభ నియోజకవర్గంలోని లఖానీ వద్ద కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్యాలెస్‌లో ఉంటారు. ఆయనను ఎప్పుడైనా టీవీలో చూశారా? ఆయన దుస్తులు చాలా శుభ్రంగా, వెంట్రుకలు చెక్కుచెదరకుండా ఉంటాయి. మీ కష్టాలు, ద్రవ్యోల్బణంతో మీపై అధిక భారం పడేది ఆయన ఎలా అర్థం చేసుకుంటారు?" అని ఆమె అన్నారు. రాహుల్ గాంధీని భారత్‌కు తదుపరి ప్రధానిని చేయాలని పాకిస్థాన్ తహతహలాడుతోందని, కాంగ్రెస్ అధికారం కట్టబెడితే మంగళసూత్రాలు, ఆభరణాలు దోచుకునేందుకు ఎక్స్‌రే మిషన్లను వాడతారంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యల పట్ల ప్రియాంక మండిపడ్డారు.

వారసత్వం రసవత్తరం

మూడుచోట్ల ములాయం కుటుంబసభ్యుల పోటీ



యూపీ మూడో దశలో 7న 10 సీట్లకు పోలింగ్

(సెంట్రల్ డెస్క్)

రసవత్తర రాజకీయానికి పేరుగాంచిన ఉత్తరప్రదేశ్‌లో మూడో దశలో ఆసక్తికర సమరం జరగనుంది. వారసత్వం, తిరుగుబాట్లు, చిరకాల విరోధుల మధ్య పోటాపోటీ నెలకొంది. ఈ నెల 7న మూడో దశలో యూపీలోని 10 సీట్లకు పోలింగ్ జరగనుంది. వీటిలో 3 స్థానాల్లో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) వ్యవస్థాపకుడు, దివంగత ములాయంసింగ్ యాదవ్ కుటుంబ సభ్యులే బరిలో ఉన్నారు. గట్టి ప్రత్యర్థులతో తలపడుతున్న వీరంతా విజయం సాధించడం ద్వారా తమ పెద్దల పేరు నిలబెట్టాలని భావిస్తున్నారు.

ములాయం ఇంటినుంచి మరో వారసుడొచ్చాడు

ఈ ఎన్నికల్లో ములాయం కుటుంబం నుంచి మరో నాయకుడు ఎన్నికల అరంగేట్రం చేస్తున్నారు. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ తొలుత తన బాబాయ్, జశ్వంత్‌నగర్ ఎమ్మెల్యే శివపాల్‌సింగ్ యాదవ్‌కు బదౌన్ టికెటిచ్చారు. కానీ, కుమారుడు ఆదిత్య యాదవ్ రాజకీయ ప్రవేశానికి ఇదే సరైన సమయమని భావించి ఆయన వెనక్కుతగ్గారు. ఇప్పుడు ఆదిత్య తరఫున అంతా తానై ప్రచారం చేస్తున్నారు. ఇక అఖిలేశ్ భార్య డింపుల్ యాదవ్ తమ కుటుంబ కంచుకోట మెయిన్‌పురి నుంచి మళ్లీ బరిలో నిలిచారు. ఇక్కడి నుంచి ఐదుసార్లు గెలిచిన ములాయం 2022లో చనిపోయారు. తర్వాత ఉప ఎన్నికలో డింపుల్ గెలిచారు. ములాయం మరో సోదరుడు, ఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంగోపాల్ యాదవ్ కుమారుడు అక్షయ్ ఫిరోజాబాద్‌ను వశం చేసుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. సంభాల్‌లో ఎస్పీ కుందర్కి నియోజకవర్గ ఎమ్మెల్యే జియాఉర్ రెహ్మాన్ బార్క్ పోటీ చేస్తున్నారు. ఈయన ఇటీవల మృతిచెందిన ఎంపీ షఫీఖుర్ రెహ్మాన్ బార్క్‌కు మనుమడు.

ఎటాలో కల్యాణ్‌సింగ్ కుమారుడికి..

యూపీ రాజకీయాలపై చెరగని ముద్రవేసిన మాజీ సీఎం కల్యాణ్‌సింగ్ కుమారుడు రాజ్‌వీర్‌సింగ్‌ను బీజేపీ ఎటా నుంచి నిలిపింది. ఫతేపూర్ సిక్రీలో కమలానికి తిరుగుబాటు తలనొప్పి తెస్తోంది. సిటింగ్ ఎంపీ రాజ్‌కుమార్ చహర్‌కు మరోసారి టికెట్ ఇచ్చింది. అయితే స్థానిక ఎమ్మెల్యే చౌదరి బాబూలాల్ కుమారుడు రామేశ్వర్ స్వతంత్రుడిగా పోటీకి దిగారు. 2014లో బాబూలాల్ ఎంపీగా గెలిచినా, 2019లో టికెట్ ఇవ్వలేదు. ఎంతచెప్పినా వెనక్కు తగ్గకపోవడంతో రామేశ్వర్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. బరేలీ నుంచి 8సార్లు గెలిచిన కేంద్ర మాజీ మంత్రి సంతోష్ గంగ్వార్‌ను తప్పించిన బీజేపీ రాష్ట్ర మాజీ మంత్రి ఛత్రపాల్ గంగ్వార్‌ను పోటీకి దించింది.

హథ్రస్‌లో ఈసారి తీర్పు ఏమిటో?

2020లో హథ్రస్‌లో దళిత యువతిపై సామూహిక అత్యాచారం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన హథ్రస్‌లో 2019లో బీజేపీ నుంచి రాజ్‌వీర్ సింగ్ డిల్లర్ గెలిచారు. ఈసారి ఆయనను కాకుండా అనూప్ ప్రధాన్‌ను నిలిపింది. ఎస్పీ.. రామ్‌జీలాల్ సుమన్ బదులు జస్వీర్ వాల్మీకీని పోటీకి దింపింది.

3వ దశలో పోలింగ్ జరిగే నియోజకవర్గాలు: సంభాల్, హథ్రస్, ఆగ్రా, ఫతేపూర్ సిక్రీ, ఫిరోజాబాద్, మెయిన్‌పురి, ఎటా, బదౌన్, ఓన్లా.

డిగ్గీ రాజా గట్టెక్కేనా?



సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగిస్తూ ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ మాజీ ఇన్‌చార్జి దిగ్విజయ్‌సింగ్ మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్‌లో గెలుపునకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఒకప్పటి కంచుకోట అయిన ఈ స్థానంలో 77 ఏళ్ల దిగ్విజయ్.. బీజేపీ సిటింగ్ ఎంపీ రోడ్మల్‌నగర్‌తో తలపడుతున్నారు. గత రెండు ఎన్నికల్లోనూ రోడ్మల్ ఇక్కడి నుంచి గెలుపొందారు. రాజ్‌గఢ్ లోక్‌సభ పరిధిలో 8 అసెంబ్లీ సీట్లుంటే.. 6 చోట్ల బీజేపీ ఎమ్మెల్యేలున్నారు. 2003లో అధికారం కోల్పోయిన అనంతరం 16ఏళ్ల ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు దిగ్విజయ్. 2019లో భోపాల్ నుంచి పోటీ చేసి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ చేతిలో పరాజయం పాలయ్యారు. ఇప్పుడు రాజ్‌గఢ్ నుంచి బరిలో దిగారు. ఇవే తనకు చివరి ఎన్నికలంటూ ప్రజల్లో సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారు. "అభ్యర్థిని కాదు.. మోదీని చూసి ఓటేయమని కోరుతున్నారు. ఆయన వచ్చి మీ సమస్యలు తీరుస్తారా? నన్ను గెలిపిస్తే అందుబాటులో ఉంటూ మార్పు చూపిస్తా"అని కోరుతున్నారు. 2018లో ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ కూల్చివేసిన కుట్రను వివరిస్తూ, ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దిగ్విజయ్ వెంట యువకులతో కూడిన వృత్తి నిపుణుల బృందం ఉంటోంది. వీరు కాల్ సెంటర్ నిర్వహిస్తూ రాజ్‌గఢ్‌లోని యువతతో అనుసంధానమవుతున్నారు. దిగ్విజయ్‌కు మద్దతుగా ఆయన భార్య, మాజీ జర్నలిస్టు అమృతా సింగ్ ప్రచారం చేస్తున్నారు.

మూడో దశలో చౌహాన్, సింధియా, అధిర్

రాజ్‌గఢ్‌కు మూడో దశలో పోలింగ్ జరగనుంది. దిగ్విజయ్‌తోపాటు ఈ ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్న ప్రముఖుల్లో బీజేపీ నుంచి మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్-విదిశ, కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా-గుణ (మధ్యప్రదేశ్) ఉన్నారు. ఇతర రాష్ట్రాల్లో ప్రహ్లాద్ జోషి-ధార్వాడ్ (కర్ణాటక), పల్లవి డెంపో-దక్షిణ గోవా, లోక్‌సభలో కాంగ్రెస్ సభాపక్షనేత అధిర్ రంజన్-బహరంపూర్ (పశ్చిమ బెంగాల్), ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్ యాదవ్-మెయిన్‌పురి (యూపీ) బరిలో ఉన్నారు.

- సెంట్రల్ డెస్క్

ప్రచారానికి నిధుల్లేవు.. పోటీ చేయలేను!

» టికెట్ వెనక్కిచ్చిన ఒడిశాలోని పూరీ కాంగ్రెస్ అభ్యర్థి సుచరిత



భువనేశ్వర్, మే 4: లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే సూరత్, ఇండోర్‌లలో ఆ పార్టీ అభ్యర్థులను కోల్పోయిన విషయం తెలిసిందే. తాజాగా ఒడిశా రాష్ట్రం పూరీ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగిన సుచరితా మొహంతి ప్రచారానికి నిధుల్లేవంటూ పోటీ నుంచి తప్పుకున్నారు. తన టికెట్‌ను వాపసు చేస్తున్నట్లు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌కు శనివారం లేఖ రాశారు. ఎన్నికల ప్రచారం కోసం పార్టీ నుంచి నిధులు అందడం లేదని ఆరోపించారు. సొంత నిధులతోనే ఎన్నికల్లో పోరాడాలని ఏఐసీసీ ఒడిశా ఇన్‌చార్జి అజోయ్ కుమార్ సూచించారని, తనకు అంత స్థోమత లేదని ఆమె పేర్కొన్నారు. పార్టీ నిధులు ఇవ్వకుండా పూరీలో ప్రచారం నిర్వహించడం సాధ్యం కాదని, అందుకే తన టికెట్‌ను వెనక్కి ఇస్తున్నట్లు తెలిపారు. పూరీ లోక్‌సభ స్థానానికి ఈ నెల 25న పోలింగ్ జరగనుంది. నామినేషన్ల సమర్పణకు తుది గడువు ఈ నెల 6. ఈ సమయంలో మొహంతి పోటీ నుంచి విరమించుకోవడంతో అక్కడ మరో అభ్యర్థి కోసం కాంగ్రెస్ పార్టీ అన్వేషించాల్సిన పరిస్థితి నెలకొంది.

బీజేపీలో చేరిన అర్విందర్ లవ్లీ

న్యూఢిల్లీ, మే 4 : ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)తో పొత్తును విభేదిస్తూ పార్టీని వీడిన ఢిల్లీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అర్విందర్ సింగ్ లవ్లీ శనివారం బీజేపీలో చేరారు. లవ్లీతోపాటు కాంగ్రెస్ మాజీ నేతలు రాజ్‌కుమార్ చౌహాన్, నసీబ్ సింగ్, నీరజ్ బసోయ, అమిత్ మాలిక్ కూడా కాషాయం కండువా కప్పుకున్నారు. ఆప్‌తో పొత్తు నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల సీట్ల కేటాయింపుల్లో పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాలపై నిరసన వ్యక్తం చేస్తూ వీరంతా కాంగ్రెస్‌ను వీడారు. కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి, పార్టీ జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డే సమక్షంలో శనివారం బీజేపీలో చేరారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించి బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టడం ఖాయమని, ఆ తర్వాత ఢిల్లీలోనూ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతుందని అర్విందర్ సింగ్ లవ్లీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. 2017లో తొలిసారి బీజేపీలో చేరిన లవ్లీ 2018లో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆయన తిరిగి బీజేపీ గూటికి చేరారు.

సీఎం రమేశ్‌పై దాడి

అనకాపల్లిలో డిప్యూటీ సీఎం బూడి అనుచరుల అరాచకం

అనకాపల్లి/దేవరాపల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి కూటమి అభ్యర్థి, బీజేపీ నేత సీఎం రమేశ్‌పై ఉప ముఖ్యమంత్రి, అనకాపల్లి పార్లమెంటు వైసీపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అనుచరులు దాడికి తెగబడ్డారు. గాయపడిన బీజేపీ నేతను పరామర్శించేందుకు వెళ్తున్నక్రమంలో సీఎం రమేశ్‌ను అడ్డగించడంతో పాటు.. ఆయనపై దాడి చేసి.. చొక్కా చింపేశారు. బూడి స్వగ్రామమైన దేవరాపల్లి మండలం తారువలో శనివారం ఈ ఘటన జరిగింది. గ్రామంలో బీజేపీ జెండా ఎగురవేశారనే కారణంతో ఆ పార్టీ నాయకులపై ముత్యాలనాయుడు అనుచరులు దాడి చేశారు. ఇంట్లో వస్తువులను ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న రమేశ్ హుటాహుటిన ఆ గ్రామానికి వెళ్లారు. అయితే పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి తరువాత విడుదల చేశారు. తమ పార్టీ వారిని ఇంట్లోకి దూరి కొట్టారని రమేశ్ బృందం ఆరోపిస్తూ బూడి, ఆయన అనుచరులపై ఫిర్యాదు చేసింది. హత్యాయత్నం కేసుగా నమోదు చేయాలని డిమాండ్ చేసింది.



సీఎం రమేశ్‌ను పోలీస్ వాహనంలో స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం.. పగిలిన జీపు అద్దాలు

అసలేం జరిగింది?

తారువలో బూడి బావమరిది(మొదటి భార్య సోదరుడు) గంగాధర్ బీజేపీ నాయకుడుగా ఉన్నారు. ఎన్నికల అధికారుల అనుమతితో శనివారం మధ్యాహ్నం డ్రోన్‌తో బీజేపీ జెండాను ఎగురవేసే ప్రయత్నం చేశారు. ఆ సమయానికి గ్రామంలోనే ఉన్న బూడి, ఆయన అనుచరులు తమను చంపడానికి డ్రోన్‌తో రెక్కీ నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ గంగాధర్, డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న కె. అప్పారావు, పాండురంగారావు, సాయికృష్ణలపై దాడి చేసి గాయపరిచారు. బాధితులు దేవరాపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని తెలుసుకున్న సీఎం రమేశ్, ఆయన అనుచరులు, మాడుగుల టీడీపీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి కుమారుడు అప్పలనాయుడు, కిలపర్తి భాస్కరరావుతో కలిసి పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. తమ పార్టీ కార్యకర్తపై బూడి హత్యాయత్నం చేశారని, న్యాయం చేయాలంటూ సీఎం రమేశ్ పోలీసు స్టేషన్ ముందు బైఠాయించారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గంగాధర్‌ను పరామర్శించేందుకు తారువ గ్రామానికి బయలుదేరారు. గ్రామంలో వైసీపీ నాయకులు రమేశ్ వాహనాన్ని చుట్టుముట్టి దాడికి యత్నించారు. కొందరు వాహనం అద్దం పగులగొట్టారు. ఇరువర్గాల తోపులాటలో వైసీపీ కార్యకర్తలు.. సీఎం రమేశ్ చొక్కా చింపేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు రమేశ్‌ను స్టేషన్‌కు తరలించేందుకు సిద్ధమయ్యారు. పోలీస్ వాహనంపై కూడా వైసీపీ మూకలు దాడికి పాల్పడి జీపు అద్దాన్ని పగులగొట్టాయి. పెద్ద సంఖ్యలో మోహరించిన వైసీపీ మూకలను పోలీసులు నిలువరించి రమేశ్‌ను మళ్లీ పోలీసు స్టేషన్‌కు తరలించారు. తమపై బూడి, ఆయన అనుచరులు హత్యాయత్నం చేశారని రమేశ్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై వైసీపీ, బీజేపీ మద్దతుదారులు వేర్వేరుగా ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న సీఎం రమేశ్

బూడి దౌర్జన్యాలను సాగనివ్వను: సీఎం రమేశ్

మంత్రి బూడి ముత్యాలనాయుడు దౌర్జన్యాలు, ఆగడాలను సాగనివ్వబోనని సీఎం రమేశ్ అన్నారు. దేవరాపల్లి పోలీసు స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ కార్యకర్తపై మంత్రి బూడి, ఆయన అనుచరులు దాడికి పాల్పడ్డారని తెలిసి పరామర్శించేందుకు వచ్చానన్నారు. పోలీసులను రెచ్చగొట్టే విధంగా ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. కార్యకర్తకు న్యాయం చేయాలని వస్తే తనపై కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమని సీఎం రమేశ్ ప్రశ్నించారు. డీఎస్పీ సాక్షిగా తన వాహనానికి అడ్డంగా బెంచీ వేసుకొని కూర్చుని బూడి ముత్యాలనాయుడు అడ్డుకున్నారని తెలిపారు. బూడి రెచ్చిపోయినా పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు.

బంగారం స్మగ్లింగ్ చేసిన అఫ్ఘాన్ దౌత్య అధికారిణి రాజీనామా

» దుబాయి నుంచి వస్తూ దుస్తుల్లో 25 కిలోల గోల్డ్

» ముంబైలో పట్టుకున్న డీఆర్ఐ అధికారులు



న్యూఢిల్లీ, మే4: భారత్‌లో అఫ్గానిస్థాన్ తాత్కాలిక రాయబారిగా పనిచేస్తున్న జాకియా వర్దక్ (58) శనివారం తన పదవికి రాజీనామా చేశారు. గత నెల 25న ముంబై విమానాశ్రయంలో రూ.18.6కోట్ల విలువైన 25కిలోల బంగారాన్ని స్మగ్లింగ్ చేయడానికి ప్రయత్నించి పట్టుబడ్డ నేపథ్యంలో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆమె దుబాయి నుంచి ఈ బంగారాన్ని తీసుకురాగా డీఆర్ఐవర్గాలు పట్టుకున్నాయి. ఆమెకు దౌత్యపరమైన రక్షణ ఉండడంతో అరెస్టు వంటి చర్యలు తీసుకోలేదు. ఆమె తొలుత ముంబైలోని కాన్సులేట్ కార్యాలయంలో చేరారు. తాలిబన్లకు ముందున్న అష్రాఫ్ ఘనీ పాలనలో ఆమె నియమితులయ్యారు. గతేడాది నుంచి న్యూఢిల్లీలో తాత్కాలిక రాయబారిగా వ్యవహరిస్తున్నారు. బంగారం పట్టుబడ్డ సంగతిని ప్రస్తావించనప్పటికీ కొంతకాలంగా తనపై, కుటుంబ సభ్యులపై దుష్ప్రచారం జరుగుతుండడంతో రాజీనామా చేసినట్టు తెలిపారు. విశ్వసనీయ వర్గాల ప్రకారం ఏప్రిల్ 25న జకియా వర్దక్ తన కుమారునితో కలిసి దుబాయి నుంచి ఎమిరేట్స్ ఫ్లైట్‌లో దిగారు. గ్రీన్ చానెల్ ద్వారా బయటకు బయలుదేరారు. 5ట్రాలీ బ్యాగులు, ఒక హ్యాండ్‌బ్యాగు, దిండు, ఒక స్లింగ్ బ్యాగు వారిదగ్గరున్నాయి. అయితే రాయబార కార్యాలయానికి చెందిన వారని తెలిపే ట్యాగులేవీవాటికి లేకపోవడంతో తనిఖీ చేశారు. ఆమెను తనిఖీ చేయగా ఆమె ధరించిన ప్రత్యేక తరహా జాకెట్, లెగ్గిన్, బెల్టు, మోకాలికి పెట్టుకున్న క్యాప్‌ల్లో ఒక్కోటి కేజీ బరువున్న 25బంగారు కడ్డీలు దొరికాయి.

ఖలిస్థాన్ పేరుతో మా ఎన్నికల్లో జోక్యం

» భారత్‌పై కెనడా ఆరోపణలు

» నిజ్జర్ హత్య కేసులో ముగ్గురు భారతీయుల అరెస్టు



కమల్‌ప్రీత్, కరణ్‌ప్రీత్, కరణ్ బ్రార్

న్యూఢిల్లీ, మే4: భారత్, కెనడాల మధ్య మరో దౌత్య పర వివాదం తలెత్తింది. తమ ఎన్నికల్లో జోక్యం చేసుకుంటోందంటూ భారత్‌పై కెనడా ఆరోపణలు చేసింది. ఖలిస్థాన్ వేర్పాటువాదుల సమస్య పేరుతో కెనడా రాజకీయ నాయకులపై ప్రభావం చూపిస్తోందని విమర్శలు చేసింది. రాజధాని అట్టావాలోని కమిషనర్ మారీ జోస్సీ హోగ్ శుక్రవారం సమర్పించిన మధ్యంతర నివేదికలో ఈ విషయాన్ని పేర్కొన్నారు. భారత దేశ అధికారులు, వారి ప్రాపకంతో కెనడాలో పనిచేస్తున్న కొందరు వ్యక్తులు రాజకీయ నాయకులు, వివిధ వర్గాలపై ప్రభావం చూపుతున్నారని తెలిపారు. 2019, 2021 ఫెడరల్ ఎన్నికల్లోనూ ఇదే విధంగా జోక్యం చేసుకున్నారని పేర్కొన్నారు. అయితే కెనడా ఎన్నికల వ్యవస్థ పటిష్ఠంగా ఉండడంతో ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపలేదని తెలిపారు. 194 పేజీలు ఉన్న ఈ నివేదికలో భారత్ పేరును 43 సార్లు ప్రస్తావించారు. చట్టబద్ధమైన ఖలిస్థాన్ అనుకూల రాజకీయ వాదనలకు, కెనడాలో అతి స్వల్పంగా ఉన్న ఖలిస్థానీ తీవ్రవాదానికి మధ్య ఉన్న తేడాను భారత్ గమనించడం లేదని, రెండింటినీ ఒకటిగానే భావిస్తోందని అభిప్రాయపడ్డారు. భారత అధికారుల తరఫున కెనడాలో 'ప్రాక్సీ ఏజెంట్లు' నెట్‌వర్క్ మాదిరిగా పనిచేస్తున్నారని ఆ నివేదిక తెలిపింది. భారత అనుకూల వ్యక్తులు విజయం సాధించేలా వారు అక్రమ మార్గాల్లో నిధులు కూడా అందజేస్తున్నారని ఆరోపించింది. భారత్‌తో పాటు చైనా కూడా ఎన్నికల్లో జోక్యం చేసుకుంటున్నట్టు ఆరోపించింది.

విద్యార్థి వీసాలపై వచ్చి ఏజెంట్లుగా ?

ఖలిస్థాన్ తీవ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో శుక్రవారం కెనడా పోలీసులు ముగ్గురు భారతీయులను అరెస్టు చేశారు. కరణ్‌ప్రీత్ సింగ్, కమల్‌ప్రీత్ సింగ్, కరణ్ బ్రార్‌లను అరెస్టు చేసినట్టు రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసుల అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. ఈ ముగ్గురు 20ల్లో ఉన్నవారే. వారిపై ఫస్ట్ డిగ్రీ మర్డర్ కేసులు పెట్టడంతో పాటు, హత్యకు కుట్ర పన్నారన్న ఆరోపణలను కూడా నమోదు చేశామని చెప్పారు. వారికి భారత్ ప్రభుత్వంతో ఉన్న సంబంధాలపై ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు. విద్యార్థి వీసాలపై వచ్చిన ఆ ముగ్గురు భారత్ నిఘా అధికారుల సూచనల మేరకు నిజ్జర్‌ను హత్య చేశారా అన్నదానిపై దర్యాప్తు చేయనున్నారు.

ఉగ్రవాదుల కాల్పుల్లో వాయుసేన జవాను మృతి

ఐదుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం


న్యూఢిల్లీ, మే 4: జమ్మూకశ్మీర్‌లో భారత భద్రతా బలగాలపై శనివారం ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ దాడిలో భారత వాయుసేనకు చెందిన ఓ జవాను మృతి చెందగా నలుగురు సైనికులకు గాయాలయ్యాయి. జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఉన్న శశిధర్ ప్రాంతంలో వాయుసేనకు చెందిన వాహనంతో పాటు మరో వాహనంపై ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు. గాయపడిన సైనికులను ఉదంపూర్ కమాండ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందన్నా రు. ఉగ్రవాదులను పట్టుకునేందుకు అదనపు బలగాలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. గతేడాది ఇదే ప్రాంతంలో సైన్యంపై వరుస ఉగ్రదాడులు జరగగా, ఈ ఏడాది ఇదే అతి పెద్ద దాడి. పూంచ్ జిల్లాలో మే 25న ఆరో విడతలో ఎన్నికలు జరగనున్నాయి.

భార్యతో అసహజ శృంగారం రేప్ కాదు

భోపాల్, మే 4: భార్యతో అసహజ శృంగారం జరపడం అత్యాచారం కిందికి రాదని మధ్యప్రదేశ్ హైకోర్టు తెలిపింది. ఇందుకు ఆమె అనుమతి తీసుకున్నారా, లేదా అన్నదానితో సంబంధం లేదని పేర్కొంది. వైవాహిక సంబంధం ఉన్నప్పుడు జరిగే అత్యాచారం నేరమేమీ కాదని న్యాయమూర్తి జస్టిస్ జి.ఎస్.అహ్లూవాలియా తెలిపారు. భర్త అసహజ శృంగారం, అత్యాచారం చేశాడంటూ అత్తింటికి దూరంగా ఉంటున్న భార్య కేసు పెట్టింది. విచారణ జరిపిన న్యాయమూర్తి.. ఐపీసీ సెక్షన్ 377లోని కొన్ని అంశాలు నేరపూరిత చర్యలు కావంటూ 2018లో సుప్రీంకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో దాన్ని ఆధారంగా చేసుకొని తాజా తీర్పును వెలువరించారు.

17 మందిని చంపిన నర్సుకు 760 ఏళ్ల జైలు!

పెన్సిల్వేనియా, మే 4: అమెరికాలో ఇన్సులిన్ డోసు పెంచి 17 మంది మరణానికి కారణమైన నర్సు హీథర్ ప్రెస్డీ(41)కి పెన్సిల్వేనియా కోర్టు 700 ఏళ్ల జైలు శిక్ష విధించింది. రోగుల పట్ల విసుగు చెందడం వల్లనే వారి ప్రాణాలు తీసినట్లు హీథర్ విచారణలో అంగీకరించింది. 2020 నుంచి 2023 మధ్యలో మొత్తం 17 హత్య కేసులు ఆమెపై నమోదు కాగా.. కోర్టు మూడు హత్యలు, 19 హత్యాయత్నాల కేసుల్లో హీథర్‌ను దోషిగా తేల్చింది. వైద్య సిబ్బందే రోగుల ప్రాణాలు తీసిన సంఘటనలు గతంలోనూ అమెరికాలో చోటుచేసుకున్నాయి. న్యూజెర్సీ, పెన్సిల్వేనియాల్లో ఛార్లెస్ కలెన్ అనే వ్యక్తి 29 మంది రోగులకు హై డోస్ ఇన్సులిన్ ఇచ్చి ప్రాణాలు తీశాడు. టెక్సాస్‌లో ఓ వ్యక్తి నలుగురు రోగుల ధమనుల్లోకి గాలి పంపించి చంపేశాడు.



జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

» అమరావతిని రక్షించుకోవాలి: బహుజన జేఏసీ

విజయవాడ ధర్నాచౌక్, మే 4: ప్రజా రాజధాని అమరావతి గొంతుపై సీఎం జగన్ విధించిన మూడు రాజధానుల కత్తి వేలాడుతూనే ఉందని, తాను మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖే రాజధాని అంటూ వైసీపీ మేనిఫెస్టోలో పెట్టడమే దీనికి నిదర్శనమని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపకపోతే రాష్ట్ర భవిష్యత్తుకు, మనుగడకు మార్గం ఉండదని హెచ్చరించారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో బాలకోటయ్య శనివారం విలేకరులతో మాట్లాడారు. 2019లో అమరావతే ఆంధ్రుల రాజధాని అని మేనిఫెస్టోలో పెట్టిన వైసీపీ 2024లో విశాఖ రాజధాని అని మేనిఫెస్టోలో ప్రకటించడం రాష్ట్రంలో ప్రాంతీయ వాదానికి బహిరంగంగా లైసెన్స్ ఇవ్వడమేనన్నారు. రాయపాటి శైలజ మాట్లాడుతూ అమరావతిని రక్షించుకునేందుకు రాబోయే ఎన్నికల్లో వైసీపీని సాగనంపాలని కోరారు.

తాడేపల్లిలో రూ.5.28 లక్షల డ్రగ్స్ స్వాధీనం

మంగళగిరి సిటీ, మే 4: ముఖ్యమంత్రి జగన్ నివాస ప్రాంతమైన గుంటూరు జిల్లా తాడేపల్లిలో సుమారు రూ5.28 లక్షల విలువైన మాదకద్రవ్యాలను మంగళగిరి ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకుని ముగ్గురు యువకులను అరెస్టు చేశారు. మంగళగిరి సెబ్ కార్యాలయంలో శనివారం సెబ్ డీఎస్ఈవో, అదనపు ఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. కుంచనపల్లి పరిధిలోని డీమార్ట్ ఎదురుగా ఉన్న సర్వీసు రోడ్డులో ముగ్గురు యువకులు డ్రగ్స్‌తో ఉన్నారన్న సమాచారంతో సెబ్ ఇన్‌స్పెక్టరు పి.ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. కృష్ణా జిల్లాకు చెందిన మల్లిశెట్టి రవికిరణ్ అలియాస్ కిట్టయ్య, ఆమారా రఘునందన సాంబమూర్తి అలియాస్ రఘు, దట్లా దేవీప్రసాద్ శశాంక్‌వర్మను అదుపులోకి తీసుకుని, వారి నుంచి సుమారు రూ.5.28 లక్షల విలువైన 88 గ్రాముల మేథాంఫిటమిన్(మెథ్), బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

రేపే ఏపీ ఐసెట్.. 113 కేంద్రాలు.. రెండు సెషన్లలో పరీక్షలు

అనంతపురం సెంట్రల్, మే 4: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం ఏపీ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్టును (ఐసెట్-2024) సోమవారం నిర్వహిస్తామని సెట్ చైర్మన్, ఎస్కేయూ వీసీ హుస్సేన్ రెడ్డి శనివారం తెలిపారు. ఏపీ, తెలంగాణ నుంచి 48,828 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 47 పట్టణాలతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్‌తో కలిపి మొత్తం 113 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

చంచల్‌గూడ జైలు నుంచి వైఎస్ భాస్కర్ రెడ్డి విడుదల

సైదాబాద్, మే4(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న ఎంపీ అవినాశ్ రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డి శనివారం బెయిల్‌పై విడుదలయ్యారు. సీబీఐ అధికారులు పులివెందులలో ఆయనను 2023 ఏప్రిల్ 16న అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. అప్పటి నుంచి జైలులో ఉన్న భాస్కర్ రెడ్డి గత సెప్టెంబరులో వైద్య కారణాలతో మధ్యంతర బెయిల్ పొంది, మళ్లీ తిరిగి జైలుకు వచ్చారు. తాజాగా వైద్య కారణాలతో శుక్రవారం హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ష్యూరిటీ పత్రాలు సమర్పించడంతో శనివారం సాయంత్రం బెయిల్‌పై విడుదలయ్యారు.

6న టీడీపీలో చేరుతున్నా: సినీ నిర్మాత నట్టి కుమార్

చోడవరం, మే 4: నారా లోకేశ్ సమక్షంలో ఈ నెల 6న టీడీపీలో చేరనున్నట్టు సినీ నిర్మాత నట్టికుమార్ తెలిపారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి విజయం తథ్యమన్నారు.

చేపల పేరుతో గొడ్డు మాంసం రవాణా

» నల్లగొండ స్టేషన్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో స్వాధీనం

గుంటూరు, నల్లగొండ, మే 4(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి లింగంపల్లి వెళ్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో 80 బీఫ్ (గొడ్డు మాంసం) బాక్సులను నల్లగొండ స్టేషన్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైలులోని ముందు, వెనుక లగేజీ బోగీల్లో ఈ బాక్సులను గుర్తించారు. ఒక లగేజీ బోగీలో 40, మరో లగేజీ బోగీలో 40 బాక్సులను ఫిష్ లేబుల్ అంటించి సికింద్రాబాద్ తరలిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ నాయకులు రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు స్టేషన్లలో రైలును ఆపేందుకు ప్రయత్నించారు. ఈ విషయం నల్లగొండ జీఆర్పీ పోలీసులకు తెలియడంతో.. రైలు నల్లగొండ రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే తనిఖీ చేసి, గొడ్డు మాంసం స్వాధీనం చేసుకున్నారు.

జగన్‌కూ కేసీఆర్ గతే: కె.లక్ష్మణ్

భీమవరం రూరల్, మే 4: 'తెలంగాణలో టీఆర్ఎస్‌తో విసిగిపోయిన ప్రజలు ఆ పార్టీని వెళ్లగొట్టారు. ఏపీలోనూ జగన్‌ను వెళ్లగొడతారు' అని బీజేపీ నేత కె.లక్ష్మణ్ చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శనివారం జరిగిన బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో ఉన్నంత అవినీతి ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదన్నారు.

మీ మానసిక స్థితిపై నాకు భయంగా ఉంది

జగన్... అద్దం పంపిస్తున్నా చూసుకో

» అందులో మీకు ఎవరి ముఖం కనిపిస్తోంది?
» చంద్రబాబుదా... మీదా..?
» నేను బాబుతో చేతులు కలిపానా!
» వైఎస్సార్ బిడ్డను... ఎంత మొండిదాన్నో మీకు తెలుసు
» నన్ను ఎవరూ కంట్రోల్ చేయలేరు
» కడపను, ప్రభుత్వ భూములను దోచేశారు
» చట్ట సభల్లో నిందితులు అడుగుపెట్టకూడదు
» అందుకే నేను కడప ఎంపీగా పోటీ చేస్తున్నా: షర్మిల


జగన్‌కు పంపుతున్న అద్దం చూపిస్తూ మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

కడప, మే 4(ఆంధ్రజ్యోతి): 'జగన్ గారూ... మీ కోసం అద్దం పంపుతున్నా. ఆ అద్దంలో చూడండి. మీకు మీ ముఖం కపిపిస్తుందా? చంద్రబాబు ముఖం కనిపిస్తుందా? నేను చంద్రబాబుతో చేతులు కలిపినట్లు, ఆయన కంట్రోల్ చేస్తున్నట్లు ఆరోపణలు చేస్తున్నారు. ఒక్క సాక్ష్యమైనా, ఒక్క ఆధారమైనా చూపించగలరా? మీరు ఒక భ్రమలో ఉన్నారు. మీ వైఖరి మాలోకాన్ని తలపిస్తోంది. జగన్... మీ మానసిక పరిస్థితిపై నాకు ఆందోళనగా ఉంది" అని ఏపీసీసీ చీఫ్, కడప పార్లమెంటు అభ్యర్థి వైఎస్ షర్మిల అన్నారు. శనివారం కడపలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలోనూ, వివేకా కూతురు డాక్టర్ సునీత, కడప కాంగ్రెస్ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్‌తో కలసి పాల్గొన్న రోడ్‌షోలోనూ ఆమె మాట్లాడారు. 'నా జన్మకు నేను చంద్రబాబును ఒక్కసారి మాత్రమే కలిశాను. నా కొడుకు పెళ్లికి పిలవడానికి వెళ్లాను. కానీ నేను చంద్రబాబుతో చేతులు కలిపానని, ఆయన కంట్రోల్‌లో ఉన్నానంటూ జగన్ ఏదో ఊహించుకుని మాట్లాడుతున్నాడు. నేను చంద్రబాబు చెబితేనే నీ కోసం 3,500 కి.మీ పాదయాత్ర చేశానా? బై బై బాబు అని క్యాంపెయిన్ చేశానా? సునీత, రేవంత్‌రెడ్డి కూడా చంద్రబాబు చెప్పినట్లు వింటారంట. బీజేపీ పొత్తు కూడా చంద్రబాబు మేనేజ్ చేశాడంట. చంద్రబాబును ఎవరు పెద్ద చేసి చూపిస్తున్నారో ఆలోచన చేయాలి' అని షర్మిల అన్నారు.

నేను జగమొండి...

'సునీత చేస్తున్న న్యాయ పోరాటం మీకు కనిపించలేదా? వివేకా హత్య వెనుక అవినాశ్‌రెడ్డి హస్తం లేకుంటే ఎందుకు మీకింత భయం? నేను చంద్రబాబు మనిషిని అంటున్నారు. నన్ను ఆయన కంట్రోల్ చేస్తున్నాడంట. నేను బాబు మాట వింటున్నానంట. నేను వైఎస్సార్ బిడ్డను. నేను ఎంతటి మొండిదాన్నో జగన్‌కు తెలుసు. నేను ఎవరో కంట్రోల్ చేస్తే తిరిగేదానిని కాను' అని షర్మిల స్పష్టం చేశారు.

వైఎస్సార్ పేరును చార్జిషీటులో చేర్పించింది పొన్నవోలు

'వైఎస్సార్ పేరును చార్జిషీట్‌లో చేర్పించింది కాంగ్రెస్ కాదు. జగన్ మనిషి. పొన్నవోలుతో పిటిషన్ వేయించి మరీ చేర్పించాడు. నిజానికి కేసు వేసింది మాజీ మంత్రి శంకర్‌రావు. కానీ కేసు చెల్లలేదు. ఎర్రన్నాయుడు వేసిన పిటిషన్ కోర్టు ఇంప్లీడ్ చేసింది. విచారణ చేయమని మాత్రమే ఆనాడు కోర్టు చెప్పింది. కానీ వైఎస్ పేరును అప్పటి పిటిషన్‌లో చేర్చలేదు. పొన్నవోలు సుధాకర్ సుప్రీంకు వెళ్లి పేరు చేర్పించారు. అందుకే జగన్ గుట్టుగా పొన్నవోలుకు పదవి ఇచ్చాడు. సీఎం అయిన ఆరు రోజులకే పోసింగ్ లెటరు ఇచ్చాడు. ఏ సంబంధం లేకుంటే ఆయనకు ఎందుకు పదవి ఇచ్చారు? కళ్ల ఎదుట అందరికీ స్పష్టంగా కనిపిస్తోంది కాంగ్రెస్‌కు, సీబీఐకి చార్జిషీట్‌కు సంబంధం లేదని' అని షర్మిల స్పష్టం చేశారు.

నిజాలు ఇప్పుడే తెలిశాయి

'మమ్మల్ని ఈ విషయంలో ఊసరవెల్లి అంటున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ కేసు పెట్టిందని నేను చెప్పినట్లు వీడియోలు ప్లే చేస్తున్నారు. నిజానికి ఆరోజు నాకు ఏం తెలియదు. సోనియాను కలిశాక విషయాన్ని తెలుసుకున్నా. ఈ మధ్య ఉండవల్లిని కలిసినప్పుడు మరింత తెలుసుకున్నా. జగనే కావాలని పెట్టించినట్లు స్పష్టం చేశారు. అన్ని నిజాలూ తెలుసుకున్న తరువాతనే కాంగ్రెస్ పెట్టలేదని నేను చెబుతున్నా. వివేకా హత్య తరువాత చంద్రబాబు హస్తం ఉందని ఆరోపించారు. సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం అయ్యాక సీబీఐ విచారణ వద్దన్నారు. నిజంగా చంద్రబాబు హస్తం ఉంటే ఎందుకు సీబీఐ విచారణ వద్దన్నారు? మీరు అప్పుడొక మాట, ఇప్పుడొక మాట మాట్లాడతారా?' అని షర్మిల మండిపడ్డారు.


వైసీపీ నేతలంతా ముఠాలుగా తయారయ్యారు

'గత ఎన్నికల్లో అందరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేశారు. ఇచ్చిన హామీలన్నీ గాలికి కొట్టుకుపోయాయి. మీకు ఇచ్చిన అధికారాన్ని అక్రమాలకు వాడుకున్నారు. ఈనాటి కడప అభివృద్ధి అంతా దివంగత వైఎస్ చేసిందే. వైసీపీ పాలనలో కడప అభివృద్ధి శూన్యం. కనీసం మంచినీరు ఇవ్వలేని పరిస్థితి. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయరు సురేశ్‌బాబు, ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి అంతా కలసి కడపను, ప్రభుత్వ భూములను దోచుకున్నారు. మద్యంలో తప్ప అభివృద్ధి లేదు. వివేకానందరెడ్డిని, అవినాశ్‌రెడ్డి చంపించారంటూ సీబీఐ వద్ద ఆధారాలు ఉన్నాయి. కానీ జగన్ తన పదవిని అడ్డుపెట్టుకుని మరీ కాపాడారు. చట్టసభల్లో నిందితులు అడుగు పెట్టకూడదు. అందుకే నేను కడప ఎంపీగా పోటీ చేస్తున్నా' అని షర్మిల అన్నారు.

రాష్ట్రంలో 20.19 లక్షల మంది మాదకద్రవ్యాలకు బానిసలు

» సీఎం జగన్‌కు షర్మిల 4వ లేఖాస్త్రం

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): "జగన్మోహన్‌రెడ్డీ... 'రాష్ట్రంలో మూడు దశల్లో మద్య నిషేధం అమలు చేస్తా. ఆ తరువాతే 2024 ఎన్నికల్లో ఓట్లు అడుగుతా' అని మీరు చేసిన ప్రకటనకు విరుద్ధంగా ఎందుకు వ్యవహరిస్తున్నారు?" అంటూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిలదీశారు. 'న్యాయ నవ సందేహాలు' పేరిట షర్మిల సీఎం జగన్‌కు శనివారం 4వ లేఖను విడుదల చేశారు. ఆ లేఖలో... 1) మీరు ప్రకటన చేసినట్లు మద్య నిషేధం హామీ ఎక్కడ? పాక్షికంగా అయినా అమలవుతోందా? 2) మూడు దశల్లో మద్య నిషేధాన్ని అమలు చేస్తామన్నారు. ఏమయింది? 3) మద్యం అమ్మకాలు రూ.20,000 కోట్ల నుంచి రూ.30,000 కోట్లకు పెరిగాయి. దీనిని ఎలా చూస్తారు? 4) 'మద్యం ద్వారా ఆదాయం అంటే ప్రజల రక్తమాంసాల మీద వ్యాపారం' అన్నారు. మరి మీరు చేస్తున్నదేంటి? 5) ఎక్కడా దొరకని 'జే' బ్రాండ్ మద్యం రాష్ట్రంలోనే అమ్ముతున్నారు. ప్రజల ప్రాణాలతో ఎందుకు చెలగాటంఆడుతున్నారు? 6) బేవరేజెస్ కార్పొరేషన్‌కు చేయూత, ఆసరా, అమ్మఒడి పథకాల అమలు బాధ్యతను అప్పగించడాన్ని ఎలా సమర్థిస్తారు?, 7) కేంద్రం వద్దంటున్నా బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా రూ.11,000 కోట్ల రుణం తీసుకోవాలని ఎలా అనుకున్నారు? ప్రయత్నించి భంగపడిన మాట వాస్తవం కాదా? 8) దేశం లో గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు పట్టుబడుతున్న రాష్ట్రాల్లో ఏపీ మొదటి స్థానంలో ఎందుకు ఉంటోంది?, 9) రాష్ట్రంలో 20.19 లక్షల మంది మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డారంటూ కేంద్రం నివేదిక ఇవ్వడాన్ని ఏమంటారు..! అది మీ వైఫల్యం కాదా?' అంటూ సూటిగా ప్రశ్నించారు.


చంద్రబాబు X.O పుస్తకం విడుదల చేస్తున్న దృశ్యం

చంద్రబాబు X.O పుస్తకం విడుదల

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడికి వివిధ రంగాల్లో ఉన్న మేధస్సు, అనుభవాలపై రాసిన ఒక పుస్తకం విడుదల అయ్యింది. చంద్రబాబు x.o పేరిట రాసిన ఆ పుస్తకాన్ని మాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ, రేరా మాజీ ఛైర్మన్ రామ్‌నాథ్ శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. పుస్తక రచయిత శ్రీనివాస్ ప్రసాద్, పబ్లిషర్ మిక్కిలినేని శ్రీకాంత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొడుకు బాకీ కింద తల్లి పింఛన్ జమ

» బ్యాంకు నిర్వాకం..రోజంతా పోరాడిన అవ్వ
» పంతం పట్టి సొమ్ము సాధించుకున్న వైనం


బ్యాంకు వద్ద కుర్చుని కన్నీరు పెట్టుకుంటున్న వృద్ధురాలు

విడపనకల్లు, మే 4: కొడుకు బకాయి ఉన్నాడని, తల్లికి పింఛన్ సొమ్ము ఇచ్చేందుకు ఆ బ్యాంకు నిరాకరించింది. రోజంతా పంతం పట్టి పోరాడి తన సొమ్ములను ఆ అవ్వ సాధించుకుంది. అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం వి.కొత్తకోట గ్రామానికి చెందిన రామలక్ష్మికి కెనరా బ్యాంకులో ఖాతా ఉంది. మూడు రోజులు క్రితం పింఛన్ డబ్బులు రూ.3 వేలు అందులో జమ అయ్యాయి. ఆమె సొంత డబ్బు మరో రూ.8 వేలు కూడా అదే ఖాతాలో ఉన్నాయి. రామలక్ష్మికి దగ్గు, ఆయాసం ఎక్కువగా ఉండటంతో వైద్యం కోసం బళ్లారికి వెళ్లాలని భావించారు. దీనికోసం డబ్బు డ్రా చేసేందుకు శనివారం తన కొడుకు నెట్టికల్లుతో కలిసి బ్యాంకుకు వెళ్లారు. తన ఖాతాను బ్లాక్ చేయించారని తెలుసుకుని ఆమె మేనేజర్‌ను కలిశారు.. 'నీ కొడుకు నెట్టికల్లు బ్యాంక్‌లో రూ.20 వేలు రుణం తీసుకున్నాడు. నీ డబ్బులు ఇవ్వటం కుదరదు' అని మేనేజర్ అనడంతో ఆమె తన పరిస్థితి వివరించారు. అయినా స్పందించకపోవడంతో, 'నా కొడుకు అప్పు ఉంటే వాడిని అడగండి. నా డబ్బులు ఎందుకు ఇవ్వరు..?' అని ఆమె మేనేజర్‌ను నిలదీశారు. తల్లి, కొడుకు మేనేజర్‌తో వాగ్వాదానికి దిగడంతో ఇద్దరినీ బ్యాంకు నుంచి బయటకు పంపించారు. బ్యాంకు ద్వారం వద్ద కూర్చుని రామలక్ష్మి కంటతడి పెట్టడం పలువురిని కలిచివేసింది. దిక్కుతోచని స్థితిలో విడపనకల్లు పోలీసులను ఆమె ఆశ్రయించారు. పోలీసులు వెళ్లి బ్యాంకు మేనేజరుతో మాట్లాడినా, డబ్బులు ఇవ్వడం కుదరదని తేల్చేశారు. చేసేదిలేక పోలీసులు వెనుదిరిగారు. కానీ రామలక్ష్మి పట్టు విడవకుండా సాయంత్రం వరకూ బ్యాంకు దగ్గరే కూర్చున్నారు. దీంతో తన తల్లితో బ్యాంకు అధికారులు తెల్లకాగితం, ఓచర్‌పై సంతకాలు తీసుకుని రూ.10 వేలు ఇచ్చి పంపించారని నెట్టికల్లు తెలిపారు.

రాలిన మరో పండుటాకు


షేక్ మౌలాబి

కారంపూడి, మే 4: పింఛన్ కోసం వెళ్లి అస్వస్థతకు గురై మరో పండుటాకు రాలిపోయింది. పల్నాడు జిల్లా కారంపూడి ఇంద్రనగర్‌కాలనీ వాటర్ ట్యాంక్ వీధికి చెందిన షేక్ మౌలాబి(75)..తన పింఛన్ బ్యాంక్ ఖాతాలో వేశారన్న సమాచారంతో గురువారం బ్యాంకు వద్దకు వెళ్లింది. అక్కడ గంటల తరబడి నిలబడిన ఆమె ఇంటికెళ్లి స్పృహ తప్పి పడిపోయింది. అనంతరం వాంతులు చేసుకుంది. అప్పటినుంచీ అనారోగ్యంతో బాధపడుతూ, శనివారం కన్నుమూసింది.



19న డైరెక్టర్స్ డే ఈవెంట్

దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతిని ప్రతి ఏటా మే 4న డైరెక్టర్స్ డేగా జరుపుకొంటున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా ఈ వేడుకలను తెలుగు డైరెక్టర్స్ అసోసియేషన్ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ మాట్లాడుతూ "దాసరి నారాయణరావు సినిమా పరిశ్రమకు పెద్ద దిక్కుగా ఉండేవారు. ఈ ఏడాది డైరెక్టర్స్ డే ఈవెంట్‌ను 19న సాయంత్రం ఆరు గంటలకు ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తాం" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, ప్రొడ్యూసర్ కౌన్సిల్ ప్రెసిడెంట్ నిర్మాత దామోదర ప్రసాద్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ సెక్రటరీ అనుపమ రెడ్డి, ఫిల్మ్ నగర్ కార్పోరేటర్ కాజా సూర్యనారాయణ, నిర్మాతలు ప్రసన్న కుమార్, సి కల్యాణ్, దర్శకులు అనిల్ రావిపూడి, వశిష్ఠ, గోపీచంద్ మలినేని, విజయ్ కనకమేడల, శంకర్, రేలంగి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

విజయ్ దేవరకొండతో మరో సినిమా



'ఫ్యామిలీ స్టార్' చిత్రం తర్వాత విజయ్ దేవరకొండతో మరో చిత్రాన్ని నిర్మించనున్నారు దిల్ రాజు, శిరీష్. 'రాజావారు రాణీవారు' సినిమాతో పేరు తెచ్చుకున్న దర్శకుడు రవికిరణ్ కోలా ఈ సినిమాను డైరెక్ట్ చేయనున్నారు. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో రూపుదిద్దుకొనే ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు విజయ్ దేవరకొండ పుట్టిన రోజు(మే 9)న వెల్లడిస్తారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనర్‌పై రూపుదిద్దుకొనే 59వ చిత్రం ఇది కావడం గమనార్హం.



రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం తాజా షెడ్యూల్ శనివారం ముంబైలో మొదలైంది. సుదీర్ఘంగా సాగే ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తామనీ, దీంతో మేజర్ పార్ట్ షూటింగ్ పూర్తవుతుందని యూనిట్ తెలిపింది. పూరీ జగన్నాథ్, చార్మీ కౌర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ

రెండు చిత్రాలు సెట్స్‌పైకి



ఈస్ట్ వెస్ట్ ఎంటర్టైనర్స్ బేనర్ సమర్పణలో ఒకే రోజు రెండు సినిమాల చిత్రీకరణ ప్రారంభమైంది. 'సీత ప్రయాణం కృష్ణతో', 'త్రిగుణి' చిత్రాల ముహూర్తం షాట్‌కు దర్శకుడు వీరశంకర్ కెమెరా స్విచ్ఛాన్ చేయగా, దాసరి మారుతి క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్లను ఆవిష్కరించింది. కామెడీ డ్రామాగా రూపొందుతున్న 'సీత ప్రయాణం కృష్ణతో' చిత్రంలో రోజా ఖుషీ, దినేశ్ జంటగా నటిస్తున్నారు. దేవేందర్ దర్శకుడు. 'త్రిగుణి' చిత్రంలో కుషాల్ కథానాయకుడు. వైతహవ్య వడ్లమాని దర్శకత్వం వహిస్తున్నారు.

పోస్టల్ ఓటుపై గందరగోళం!

- ఈ రోజు కాదు.. ఎల్లుండి రావాలన్న అధికారులు
- ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లినవారికి చుక్కెదురు
- కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యంతో తిప్పలు
- 8 వరకు ఉద్యోగులకు ఓటు వేసే అవకాశం

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగుల పోస్టల్ ఓటు హక్కుపై గందరగోళం నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 16లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేక భావంతో ఉన్నారు. దీంతో అప్రమత్తమైన అధికార పార్టీ తమకు అనుకూలురైన కొందరు ఎన్నికల అధికారుల సాయంతో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోకుండా గందరగోళం సృష్టిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫెసిలిటేషన్ సెంటర్లలో ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకోవడంపై ఎన్నికల సంఘం పదేపదే స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నా వైసీపీకి తొత్తులుగా వ్యవహరించే కొందరు అధికారులు ఉద్యోగులకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవరించారని ఆరోపణలు వస్తున్నాయి. కృష్ణా జిల్లాలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు జిల్లా ఫెసిలిటేషన్ కేంద్రంలో 4న ఓటు హక్కు వినియోగించుకోవచ్చని పీవోలకు పంపిన ఆర్డర్ కాపీలో పేర్కొన్నారు. తీరా శనివారం ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లినవారికి చుక్కెదురైంది. ఈ రోజు కాదు... ఎల్లుండి రండి అంటూ అధికారులు చెప్పడంతో వారంతా అక్కడే నిరసన వ్యక్తం చేశారు. కొందరు అధికారుల నిర్లక్ష్యంతో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ అభాసుపాలవుతోందని మండిపడుతున్నారు.

హోం ఓటింగ్ ఉద్యోగులపై స్పష్టత ఏదీ?

గుంటూరు జిల్లాలో కొందరు ప్రధానోపాధ్యాయులు, ఇతర అధికారులను పీవోలుగానూ, ఇతర ఎన్నికల విధుల్లోనూ నియమించారు. వారికి 5, 6 తేదీల్లో రెండో విడత శిక్షణ ఇస్తారు. అదే ట్రైనింగ్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ నియోగం కోసం ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశారు. కానీ పీవోలుగా నియమించిన వారిలో 70 మంది వరకు హోం ఓటింగ్ బృందంలో ఉన్నారు. ఈ నెల 3 నుంచి 8 వరకు హోం ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ ఉద్యోగులు 5, 6 తేదీల్లో ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు ఏ విధంగా వినియోగించుకోవాలనే అంశంపై స్పష్టత లేదు. ఇతర జిల్లాల్లో కూడా ఈ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని, దీనిపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిఉంటే ఈ గందరగోళం ఉండేది కాదంటున్నారు. ఎన్నికల విధుల్లోకి తీసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులు, అంగన్వాడీల పరిస్థితి అయోమయంగా మారింది. చాలాచోట్ల వీరికి ఫాం-12 కేటాయించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరెన్ని గందరగోళాలు సృష్టించినా మండుటెండను కూడా లెక్క చేయకుండా పలు జిల్లాల్లో ఉద్యోగులు శనివారం తమకు కేటాయించిన ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. చాలా జిల్లాల్లో 4 నుంచే ఈ ప్రక్రియ ప్రారంభం కాగా మిగిలిన జిల్లాల్లోనూ ఆదివారం నుంచి మొదలుకానుంది. ఆయా జిల్లా ఎన్నికల అధికారులు ఇప్పటికే షెడ్యూల్ ప్రకారం ఈ నెల 8 వరకు ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. కాగా.. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియపై అధికారులకు స్పష్టతనిచ్చి, ఈ ప్రక్రియను 6వ తేదీ వరకు పొడిగించాలని సీఈవో మీనాను టీడీపీ నేత వర్ల రామయ్య కోరారు.

పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేక సెలవు..

ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు ఒక్క రోజు ప్రత్యేక క్యాజువల్ సెలవును మంజూరు చేస్తూ మీనా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్నికల అక్రమాలపై నిఘా పరిశీలకులు

ఎన్నికల అక్రమాల నివారణకు పరిశీలకులను నియమించినట్లు సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ తెలిపింది. అనంతపురం-ఎస్.పి.టక్కర్, కర్నూలు-డబ్ల్యూ.ఆర్.రెడ్డి, నెల్లూరు-రామశంకర్ నాయక్, ప్రకాశం-డి.చక్రపాణి, గుంటూరు-జి.వి.కృష్ణారావు, కృష్ణా -రాజీవ్‌శర్మ, టి.సురేశ్‌బాబు, తూర్పుగోదావరి-స్కందన్ కుమార్ కృష్ణన్, విశాఖపట్నం-దిలీప్‌సింగ్, విజయనగరం-అజయ్ మిశ్రా, శ్రీకాకుళం-సి.బి.ఎస్.వెంకటరమణ (రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు), పశ్చిమగోదావరి-ఎ.లక్ష్మి (రిటైర్డ్ జిల్లా జడ్జి), కడప-సంతోష్‌మెహ్రా, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు. చిత్తూరు-పి.రఘు (రిటైర్డ్ ఐఆర్ఎస్).



అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలో హోమ్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర సీఈవో మీనా

ఓటేసి ఫొటో తీస్తే 3 వేలు..!

- కాకినాడలో పోస్టల్ ఓటింగ్‌పై ప్రభావితానికి వైసీపీ నేతల ప్రయత్నం

కాకినాడ సిటీ, మే 4: కాకినాడలో పోస్టల్ ఓటింగ్‌లో పాల్గొన్న ఉద్యోగుల ఓట్లు కొనేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేందుకు కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. తొలిరోజు పోలింగ్ ఇక్కడ ఉదయం 8.30 గంటలకు ప్రారంభమైంది. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, జనసేన నగర అధ్యక్షుడు తోట సుధీర్, జనసేన అధికార ప్రతినిధి దాసరి కిరణ్ ఆ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్న కొందరు సిబ్బంది సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసి బయటకు వచ్చి అధికార పార్టీ వారికి చూపించడాన్ని గమనించారు. దీనిపై టీడీపీ, జనసేన నాయకులు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఓటుహక్కు వినియోగించుకునే సిబ్బంది ఫెసిలిటేషన్ సెంటర్‌లోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లకుండా రిటర్నింగ్ అధికారి నిలుపుదల చేయించారు. అప్పటికి ఉదయం 10.30 గంటలైంది. అప్పటికే ఓటుహక్కు వినియోగించుకున్న కొందరు ఉద్యోగులు ద్వారంపూడి అనుచరులైన వైసీపీ నేతలకు ఫొటోలు చూపించి రూ.3వేలు తీసుకున్నట్టు సమాచారం.

మహిళలపై అసభ్య ప్రచారం చేస్తున్న వైసీపీవాళ్లపై ఏం చర్యలు తీసుకున్నారు?

- డీజీపీకి సీఈవో మీనా ఆదేశం

అమరావతి, అనకాపల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): మహిళలపై అసభ్యకరమైన ప్రచారం చేస్తున్న వైసీపీ కార్యకర్తలపై ఏం చర్యలు తీసుకున్నారో? డీజీపీ వివరణ ఇవ్వాలని రాష్ట్ర సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి ఫిర్యాదుపై ఎన్నికల సంఘం ఈ మేరకు స్పందించింది. తెలుగుదేశం పార్టీ మహిళా నేతలు పరుచూరి రమ్య, ఉండవల్లి అనూష, సందిరెడ్డి గాయత్రి ఈనెల 1వ తేదీన సీఈవో ముఖేశ్ కుమార్ మీనాను కలిసి వైసీపీ సామాజిక మాధ్యమాల్లో తమపై జరుగుతున్న వికృత దాడి గురించి ఫిర్యాదు చేశారు. పోలీసులకు 18 సార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఒక్క కేసులో కూడా చర్యలు చేపట్టలేదని వాపోయారు. రసీదులను కూడా మీనాకు సమర్పించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చాక కూడా వైసీపీ ఆగడాలు తగ్గకపోగా పెరిగాయని వివరించారు. ఫెక్ పేపర్ క్లిప్పింగ్స్‌లో అర్ధనగ్నంగా ఉన్న ఫొటోలకు తమ ఫొటోలను జత చేయడాన్ని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై తీవ్రంగా స్పందించిన మీనా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. తాము సీఈవోను కలిసిన విషయాన్ని తెలియజేస్తూ మహిళా నేతలు ఎక్స్ వేదిక ద్వారా పెట్టిన ఫొటోను సైతం వైసీపీకి అనుకూలంగా ఉండే దర్శకుడు రాం గోపాల్ వర్మ ప్రతిపక్ష నాయకుల ఫొటోలతో మార్ఫింగ్ చేసి తన అధికారిక ఎక్స్ ఖాతాలో పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆనం వెంకటరమణారెడ్డి ఈనెల 3న సీఈవో మీనా దృష్టికి తీసుకువెళ్లారు. కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఎన్నికల సీఈవో కార్యాలయం ముందు దిగిన ఫోటోను సైతం మార్ఫింగ్ చేయడంపై మీనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు ఆనం తెలిపారు. ఈ విషయంపై తక్షణమే డీజీపీ వివరణకు ఆదేశిస్తామని చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని సీఈవో హామీ ఇచ్చినట్లు ఆనం తెలిపారు. ఆ హామీ మేరకు డీజీపీ వివరణ ఇవ్వాలంటూ సీఈవో ఆదేశించినట్లుగా సీఈవో కార్యాలయం నుంచి ఈనెల 4న ఫిర్యాదుదారుల్లో ఒకరైన ఉండవల్లి అనూషకు లేఖ అందింది. సీఈవో కార్యాలయం వేగంగా స్పందించడంపై ఆనం హర్షం వ్యక్తం చేశారు.

పొన్నూరులో హెలిప్యాడ్ ధ్వంసం

- పవన్ పర్యటన అడ్డుకునేందుకు కుట్ర: జనసేన

పొన్నూరుటౌన్, మే 4: కూటమి అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర తరఫున ప్రచారం చేయడానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం గుంటూరు జిల్లా పొన్నూరు పర్యటనకు రానున్నారు. ఆయన పర్యటనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆమేరకు స్థానిక సజ్జా ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్లేస్‌లో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో వైసీపీకి చెందిన వ్యక్తులు హెలిప్యాడ్‌ను ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేశారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన కూలీలు వారిని ప్రశ్నించగా ఎక్స్‌కవేటర్‌ను లారీలో ఎక్కించుకుని వెళ్లిపోయారు. ఆ లారీ వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఫుడ్ కాంట్రాక్ట్ చూస్తున్న వ్యక్తి పేరుతో ఉన్నట్లు టీడీపీ, జనసేన నాయకులు గుర్తించారు. అనంతరం శనివారం ఉదయం హెలిప్యాడ్ వద్దకు చేరిన టీడీపీ, జనసేన నాయకులు నిరసనకు దిగారు. జనసేన అధినేత పర్యటనను అడ్డుకునేందుకే హెలిప్యాడ్‌ను ధ్వంసం చేశారని వారు ఆరోపించారు. అంబటి మురళి ఓటమి భయంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

రాజకీయ కుట్రతోనే ధ్వంసం: టీడీపీ

అమరావతి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): 'పొన్నూరు పట్టణంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నికల పర్యటనను అడ్డుకునేందుకు కుట్ర జరుగుతోంది. హెలీప్యాడ్‌ను ధ్వంసం చేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి' అని టీడీపీ నేతలు ఏఎస్ రామకృష్ణ, మన్నవ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు శనివారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి హరీంద్రప్రసాద్‌ను కలసి ఫిర్యాదు చేశారు. 'పవన్ పర్యటనను విఫలం చేసేందుకు కుట్రపూరితంగా ఈ విధ్వంసానికి పాల్పడ్డారు. ఎన్నికల తరుణంలో ఇలాంటి చర్యకు పాల్పడిన వారిపై, అందుకు కారణమైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి' అని వారు ఈసీకి ఫిర్యాదు చేశారు.

పెన్షన్ మరణాలకు జగన్, జవహర్‌రెడ్డి కారణం: వర్ల

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): 'జగన్ పాలనలో పెన్షన్‌దారులు బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కుంటిసాకులు, జగన్నాటకాలతో జగన్, జవహర్‌రెడ్డి పెన్షన్‌దారుల ప్రాణాలు తీస్తున్నారు' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మండిపడ్డారు. 'జగన్ రాజకీయ కక్షతోనే పింఛన్‌దారులను ఇబ్బంది పెడుతున్నారు. పింఛన్‌దారులకు జగన్ సమస్యలను సృష్టించి ఆ నెపాన్ని చంద్రబాబుపై నెడుతున్నారు. తాను చేసిన తప్పును ఎదుటి మనిషిపైకి నెట్టడంలో జగన్ దిట్ట. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నైతిక విలువలతో పనిచేశారు. జగన్‌కు ఆ నైతిక విలువలు లేవు. జగన్ నువ్వు నిజంగా దేవుని నమ్ముకుంటే ఇంత మంది ఉసురుపోసుకుంటావా? జగన్‌కు ప్రయోజనం కల్పించేందుకు పింఛన్‌దారులను జవహర్‌రెడ్డి ఇబ్బంది పెట్టారు. జగన్, జవహర్‌రెడ్డి చర్యలతోనే పెన్షన్ మరణాలు సంభవించాయి' అని వర్ల అన్నారు.

దూదేకుల నిధులనూ వాడేసుకున్న వైసీపీ ప్రభుత్వం: షరీఫ్

అనంతపురం రూరల్, మే 4: 'దూదేకులు... రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన సామాజికవర్గం. వారి రాజకీయ, ఆర్థిక ఎదుగుదలకు గత ప్రభుత్వంలో చంద్రబాబు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేశారు. నిధులు కేటాయించారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దూదేకుల ఫెడరేషన్ నిధులను వాడుకుంది. ఇంత దౌర్భాగ్య పరిస్థితి ఎన్నడూ చూడలేదు' అని శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్ మండిపడ్డారు.

వైసీపీ ఉక్కిరిబిక్కిరి

ఎన్నికల వేళ ల్యాండ్ టైటిల్ సెగ..చట్టం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

నేడు ముఖ్యనేతలతో జగన్ భేటీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రైతుల భూముల హక్కులకు ముప్పు తెచ్చేలా ఉన్న ల్యాండ్ టైటిల్ చట్టం సెగ అధికార వైసీపీకి, ముఖ్యమంత్రి జగన్‌కు గట్టిగానే తగులుతోంది. భూములు, ఆస్తులకు ఎసరు పెట్టేలా జగన్ సర్కారు ఈ చట్టం రూపొందించడంపై రైతులు, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎన్నికల వేళ వైసీపీ నాయకులను నిలదీతలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ల్యాండ్ టైటిల్ చట్టాన్ని వ్యతిరేకించడంతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకాల నిండా ముఖ్యమంత్రి జగన్ ఫొటోలు వేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇలాకా పులివెందులలో ఏకంగా ఆయన సతీమణి భారతిని సొంత పార్టీ నేతలే నిలదీశారంటే ప్రజల్లో ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో ఇన్నాళ్లూ తాను చేసిందే చట్టం అన్నట్టుగా వ్యవహరించిన సీఎం జగన్ స్వరంలోనూ మార్పు వస్తోంది. ఎన్నికల ప్రచార సభల్లో ప్రతిపక్ష నేతలపై విమర్శలకే పరిమితమవుతూ వస్తున్న జగన్.. ల్యాండ్ టైటిల్ చట్టంపై వివరణ ఇచ్చేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దంటూ ప్రజలను వేడుకుంటున్నారు. ఈ చట్టం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో పార్టీ ముఖ్య నేతలతో చర్చించాలని నిర్ణయించారు. ఆదివారం ఎన్నికల బహిరంగ సభల్లో కూడా పాల్గొనకుండా పార్టీ నేతలతో సమావేశం కానున్నారు. ఈ చట్టంపై ప్రజలకు స్పష్టత ఇచ్చేలా పార్టీ ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేయాలని జగన్ భావిస్తున్నారు. ప్రజలకు నచ్చజెప్పేలా 47,000 బూత్ కమిటీ సభ్యులు, స్థానిక నేతలను సన్నద్ధం చేయాలని నిర్ణయించారు.

తొలిసారి జగన్ వేడుకోలు

ఎన్నికలకు పట్టుమని పది రోజులు కూడా లేని సమయంలో ల్యాండ్ టైటిల్ చట్టంపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత అధికార పార్టీకి ప్రతికూలంగా మారుతోంది. ల్యాండ్ టైటిల్ చట్టం, పాస్ పుస్తకాలపై ఫొటోల వ్యవహారంపై ప్రజాగ్రహాన్ని మొదట్లో ముఖ్యమంత్రి తేలిగ్గా తీసుకున్నారు. ఎన్నికల వేళ వైసీపీ విజయావకాశాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఏర్పడటం, మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ఓటర్లలో తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో జగన్ శిబిరంలో ఆందోళన మొదలైంది. ల్యాండ్ టైటిల్ చట్టం వల్ల ప్రయోజనాలే తప్ప నష్టాలేమీ లేవంటూ శనివారం హిందూపురం సభలో ప్రజలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వారిని అభ్యర్థిస్తూ మాట్లాడారు. కాగా, ల్యాండ్ టైటిల్ చట్టంపై రాష్ట్ర మంత్రులు విరుద్ధంగా మాట్లాడుతూ.. ప్రజలను మరింత గందరగోళానికి గురి చేస్తున్నారు. అసలు లేని చట్టాన్ని ఎలా అమలు చేస్తారంటూ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించగా.. ముఖ్యమంత్రి జగన్ చట్టాన్ని అమలు చేసి తీరుతారంటూ మరో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. కాగా, వైఎస్ కుటుంబానికి పులివెందుల కంచుకోట లాంటిది. అయితే ఇప్పుడు పులివెందుల ప్రజలు నిరసన గళం విప్పుతున్నారు. జగన్ తరఫున ప్రచారం చేస్తున్న భారతీరెడ్డిని నిలదీస్తున్నారు. ఇకవివేకా హత్య కేసులో సొంత చెల్లెళ్లు షర్మిల, సునీత విమర్శలకు సమాధానం చెప్పలేని పరిస్థితి. ఎన్నికల వేళ ల్యాండ్ టైటిల్ చట్టం కారణంగా ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. ఎన్నికల్లో దీని ప్రభావం పార్టీపై ఉంటుందని వైసీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్రానికి నేడు షా... రేపు మోదీ

అమరావతి, రాజమహేంద్రవరం, ధర్మవరం, మే 4:(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ ప్రచారం వేడెక్కుతోంది. బీజేపీ అగ్రనేతలు ప్రచారం కోసం రాష్ట్రానికి క్యూ కట్టారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేడు బెంగళూరు నుంచి హెలీకాప్టర్‌లో ధర్మవరం చేరుకుని బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి సత్యకుమార్ ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు. ప్రధాని మోదీ 6న రాజమహేంద్రవరం వస్తున్నారు. అక్కడ నుంచి కళింకోట వెళ్తారు. కాగా, రాజమహేంద్రవరంలో ప్రధాని విజయ శంఖారావం సభకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

1నే జీతాలు, పెన్షన్లు..

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడడం ఖాయం. ఉద్యోగులకు ఐఆర్, పీఆర్సీ అమలు చేస్తాం. ఒకటో తేదీన జీతాలు ఇస్తాం. రిటైరైనవారికీ 1నే పెన్షన్లు చెల్లిస్తాం. ప్రజలకు ఉచితంగా ఇసుక అందజేస్తాం. మద్యం జే బ్రాండ్లు రద్దు చేస్తాం. మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నీ అమలు చేసి తీరతాం. మూడు పార్టీలు ఏకమై పోటీచేస్తున్న తర్వాత రాష్ట్రంలో మరొకరికి స్థానం లేదు. నరకాసుర వధ తరహాలో జగనాసుర వధ చేసి జూన్ 4న దీపావళి మాదిరిగా పెద్దఎత్తున రాష్ట్ర ప్రజలు పండుగ చేసుకోవాలి.

- రాష్ట్రంలో కూటమి, కేంద్రంలో ఎన్డీయే మేనిఫెస్టోలు ప్రజల ఆకాంక్షలను ప్రతి బింబిస్తూ కళకళలాడుతుంటే.. వైసీపీ మేనిఫెస్టో వెలవెలబోతోంది. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్‌లతో రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరతాయి.
- వేల కోట్ల అవినీతి చేసిన జగన్ క్లాస్‌వార్ అంటున్నారు. అందిన కాడికి దోచుకుని.. అధికారం పోతే క్యాష్ పోతుందని పైకి క్లాస్‌వార్ అంటూ పేదలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి జగన్‌ది క్లాస్‌వార్ కాదు.. క్యాష్ కోసం వార్.
- పెన్షన్ రూ.200 నుంచి రూ.2వేలు చేసింది నేను కాదా? నేను వచ్చిన తర్వాత రూ.3 వేలు కాదు.. 4 వేల పింఛన్ ఏప్రిల్ నుంచే ఇంటికి పంపుతా, దివ్యాంగుల పింఛన్ 4 వేల నుంచి 6వేలు పెంచుతా.

- చంద్రబాబు





చించి చెత్తబుట్టలో వేయండి

చీకటి చట్టంతో బానిసలమవుతాం: చంద్రబాబు

- **ల్యాండ్ టైటిలింగ్ యాక్టు కాదు.. అది జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు**
- **ప్రజాగళంలో టీడీపీ అధినేత ధ్వజం**

ఒంగోలు/ఏలూరు/నూజివీడు/కాకినాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇది ఏపీ ప్రభుత్వ లాండ్ టైటిలింగ్ యాక్టు కాదు.. జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు.. ఈ నల్ల చట్టాన్ని చించి చిత్తుకాగితం చేసి చెత్తబుట్టలో వేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపిచ్చారు. 'భూమంతా జగన్‌దా? ఈ భూమి మీది కాదా? పట్టాదార్ పాస్‌పుస్తకం మీది కాదా? దీనిపై జగన్ ఫొటో ఎందుకు? ఆయన తాత ఇచ్చాడా? తండ్రి ఇచ్చాడా? మీకు కోపం రావడం లేదా? ఆ చట్టాన్ని చించి డస్ట్‌బిన్‌లో పడేయండి' అంటూ తన చేతిలో ఉన్న చట్టం ప్రతిని చించి ముక్కలు వేశారు. ప్రజాగళంలో భాగంగా శనివారం ఆయన ప్రకాశం జిల్లా దర్శి ఏలూరు జిల్లా నూజివీడుల్లో, కాకినాడ నగరంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో మాట్లాడారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కరప మండలం నడకుదురు నుంచి కాకినాడ సిటీలోని జగన్నాథపురం వంతెన మీదుగా సంతచెరువు సెంటర్ వరకు ఆరు కిలోమీటర్ల మేర భారీ రోడ్ షో నిర్వహించారు. ఆయా సందర్భాల్లో జగన్ పాలనపై నిప్పులు చెరిగారు. ఐదేళ్లుగా సంక్షేమం పేరుతో రూ.10 ప్రజలకు ఇచ్చి రూ.100 వారి నుంచి లాగేసుకున్నాడని, అలాగే రూ.వెయ్యి అవినీతి చేశారని ధ్వజమెత్తారు. టీడీపీ మళ్లీ వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవానికి జగన్ ప్రభుత్వం బడ్జెట్‌లో సంక్షేమానికి 15.80 శాతం మాత్రమే కేటాయిస్తే, గత టీడీపీ ప్రభుత్వం 19.50 శాతం ఖర్చుచేసిందన్నారు. సంక్షేమం అంటేనే టీడీపీ అని.. జగన్ వచ్చాక అనేక సంక్షేమ పథకాలను రద్దుచేశారని తెలిపారు. 'పెన్షన్లు రూ.200 నుంచి 2 వేలకు మేం పెంచి ఇస్తే.. అసలు పింఛన్లు ఇస్తున్నది తన ప్రభుత్వమే అన్నట్లుగా జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు' అని ధ్వజమెత్తారు. ఇంకా ఏమన్నారంటే..

జగన్‌దే భూములపై పెత్తనం..

ఈ సీఎం మన భూమి మీద కన్నేశారు. మనల్ని బానిసలను చేద్దామనుకుంటున్నారు. ఈయనో దొంగోడు.. బూచోడు. అడంగల్ దగ్గర నుంచి పట్టాదార్ పాస్‌పుస్తకం దాకా లేకుండా చేద్దామనుకుంటున్నాడు. వీటికి బదులుగా జిరాక్స్ ఇస్తాడంటా. ఆయన తెచ్చిన ఏపీ లాండ్ టైటిలింగ్ యాక్టు-2023 ఒక నల్ల చట్టం. దీని ద్వారా ప్రజల భూములపై జగన్, ఆయన ప్రైవేటు సైన్యం పెత్తనం చేస్తాయి. మేం అధికారంలోకి రాగానే ఈ చట్టాన్ని రద్దుచేస్తాం. అధికారం కోసం శవ రాజకీయాలు చేసే నాటకాలరాయుడు జగన్.. పేదలను చంపి వారి ద్వారా ఓట్లు లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే పింఛన్లను సచివాలయ సిబ్బందితో ఇంటి వద్దే ఇచ్చే అవకాశం ఉన్నా అలా చేయకుండా గత నెలలో సచివాలయాల చుట్టూ.. ఈ నెలలో బ్యాంకుల చుట్టూ వృద్ధులను తిప్పుతున్నారు. ఫలితంగా గత నెలలో 33 మంది, ఈ నెలలో ఏడుగురు చనిపోయారు. అందుకు జగనే బాధ్యత వహించాలి. జగన్ తన పాలనలో చెప్పిన నవరత్నాలు అడ్రస్ లేకపోగా నవ అన్యాయాలు, అక్రమాలు, అరాచకాలు సాగాయి. అందరినీ బానిసలను చేసి జగన్ ఒక్కడే నియంతగా రాజ్యమేలాలనుకుంటున్నారు. డబ్బంతా ఆయన దగ్గరే.. ఎంగిలి మెతుకులు మాత్రం మనకా? ఈ పరిస్థితి పోయేందుకు మే 13న ఫ్యాన్ రెక్కలు విరగొట్టి డస్ట్‌బిన్‌లో వేయాలి. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఇంటింటికీ గొడ్డలి వస్తుంది. అందుకే ఓటుతో జగన్‌ను ఫ్యాన్‌కు ఉరేయాలి. ఆయన పాలనలో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి వెళ్లింది. పోలింగ్ రోజు ప్రతి ఒక్కరూ వచ్చి ఓటువేయాలి. ఆ రోజు ఎండ అనే కారణంతో ఓటువేయకుండా ఉండొద్దు.



ప్రకాశం జిల్లా దర్శిలో నిర్వహించిన ప్రజాగళం సభకు హాజరైన జనం

సంపద సృష్టిస్తా.. పేదలకు అందిస్తా..

జగనేమో పేదల పక్షమంట.. మాదేమో క్లాస్‌వారంట! మేం చేసేది క్లాస్‌వార్ కాదు, మాది క్యాష్‌వార్. సంపద సృష్టిస్తా, పేదలకు అందిస్తా. ఆయనేమో ప్యాలెస్‌లో ఉంటాడంటా.. మీకేమో అగ్గిపెట్టెలాంటి ఇల్లు ఇస్తారంటా.. ప్యాలెస్‌లో 100 బెడ్‌రూమ్‌లు.. ఇదేమైనా మీ తాత జాగీరా? వేలకోట్లు స్వాహా చేయడమే కాకుండా పేదోడి పక్షాన ఉన్నాననడానికి సిగ్గులేదా? రాష్ట్రంలో ట్రాక్టర్ ఇసుక రూ.5 వేలయింది. 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారు. తెలుగుదేశం హయాంలో క్వార్టర్ మద్యం ధర రూ.60 ఉండేది. ఇప్పుడది రూ.200కి పెంచారు. పెరిగిన రూ.140 జలగకు వెళ్తోంది. భూగర్భ సంపదంతా దోచేయలేదా? పేదల కడుపు కొట్టేలా వ్యవహరించలేదా? సరైన నిర్ణయం తీసుకోవలసిన సమయం ఆసన్నమైంది. మీరంతా అధికారమిస్తే నా తొలి సంతకం మెగా డీఎస్సీపైనే. రెండో సంతకం చీకటి చట్టం రద్దు కోసమే. జగన్ ఇచ్చినదాని కంటే పేదలకు 15-20 శాతం అధికంగా ఇస్తా. వారి సంక్షేమమే నా ధ్యేయం. జగన్ ఇప్పటివరకు ఎంత నొక్కేశాడో.. అదంతా కక్కిస్తా.

ఆంధ్రుడా మేలుకో..!

ఉద్యోగాల కోసం ఇంకెన్నాళ్లు వలస వెళ్లాలి..

- **రాజంపేట 'యువగళం'లో నారా లోకేశ్**



రాజంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): "కడప సాక్షిగా ఏపీ ప్రజలకు పిలుపునిస్తున్నా.. ఆంధ్రులారా మేలుకోండి.. ఉద్యోగాల కోసం ఎన్నాళ్లు పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లాలి. మనకు పౌరుషం, ఆత్మగౌరవం లేవా..? పరిశ్రమలు తెచ్చుకోలేమా..? 63 ఏళ్లు కష్టపడి హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకున్నాం. ఆ చరిత్రను తిరగరాయడానికి అమరావతిని రాజధానిగా ప్రకటించాం. మన రాజధానిని అభివృద్ధి చేసుకుందాం.." అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణం రాయచోటి రోడ్డులోని కూచువారిపల్లెలో శనివారం సాయంత్రం ప్రముఖ యూట్యూబ్ చానల్ ఆదాన్ జర్నలిస్టు కిశోర్ వ్యాఖ్యాతగా జరిగిన 'యువగళం' కార్యక్రమంలో లోకేశ్ పాల్గొన్నారు. పలువురు యువతీ యువకులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. తప్పుడు కేసులు పెట్టి చంద్రబాబును అక్రమంగా 53 రోజులు జైలులో పెట్టారని, దీనికి కారకులైన వారిని ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంత బాబు దళితుడైన తన డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేశాడని, అయినా జగన్ ఆయనకు బాసటగా నిలుస్తున్నారని లోకేశ్ విమర్శించారు. తాము అధికారంలోకొచ్చిన వంద రోజుల్లో అనంత బాబు బాధితులను ఆదుకుంటామన్నారు. రాజంపేటలో లోకేశ్ చేపట్టిన యువగళం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.

మీ ఆస్తుల తనఖాకే ఆ చట్టం

మీ భూములను మీకు కాకుండా చేసే కుట్ర: పవన్

- **మీ ఆస్తులపై మీకు నియంత్రణ ఉండదు**
- **కోర్టు పరిధిలోనూ లేకుండా చేస్తారు**
- **ఏ మిథున్‌రెడ్డో, పెద్దిరెడ్డో, మోపిదేవో మీ భూములు కబ్జాచేసేస్తారు: పవన్**

రేపల్లెలో శనివారం నిర్వహించిన వారాహి విజయభేరి సభకు హాజరైన జనం, పవన్, అనగాని సత్యప్రసాద్ తదితరులు అభివాదం



మచిలీపట్నం/గుడివాడ/అవనిగడ్డ/బాపట్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): జనం ఆస్తులను తనఖా పెట్టడానికే జగన్ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తెచ్చారని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ దుయ్యబట్టారు. 'ఆ చట్టం ప్రకారం మీ ఆస్తుల మీద మీకు నియంత్రణ ఉండదు. కోర్టు పరిధిలో కూడా లేకుండా చేసి మీ భూములను మీకు కాకుండా చేసే కుట్ర ఇది' అని స్పష్టం చేశారు. వారాహి విజయభేరి యాత్రలో భాగంగా శనివారం ఆయన కృష్ణాజిల్లా గుడివాడ, అవనిగడ్డ, బాపట్ల జిల్లా రేపల్లెల్లో జరిగిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. మరో తొమ్మిది రోజుల్లో కూటమి ప్రభుత్వం రావడం ఖాయమని.. ఎన్ని సీట్లు.. ఎంత మెజారిటీ వస్తుందనేది తప్ప అధికారం రావడంపై ఎలాంటి సందేహం లేదని తెలిపారు. ప్రతి కుటుంబానికీ విద్య, వైద్యం, ఉపాధి కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నోట్లో బూతులు, రోడ్లపై గోతులు తప్ప సాధించింది ఏముందని ప్రశ్నించారు. 151సీట్లతో అధికారాన్ని ఇస్తే కనీసం తాగునీరు, సాగునీటికి కూడా నోచుకోని దుస్థితిలో కృష్ణాడెల్టాలోని తీరప్రాంత గ్రామాలు ఉన్నాయని అన్నారు. వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని బెదిరించి రాజకీయం చేయాలని జగన్ చూస్తున్నారని విమర్శించారు. ఇంకా ఏమన్నారంటే..

జిరాక్స్‌తో రుణాలిస్తారా?

మీ ఆస్తులు, భూములు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే జిరాక్స్ పత్రాలు ఇస్తారు. చిన్న ఇల్లు కట్టుకోవడానికి, బిడ్డలను చదివించుకోవడానికి లోన్లు తెచ్చుకుంటుంటాం. జిరాక్స్‌లతో రుణాలిస్తారా? ఒరిజినల్ పట్టాలు లేకుండా రైతులు రుణాలకోసం బ్యాంకులకు వెళ్తే అప్పులు ఇవ్వరు. బిడ్డలకు పసుపుకుంకుమ కింద జిరాక్స్ ఇస్తామా? కేంద్రం ముసాయిదా మాత్రమే పంపింది. అమలు చేయాలని చెప్పలేదు. ఈ చట్టంతో దొంగ చేతికి తాళాలు ఇచ్చినట్లే. మిధున్‌రెడ్డో, పెద్దిరెడ్డో లేక మోపిదేవో వచ్చి భూములను కబ్జా చేసేస్తారు. దానిని కోర్టు పరిధిలో లేకుండా చేసేస్తున్నారు. మీరు వైసీపీకి ఓటేస్తే కొరివితో తల గోక్కున్నట్లే. మీ ఆస్తులను మీరే వారిచేతిలో పెట్టినట్లే! జగన్ సరిహద్దు రాళ్లపై, భూమిపట్టాలపైనా తన బొమ్మ వేసుకున్నారు. జగన్ కుటుంబానికి ఎక్కడెక్కడి ఆస్తులు దోచుకోవడం మీద పిచ్చి ఉంది. జగన్ తాతగారి సమయంలో బెరైటీస్ గనులకు సంబంధించి దోచుకున్నారు. వీళ్లకు పిడికెడు గింజలు భూమ్మీద చల్లి పైరు పండించడం తెలియదు. మట్టిని తవ్వడం, ఖనిజాలు దోచేయడం, చెట్లు నరికేయడం మాత్రమే తెలుసు. గింజలు వేసి పండిస్తే కదా రైతు కష్టం తెలియడానికి. భూములు దోచుకోవడమే జగన్ స్వభావం. రైతులూ ఆలోచించి ఓటేయండి. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉండడానికి జగన్ పోలీసులను పనిచేయనిస్తే కదా! ఆయనే నేరగాళ్లకు అండగా ఉంటున్నారు. కూటమి ప్రభుత్వం బలమైన లా అండ్ ఆర్డర్ తీసుకొస్తుంది. పోలీసు వ్యవస్థను బలోపేతం చేసి చూపిస్తాం. చివరికి హోం మంత్రినయినా సరే కానిస్టేబుల్‌కు జవాబుదారీగా ఉండేలా చేస్తాం. రాష్ట్ర పునర్నిర్మాణం బాధ్యతలను కూటమి తీసుకుంటుంది. కూటమి కట్టింది నా కోసమో లేక చంద్రబాబు కోసమో కాదు. రాష్ట్రం కోసమే. నేను బతికుండగా రాష్ట్రానికి అన్యాయం జరగనివ్వను. ఐదేళ్లలో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశారు. ఎయిడెడ్ స్కూల్స్, కళాశాలలను మూసివేశారు. కూటమి అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీని విడుదల చేస్తాం. ఏడాదికి 4 లక్షల చొప్పున ఉద్యోగాలు ఇస్తాం, ఆక్వా రైతులను ఆదుకుంటాం. రక్షిత మంచినీటిని ప్రతి ఇంటికీ అందిస్తాం. దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పింఛను ఇస్తాం. మంచాన పడినవారికి 15 వేలు, తలసేమియాతో బాధపడేవారికి 10వేల చొప్పున ఇస్తాం. బూతులు తిట్టే వారిని మోకాళ్లపైన కూర్చోబెడతాం, రోడ్లను బాగుచేయిస్తాం, భగీరథుడిని స్ఫూర్తిగా తీసుకుని పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తాం. పర్యాటకంగా అభివృద్ధి చెందాల్సిన సముద్ర తీర ప్రాంతాన్ని పేకాట క్లబ్‌లకు కేరాఫ్‌గా మార్చేశారు. వైసీపీ వాళ్లకు బానిసలు కావాలి, సమగౌరవం వాళ్లకు నచ్చదు. ఇమడలేకే ఎంపీ బాలశౌరి, రాయుడు వైసీపీని వీడి జనసేనలో చేరారు. ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టం. రానున్న రోజుల్లో అధికార పీఠం మనదే. జగన్ అవినీతిని బద్దలు కొడతాం. బూతులు మాట్లాడేవారికి ఘోరీ కడతాం.

- ముఖ్యమంత్రిగా నువ్వెంత, ఎమ్మెల్యేగా వాళ్లెంత, వాళ్ల బతుకులెంత.. రానున్న ఎన్నికల్లో యువత కన్నెర్ర చేస్తే జగన్ తన స్థానం ఎక్కడో ఆలోచించుకోవాలి.
- భీమ్లానాయక్, వకీల్‌సాబ్‌వంటి సినిమాలను ఆపుకొంటే ఆపుకో. సినిమాలు, డబ్బులు వస్తుంటాయి పోతుంటాయి. ప్రతిదానికీ భయపడుతూ బతికే బతుకు కూడా వేస్ట్.

- పవన్ కల్యాణ్

ఏపీ అంటే అరాచకాలే

మహిళల మానాలు, దళితుల ప్రాణాలు తీస్తున్నారు

ఎన్డీఏ నేతల ధ్వజం

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అంటే అరాచకాలు, హత్యలు, అత్యాచారాలు, కబ్జాలు, దాడులు తప్ప ఇంకేమీ కనిపించడం లేదని ఎన్డీయే నేతలు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతోన్న దౌర్జన్యాలను యామినీ శర్మ(బీజేపీ), ఆనంద్ సూర్య(టీడీపీ), శివశంకర్(జనసేన) విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో తీవ్రంగా ఖండించారు. 'ధర్మవరంలో బీజేపీ కార్యకర్తను వైసీపీ రౌడీలు దారుణంగా కొట్టారు. మచిలీపట్నంలో జనసేన కార్యకర్త ఇంట్లోకి దూరి కొట్టారు. అనకాపల్లిలో పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేశ్‌పై దాడి చేశారు. ఇవన్నీ వైసీపీ రాక్షస, అరాచక స్వభావానికి అద్దం పడుతున్నాయి. ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి' అన్నారు. కాగా, అనకాపల్లి ఎన్డీయే అభ్యర్థి సీఎం రమేశ్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారంటూ ఆ పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగన్ ఆర్థిక నేరస్థుడని ఆయన అఫిడవిటే చెప్తుంది: కనకమేడల

న్యూఢిల్లీ, మే 4(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం జగన్ కరుడుగట్టిన ఆర్థిక నేరస్థుడని ఆయన దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్ చెబుతోందని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. 16నెలలు జైల్లో ఉన్న ఆర్థికనేరస్తుడు ప్రస్తుతం సీఎంగా ఉన్నారన్నారు. శనివారం, ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రం అల్లకల్లోలమవుతుందని ఆందోళన వెలిబుచ్చారు. కాగా, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి ఇప్పటివరకు ఫారం-12 దరఖాస్తులు అందలేదని ఈసీకి కనకమేడల ఫిర్యాదు చేశారు. ఏపీలో పోస్టల్ బ్యాలెట్ విధానం అస్తవ్యస్తంగా ఉందని, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మరో ఫిర్యాదులో ఈసీ దృష్టికి తీసుకెళ్లారు.



యలమంచిలిలో బాలకృష్ణ రోడ్‌షోకు హాజరైన అభిమానులు, కార్యకర్తలు

వైసీపీని భూస్థాపితం చేయాలి

- **ఎలమంచిలి సభలో నందమూరి బాలకృష్ణ పిలుపు**

ఎలమంచిలి (అనకాపల్లి జిల్లా), మే 4: రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోందని, వచ్చే ఎన్నికల్లో వైసీపీని భూస్థాపితం చేయాలని హిందూపురం శాసనసభ్యుడు, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్రం పాతికేళ్లు వెనక్కిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. శనివారం ఆయన అనకాపల్లి జిల్లా ఎలమంచిలి, రావికమతం మండలం కొత్తకోటలో రోడ్‌షో నిర్వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రానికి రావణ పాలకుడు.. జగన్ అని ఆరోపించారు. ఎమ్మెల్యే కన్నబాబురాజు రాజరిక వ్యవస్థలో మాదిరిగా ప్రజలందరినీ తన కాళ్ల కింద తొక్కేస్తున్నారని, ఆయన అరాచకాలకు అంతం పలకాలని పిలుపునిచ్చారు.

అవినీతి పాలనను అంతమొందించాలి: నారా రోహిత్



అనకాపల్లిలో నారా రోహిత్ రోడ్డు షో

అనకాపల్లి టౌన్, పలాస, మే 4: రాష్ట్రంలో అవినీతి పాలనను అంతమొందించాలని సినీనటుడు నారా రోహిత్ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి ఆయన అనకాపల్లి లో రోడ్‌షో నిర్వహించారు. వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, రహదారులను మెరుగుపరచలేని స్థితి నెలకొందని విమర్శించారు. కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ను, అనకాపల్లి అసెంబ్లీ జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణను గెలిపించాలని కోరారు. ఉదయం శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలో పర్యటించారు.

పులివెందులలో మీరేం చేస్తున్నారు?

- **స్థానిక నేతలపై జగన్ భార్య భారతి ఫైర్**

కడప, మే 4(ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సీఎం జగన్ సతీమణి భారతి స్థానిక ప్రజలు తనకు బ్రహ్మరథం పడతారని భావిస్తే.. ప్రతి ఇంటి వద్ద సమస్యలు ఏకరువు పెడుతున్నారు. దీంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆమె స్థానిక వైసీపీ నేతలకు క్లాస్ తీసుకున్నారు. 'మీరంతా ఏం చేస్తున్నారు. పింఛన్లు, ఇళ్ల స్థలాలు ఎవరికి అవసరమో గుర్తించలేని స్థితిలో ఉన్నారా' అంటూ మండిపడ్డారు. భారతి ప్రచారానికి వెళ్లినపుడు.. 'మాకు ఒక్క పథకమూ అందలేదు.. మా ఇంట్లో 5ఓట్లు ఉన్నాయి. మీకు ఓటు వేయం' అని ఓ మహిళ ఆమె ముందే తెగేసి చెప్పారు. మరో మహిళ తమకు ఇంటి పట్టా ఇచ్చి మళ్లీ లాక్కున్నారన్నారు. పలువురు ఆమెకు సమస్యలు విన్నవించారు. ఈ నేపథ్యంలో శనివారం ప్రచారానికి వెళ్లడానికిముందు భారతి స్థానిక వైసీపీ నాయకులకు క్లాస్ తీసుకున్నారని సమాచారం. సీఎం నియోజకవర్గంలో ప్రజలు ఇంకా పింఛన్, ఇళ్లపట్టా అడుగుతున్నారంటే ఎక్కడ లోపముందని మండిపడ్డారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం లేదా అని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



పులివెందుల మున్సిపాలిటీ ఇస్లాంపురంలో ప్రచారం నిర్వహిస్తున్న భారతి

ఆస్తులు.. అప్పుల్లో.. తెలుగు ఎంపీ అభ్యర్థులే టాప్

అమరావతి/న్యూఢిల్లీ, మే 4(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికలకు పోటీ చేస్తున్న వారిలో ఆస్తులు.. అప్పుల్లో రెండు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులే అగ్రస్థానంలో ఉన్నారు. దేశంలోని మొదటి పదిమంది ధనవంతుల్లో 8మంది తెలుగు వారు కాగా, ఇద్దరు బెంగాల్‌కు చెందిన వారున్నారు. రూ.వేల కోట్ల ఆస్తులున్న జాబితాలో గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్(రూ.5,705 కోట్లు) అగ్రస్థానంలో ఉండగా, రెండోస్థానంలో తెలంగాణలోని చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి(రూ.4,568కోట్లు) ఉన్నారు. నెల్లూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి(రూ.716 కోట్లు) మూడో స్థానంలో ఉన్నారు. భారీస్థాయిలో అప్పులున్న అభ్యర్థుల జాబితాలోనూ పెమ్మసాని చంద్రశేఖర్(రూ.1038 కోట్లు) అగ్రస్థానంలో ఉండగా.. రెండో స్థానంలో రూ.197 కోట్ల అప్పుతో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. కడప నుంచి పోటీలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వైఎస్ షర్మిల రూ.118కోట్ల అప్పులతో మూడో స్థానంలో నిలిచారు. ఈమె ఆస్తి రూ.181 కోట్లుగా ఉంది. దేశంలోనే ఎక్కువ ఆదాయం ఉన్న ఎంపీ అభ్యర్థుల్లో రాజంపేట కాంగ్రెస్ అభ్యర్థి షేక్ బషీర్ తొలిస్థానంలో ఉన్నారు. 4వ దశ పోలింగ్(ఈనెల 13న) జరగనున్న 96 పార్లమెంటు స్థానాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) నివేదికలో వెల్లడించింది. ఏపీలోని 25 పార్లమెంటు స్థానాలకు 450 మంది పోటీలో నిలవగా వీరిలో 128మంది కోటీశ్వరులేనని తెలిపింది. నాలుగో విడతలో పది రాష్ట్రాల్లోని 96స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఆయా స్థానాలకు మొత్తం 1,710 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వారు సమర్పించిన అఫిడవిట్లను ఏడీఆర్ విశ్లేషించింది. మొత్తం 360 మంది అభ్యర్థులు తమపై క్రిమినల్ కేసులున్నట్లు ప్రకటించగా 274 మంది తీవ్ర నేరారోపణలు ఉన్నట్లు తెలిపారు. నెల్లూరు పార్లమెంటు స్థానానికి వైసీపీ తరఫున పోటీలో ఉన్న వి. విజయసాయిరెడ్డిపై అత్యధికంగా 26 తీవ్రమైన క్రిమినల్ కేసులు, మరో 19 ఐపీసీ కేసులు ఉన్నాయి. కడప ఎంపీ, వైసీపీ ప్రస్తుత అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డిపై మర్డర్ కేసు(302 సెక్షన్) సహా ఏడు తీవ్ర నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. మహిళలపై నేరాలకు పాల్పడిన కేసుల్లో వైసీపీ అభ్యర్థులు బెల్లాన చంద్రశేఖర్, ఉమాబాల, నందిగం సురేశ్ నిందితులుగా ఉన్నారు. వైసీపీ తరఫున పోటీ చేస్తున్న మొత్తం 25మంది అభ్యర్థుల్లో 12 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. టీడీపీ తరఫున పోటీ చేస్తున్న 17 మందిలో 9 మందిపైన కేసులున్నాయి. వీరిలో ఆరుగురు తీవ్రమైన కేసులు ఎదుర్కొంటున్నారు.

మీ భూమి... నా ఇష్టం!

(మొదటి పేజీ తరువాయి)

దారుణంగా ఇంకా చెప్పాలంటే రాక్షసంగా రూపొందించింది. ఇది చూసి కేంద్రమే కంగుతింది. 'ఇది రాష్ట్ర చట్టం కాదు. కేంద్ర చట్టం' అని ఇప్పుడు జగన్, వైసీపీ పెద్దలు కబుర్లు చెబుతున్నారు. కానీ... 'నేనే ఫస్ట్' అని చెప్పుకొనేందుకో, భూములను భోంచేసేందుకో తెలియదుకానీ జగన్ దీనిపై అత్యుత్సాహం ప్రదర్శించారు. నీతి ఆయోగ్ వద్ద ముసాయిదా బిల్లు తయారయ్యేందుకు ఐదు నెలల ముందే... 2019 జూలైలో అసెంబ్లీలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ బిల్లును ఆమోదించారు. ప్రజలతో, వారి మనోభావాలతో ఏమాత్రం సంబంధం లేకుండా... తనకు తోచిన, తను అనుకున్న నిరంకుశ ధోరణిలో ఈ బిల్లును రూపొందించారు. కేంద్ర చట్టాలు, నిబంధనలను పట్టించుకోకుండా 'అంతా నా ఇష్టం' అన్నట్లుగా బిల్లును తయారు చేశారు. అయితే, 'భూమి' ఉమ్మడి జాబితాలో ఉండటంతో, ఈ బిల్లుకు కేంద్రం ఆమోదం తప్పనిసరైంది. ఆ దశలోనే కేంద్రం నుంచి చీవాట్లు పడ్డాయి. 2021, 2022లో కేంద్రం ఈ బిల్లును వెనక్కి పంపింది. ఐదు కేంద్ర ప్రభుత్వ చట్టాలను ధిక్కరించేలా, టైటిల్ చట్టమే దేశంలో 'సుప్రీమ్' అన్నట్లుగా ఈ బిల్లును రూపొందించినట్లు తేల్చింది. రాజ్యాంగానికి లోబడే ఈ బిల్లును తయారు చేశారా అని కేంద్రం ప్రశ్నించింది. 'అవుననుకుంటే... అదెలాగో వివరించండి' అని ఆదేశించింది. జగన్ సర్కారు ముచ్చటగా మూడోసారి 2023లో ఈ బిల్లును కేంద్రానికి పంపింది. అప్పుడు కూడా కేంద్రంవెనక్కి పంపించే పరిస్థితి ఉండటంతో.. జగన్ ఢిల్లీలో అధికారుల ద్వారా లాబీయింగ్ చేయించి మరీ ఆమోదం పొందారు. అంతకుముందు కేంద్రానికి పంపిన బిల్లులోని అంశాలను పరిశీలిస్తే...

'ట్రైబ్యునళ్ల'తో డీలింగ్

టైటిల్ చట్టంలో భాగంగా టైటిల్ రిజిస్ట్రేషన్, టైటిల్ అప్పిలేట్ ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. వాటికి సివిల్ కోర్టుల అధికారం అప్పగించాలని ప్రతిపాదించారు. అంతేకాదు.. ఈ ట్రైబ్యునళ్లు 'సివిల్ ప్రొసీజర్ కోడ్-1908'కు అతీతమని, దీనికి కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని బిల్లులో ప్రతిపాదించారు. ఇది 5 ఆఫ్ 1908 చట్టాన్ని ధిక్కరించేలా ఉందని కేంద్రం అభ్యంతరం చెప్పింది. దీంతో ట్రైబ్యునళ్ల ఏర్పాటు ప్రతిపాదనను సర్కారు వెనక్కి తీసుకుంది. కానీ.. టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, టైటిల్ అప్పిలేట్ ఆఫీసర్ అనే పోస్టులను సృష్టించింది. అంతకుముందు ట్రైబ్యునళ్లకు ప్రతిపాదించిన అధికారులనే కాస్త తగ్గించి ఈ అధికారులకు కట్టబెట్టింది.

ట్రైబ్యునల్ చెప్పిందే చట్టం...

"ట్రైబ్యునళ్లు ఏ నిర్ణయం తీసుకున్నా చట్టం అమలులో మంచి కోసమే అని భావించాలి" అంటూ బిల్లులోని 41వ క్లాజులో వింత భాష్యం చెప్పారు. ట్రైబ్యునళ్లలో ఉండేది ప్రభుత్వం నియమించిన అధికారులు/రిటైర్డ్ అధికారులే! అధికార పార్టీ నేతలతో ఒత్తిళ్లతో వీరు అడ్డగోలు నిర్ణయం తీసుకున్నా..దానిని 'మంచి కోసమే' అని భావించాలట! ఓ రైతు భూమిని మరొకరి పేరిట మార్చేసి టైటిల్ ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చినా అది మంచి కోసమనే భావించాలని ఈ క్లాజు సారాంశం. దీనిపై కేంద్ర హోం శాఖ అభ్యంతరం తెలిపింది. దీంతో ఆ క్లాజును బిల్లునుంచి వెనక్కి తీసుకున్నారు. కానీ... టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(టీఆర్వో), టైటిల్ అప్పిలేట్ ఆఫీసర్(టీఏవో)లకు దాదాపుగా ఇవే అధికారాలు కట్టబెట్టారు.

అసలుకే మోసం...

టైటిల్ రిజిస్ట్రేషన్, టైటిల్ అప్పిలేట్ ట్రైబ్యునళ్లు ఇచ్చే ఉత్తర్వులను జిల్లా కోర్టులో అప్పీల్ చేసుకోవచ్చని బిల్లులోని సెక్షన్ 55(1)(4)లో పేర్కొన్నారు. దీన్ని కేంద్ర న్యాయ శాఖ తప్పుపట్టింది. ఒకవైపు టైటిల్ చట్టంలో సివిల్ కోర్టుల ప్రమేయాన్ని నిషేధిస్తూ, మరోవైపు జిల్లా కోర్టుల్లో అప్పీల్ చేయవచ్చనడం పరస్పర విరుద్ధంగా ఉందని తెలిపింది. దీంతో ఆ బిల్లు నుంచి ఈ క్లాజును వెనక్కి తీసుకుంది. అలాగని.. సివిల్ కోర్టుల్లో అప్పీలుకు అవకాశం కల్పించిందా అంటే అదీ లేదు. టీఆర్వో, టీఏవోల నిర్ణయాన్ని సవాలు చేయాలంటే ఏకంగా హైకోర్టును ఆశ్రయించాల్సిందే. సివిల్, జిల్లా కోర్టులకు సంబంధమే లేదు. టైటిల్ బిల్లులోని సెక్షన్ 41 ప్రకారం... సివిల్ కోర్టుల ప్రమేయాన్ని నిషేధించడాన్ని కేంద్రం తప్పుపట్టింది. సివిల్ ప్రొసీజర్ కోడ్-1908కి ఇది విరుద్ధమని... దీన్ని మార్చుకోవాలని కేంద్ర హోం శాఖ స్పష్టం చేసింది. అయినా... జగన్ పట్టించుకోలేదు. సివిల్ కోర్టులను పక్కకు తోసేశారు.

పునరావాసం.. 'ప్రైవేటు' వ్యాపారం

టైటిల్ చట్టం ద్వారా ఏర్పాటయ్యే ల్యాండ్ అథారిటీ కింద ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు పెద్ద ఎత్తున పునరావాసం/ఉపాధి కల్పించేలా క్లాజులు చేర్చారు. చట్టం చేసే పనులను ప్రైవేటుకు అప్పగించేలా స్కెచ్ గీశారు. కొన్ని రకాల లైసెన్సుల జారీని ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు అప్పగించేలా క్లాజు 67 కింద ప్రతిపాదనలు చేశారు. అలా నియమితులయ్యే వారికి చట్టం పరిధిలో కీలక అధికారాలు కట్టబెట్టాలని భావించారు. ల్యాండ్ అథారిటీ వద్ద ఉండే రైతుల భూములు, ఆస్తుల డేటాను ప్రైవేటు వ్యక్తులు వినియోగించుకునేలా సెక్షన్ 68లో మరో వెసులుబాటు కల్పించారు. దీన్ని కేంద్రం తప్పుపట్టింది. ప్రభుత్వం వద్ద ఉండే డేటాను ప్రైవేటుకు ఫీజులు తీసుకొని ఇవ్వడాన్ని తప్పుపట్టింది. చట్టం పరిధిలో ప్రైవేటు వ్యక్తులకు విస్తృత అధికారాలు కల్పించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. టైటిల్ చట్టం అమలులో ఏవైనా ఇబ్బందులు, ఆటంకాలు ఎదురైతే వాటిని అధిగమించేందుకు ఎప్పుడంటే అప్పుడు చట్టంలో మార్పులు చేసుకునే అధికారాన్ని జగన్ సర్కారు కట్టబెట్టుకుంది. దీన్ని కేంద్రం తప్పుపట్టింది. ఈ చట్టానికి, దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అంత అపరిమిత అధికారాలు ఉండటానికి వీల్లేదని కేంద్ర హోం శాఖ స్పష్టం చేసింది. అపరిమిత సవరణలకు వీల్లేదని చెప్పింది. దీంతో చట్టం అమల్లోకి వచ్చిన రెండేళ్ల వ్యవధిలో ఏవైనా ఇబ్బందులు వస్తే వాటిని అధిగమించేలా సవరణలు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కేంద్ర భూ సేకరణ చట్టం-2013ను పూర్తిగా ధిక్కరించేలా టైటిల్ బిల్లును రూపొందించారు. భూ సేకరణ చట్టం కింద తీసుకునే ప్రతీ చర్యను నిర్దేశిత గడువులోగా టైటిల్ రిజిస్ట్రేషన్ ట్రైబ్యునల్‌కు నివేదించాలని ఉంది. గడువు మీరినా చెప్పకపోతే సంబంధిత అధికారులపై చర్య తీసుకునే అధికారం ఇచ్చారు. వీటిని కేంద్రభూవనరుల విభాగం తప్పుపట్టింది.

అంతా మా ఇష్టం...

రిజిస్ట్రార్, సబ్‌రిజిస్ట్రార్‌లను టైటిల్ రిజిస్ట్రేషన్ సేవలకు వాడుకుంటామని 27వ క్లాజు ప్రతిపాదించారు. రిజిస్ట్రేషన్ శాఖలోని ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజీ) సేవలను టైటిల్ రిజిస్ట్రేషన్ ట్రైబ్యునల్‌కు వాడుకుంటామన్నారు. ఇది రిజిస్ట్రేషన్ చట్టం-1908కు విరుద్ధమని కేంద్రం తేల్చింది. టైటిల్ రిజిస్ట్రేషన్ ట్రైబ్యునల్, అప్పిలేట్ ట్రైబ్యునల్‌లు కోరిన సమాచారం వ్యక్తులు ఇవ్వాల్సిందే. ఇవ్వకపోతే ఆరు నెలల జైలు శిక్షతోపాటు 50వేల రూపాయల జరిమానా విధించే అధికారాన్ని ట్రైబ్యునళ్లకు కట్టబెట్టారు. దీన్ని కేంద్ర హోం శాఖ తప్పుపట్టింది. దీంతో ఆ క్లాజును మార్చారు. జైలు శిక్షను తీసేసి, తప్పుడు సమాచారం ఇస్తే జరిమానా విధిస్తామని చట్టం చేశారు. అయితే... ఇచ్చిన సమాచారం తప్పో, రైటో తేల్చేది ప్రభుత్వం నియమించే అధికారులే! టైటిల్ చట్టం అమలులో ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు అపరిమిత అధికారాలతో పెత్తనం చెలాయించేలా ఈ బిల్లును రూపొందించడం గమనార్హం. ప్రజల ఆస్తులు, రైతుల సాగు భూముల డేటా వారి చేతుల్లో పెట్టాలనుకున్నారు. కేంద్ర ఆదేశాలతో 'ప్రైవేటు' ప్రస్తావన తీసి నా... మిగిలిందంతా దాదాపు సేమ్ టు సేమ్!

సాక్షులను లేపేద్దాం!

నకిలీ రిజిస్ట్రేషన్ల ముప్పు

వేలిముద్రల తొడుగులతో చాలా నేరాలు జరుగుతున్నాయి. ప్రజల ఖాతాల్లోని డబ్బులు దోచేస్తున్నారు. అలాంటిది, రాష్ట్ర ప్రజల వేలిముద్రలు ఏదో ప్రైవేటు కంపెనీకి చేరవేస్తే ప్రజల ఆస్తులకు, ఖాతాలో డబ్బులకు రక్షణ ఉంటుందా? ఆ వేలిముద్రలు ఉపయోగించుకుని నకిలీ రిజిస్ట్రేషన్లు జరగవని గ్యారంటీ ఏముంది? ఏదైనా భూ వివాదం తలెత్తి కోర్టు వరకు వెళ్తే సాక్ష్యం కింద చూపించడానికి వేలిముద్రల రిజిస్టరే ఉండదు. పైగా సాక్షులు కూడా ఉండరు.

- జనం ఆస్తులు కొట్టేసే ప్లాన్‌లో తదుపరి వ్యూహమా?
- ఇకపై సాక్షులు లేకుండానే రిజిస్ట్రేషన్లు
- ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం.. రెడీగా ఉత్తర్వులు
- పోలింగ్ పూర్తవగానే అమలుకు సన్నాహాలు పూర్తి!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఏదైనా నేరం జరగ్గానే నేరం చేసిన వాళ్లు సాక్ష్యాధారాలు చెరిపేయడానికి ప్రయత్నిస్తారు. ముందస్తు ప్లాన్‌తో నేరం చేసే వాళ్లు, సాక్ష్యాలు లేకుండా చేయాలని చూస్తారు. ఈ రెండు సందర్భాలూ జగన్ సర్కార్‌కు అతికినట్లు సరిపోతాయి. ప్రజల ఆస్తులపై కన్నేసిన జగన్ సర్కారు, వాటిని కొట్టేయడానికి ప్లానేసి, ఈ నేరానికి ఎలాంటి సాక్ష్యాలు మిగలకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. జనాల ఆస్తులను వివాదాల్లోకి నెట్టడానికి ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చింది. జనాల ఆస్తులకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు ఇవ్వడం లేదు. అత్యంత కీలకమైన వేలిముద్రల రిజిస్టర్‌ను ఎత్తేశారు. ఇక మిగిలింది సాక్షులు. ఏదైనా రిజిస్ట్రేషన్ జరిగితే ఇద్దరు సాక్షులు తప్పనిసరిగా ఆ డాక్యుమెంట్లపై సంతకాలు చేయాలి. జగన్ సర్కారు భవిష్యత్తులో సమస్యగా మారుతారు అనుకున్న సాక్షులను ఇప్పుడు పూర్తిగా ఎత్తేయాలని నిర్ణయించారు. ఇకపై రిజిస్ట్రేషన్లన్నీ సాక్షులు లేకుండానే జరుగుతాయి. ప్రస్తుతం జిరాక్సు విధానంలో అమ్మేవారు, కొనేవారు ఇద్దరూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదని చెప్తున్నారు. సాక్షులు కూడా ఉండరు. ఎవరు ఎవరికి ఎన్నిసార్లు అమ్మారో ఎవరికీ తెలిసే అవకాశం లేదు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో సాక్షులను ఎత్తేస్తూ తెచ్చిన ప్రతిపాదన ఫైలు ఐజీ కార్యాలయంలో అందరి ఆమోదం పొందింది. ఎన్నికలు పూర్తయ్యాక ఉత్తర్వులు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. ఇప్పటికే ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి వేలిముద్రలు, ఆస్తిపత్రాలను క్రిటికల్ రివర్ అనే ప్రైవేటు కంపెనీకి మళ్లిస్తున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్టం ప్రకారం ప్రతి రిజిస్ట్రేషన్‌కు ఇద్దరు సాక్షులుండాలి. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు వాడేవారు. ఇప్పుడు జగన్ తెచ్చిన జిరాక్స్ రిజిస్ట్రేషన్ల విధానంలో కేవలం ఆధార్ కార్డు ఒక్కదాన్నే తప్పనిసరి చేశారు. ఇన్ని డాక్యుమెంట్లున్నప్పటికీ కూడా ఇద్దరు వ్యక్తుల మధ్య ఆస్తుల కొనుగోలు, అమ్మకాలు జరుగుతుంటే సాక్షులు తప్పకుండా ఉండాలన్న నిబంధనను చట్టంలో పెట్టారు. ఎందుకంటే ఆధార్ సహా అన్ని డాక్యుమెంట్లు నకిలీవి వస్తున్నాయి. కానీ, ఆ అమ్మేవారు, కొనేవారు ఇద్దరూ నకిలీ కాదని, వారిద్దరు తమకు తెలుసని మరో ఇద్దరు వ్యక్తులు ఒప్పుకొంటూ పెట్టే సాక్షి సంతకాలు అవి. అలాంటి కీలకమైన ఘట్టాన్ని రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నుంచి జగన్ సర్కారు తొలగిస్తోంది. ప్రజల ఆస్తులకు సంబంధించిన అంశం కాబట్టి పకడ్బందీగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్టాన్ని ఏర్పాటు చేశారు. కానీ, ఇప్పుడు ఏదైనా భూమి/ఆస్తి రిజిస్ట్రేషన్‌పై వివాదం తలెత్తి కోర్టు వరకు వెళ్తే కోర్టు ఎలా పరిష్కరిస్తుంది? ముందుగా ఒరిజినల్ డాక్యుమెంట్లు ఉండవు. రిజిస్ట్రేషన్ జరిగినట్లు సాక్షులు ఉండరు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వేలిముద్రల రిజిస్టర్లు ఎత్తేశారు. అందువల్ల కోర్టుకు సమర్పించడానికి ప్రభుత్వం తరఫున అది కూడా ఉండదు. ఈ స్థితిలో ఆస్తుల వివాదాలు ఎలా పరిష్కారమవుతాయి? ఇలా వీటన్నింటిని వివాదాల్లోకి నెట్టి ల్యాండ్ టైటిలింగ్ చట్టం ద్వారా కొట్టేయాలన్నదే జగన్ సర్కార్ లక్ష్యంగా కనిపిస్తోంది.

క్రిటికల్ రివర్ 'మన' కంపెనీయే..

జిరాక్సు రిజిస్ట్రేషన్ల కోసం జగన్ సర్కారు కొత్తగా రంగంలోకి దించిన ప్రైవేటు కంపెనీ క్రిటికల్ రివర్ ప్రభుత్వ పెద్దలకు సన్నిహిత కంపెనీయే. పేరుకు ఈ కంపెనీ అమెరికాలో రిజిస్టర్ అయింది. కానీ, ఈ కంపెనీ వ్యవస్థాపకులు, డైరెక్టర్లు అందరూ తెలుగువారే. ఇండియాలో ఓ బ్రాంచ్ పెట్టారు. ఈ సంస్థ వ్యవస్థాపకుడు అంజిరెడ్డి మారం.. జగన్ ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా ఉన్న పాతూరి శేషిరెడ్డికి సన్నిహితుడు. ఒకప్పుడు శేషిరెడ్డి.. క్రిటికల్ రివర్ కంపెనీలో భాగస్వామిగా ఉండేవారు. అలాగే, బోర్డులో ఉన్న రాజురెడ్డి కూడా ప్రభుత్వ పెద్దలకు సన్నిహితులే. అందుకే ఏరికోరి ఈ కంపెనీని ఎంచుకుని, ప్రజల ఆస్తుల వివరాలను, వారి వేలిముద్రలను ఈ కంపెనీకి మళ్లిస్తున్నారు. రాష్ట్రంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు కేంద్రం పరిధిలోని ఎన్ఐసీ టెక్నికల్ సేవలు అందించేది. ఈ సేవలకు గాను ప్రభుత్వం ఎన్ఐసీకి ఏడాదికి రూ.12 కోట్లు చెల్లిస్తుంది. కానీ, అకస్మాత్తుగా ఎన్ఐసీని తప్పించారు. రూ.35 కోట్లు సమర్పించి క్రిటికల్ రివర్‌ని రంగంలోకి దించింది. ఒకవేళ ఎన్ఐసీ సేవలు కొనసాగిస్తే.... జనాల ఆస్తులను కొట్టేయడం కష్టం అవుతుందని భావించినట్టుంది.

టైటిల్ మంచిదేనట!

- వలంటీర్లు మళ్లీ ఇంటికి రావాలంటే అన్ని సీట్లలో వైసీపీని గెలిపించాలట!
- సీఎం జగన్ అబద్ధాల వల్లింపు
- హిందూపురం, పలమనేరు, నెల్లూరుల్లో ప్రచార సభలు



శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం గురునాథ్ సర్కిల్‌లో జగన్ బస్సు యాత్ర

పలమనేరు, నెల్లూరు, మే 4(ఆంధ్రజ్యోతి)/హిందూపురం: పోలింగ్ దగ్గరపడేకొద్దీ సీఎం జగన్‌లో అభద్రత, ఆత్మరక్షణ స్థితి అంతకంతకూ పెరిగిపోతోంది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మంచిదే అని చెప్పేందుకు తన ప్రసంగాల్లో జగన్ ఎక్కువ సమయం కేటాయించారు. ప్రత్యేక హోదాను అమ్మేశారని చంద్రబాబుపై విమర్శలు చేశారు. 99శాతం హామీలు నెరవేర్చామని గొప్పలు చెప్పుకొన్నారు. ఐదేళ్లలో 2.31 లక్షల ఉద్యోగాలు ఇచ్చామంటూ అబద్ధం ఆడేశారు. వలంటీరు మళ్లీ ఇంటింటికీ రావాలంటే 175 ఎమ్మెల్యేలు.. 25 ఎంపీలు.... ఒక్కటి కూడా తగ్గకుండా వైసీపీకి ఇవ్వాలని శనివారం శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం, చిత్తూరు జిల్లా పెనమలూరు, నెల్లూరు సిటీల్లో జరిగిన ప్రచార సభల్లో కోరారు. హిందూపురానికి జగన్ శనివారం 11 గంటలకు వస్తారని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. కానీ జనం లేరని తెలిసి అంబేడ్కర్ సర్కిల్‌కు ఆలస్యంగా 12.05 గంటలకు చేరుకున్నారు. గంటపాటు రోడ్ షోలో పాల్గొన్నారు. సీఎం ప్రసంగం ప్రారంభంకాకనే వచ్చిన జనం వెనుతిరిగారు. డబ్బులిచ్చి జన సమీకరణ చేసినా.. అంబేడ్కర్ సర్కిల్‌లో వారికి కనీస వసతులు కల్పించలేదు. తాగేందుకు నీరు దొరక్క మహిళలు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల నుంచి 50వేల మంది సీఎం సభకు వస్తారని వైసీపీ నాయకులు భావించారు. తీరా ఇక్కడ చూస్తే ఆరేడు వేల మందే కనిపించారు. చిత్తూరు ఎంపీ, పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డెప్ప, వెంకటే గౌడను గెలిపించాలని కోరారు. కాగా, సాయంత్రం నెల్లూరు సభలో సీఎం జగన్ పాల్గొన్నారు. తలకు రూ.300 ఖర్చుతో జనాలను సభకు తరలించడంలో వైసీపీ నాయకులు సఫలమైనా, జగన్ ప్రసంగం పూర్తయ్యేవరకు వారిని ఆపలేకపోయారు.

ఒక్కరోజులోనే ఎంత తేడా..

ఒక్క రోజులోనే నెల్లూరు ప్రజల స్పందనలో ఎంతో మార్పు కనిపించింది. శుక్రవారం రాత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్ నెల్లూరు నగరంలో ఎన్నికల సభ పెట్టారు. ఆ సభకు నెల్లూరు చరిత్రలో ఎప్పుడూ కనీవిని ఎరుగని రీతిలో జనం పోటెత్తారు. ఒక దశలో నెల్లూరు సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌లు జనంలో ఇరుక్కుపోయారు. చంద్రబాబు, పవన్ ప్రసంగాలకు ప్రజలు విశేషంగా స్పందించారు. బాబు, పవన్ సభకు ఇలా జనం పోటెత్తి రావడం వైసీపీ వర్గాలను కలవరపాటుకు గురిచేసింది. అందుకే శనివారం నాటి జగన్ సభకు పెద్ద సంఖ్యలోనే జనాన్ని తరలించారు. తలకు రూ.300 చొప్పున పంచిపెట్టి దూరప్రాంతాల నుంచి కూడా ప్రజలను నెల్లూరుకు తరలించారు.

టీడీపీకి ట్రాఫిక్.. జగన్‌కు రోడ్ క్లియర్

పలమనేరులో చంద్రబాబు గత నెలలో ప్రజాగళం ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించగా, టవర్ క్లాక్ సర్కిల్‌లో పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఇప్పుడేమో పట్టణంలోకి ఏ వాహనాలూ రాకుండా ట్రాఫిక్‌ను బైపాస్‌లో మళ్లించి మరీ....టవర్ క్లాక్ సర్కిల్‌లో అనుమతిచ్చారు. పోలీసుల తీరు పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

టికెట్ ఇస్తామన్నారు.. 15 కోట్లు సిద్ధం చేసుకోమన్నారు

- అంతా అయ్యాక మోసం చేశారు!
- వైసీపీకి రిటైర్డ్ ఐపీఎస్ సుందర్ కుమార్ దాస్ రాజీనామా

ఆచంట, మే 4: పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలానికి చెందిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి అల్లూరి సుందర్ కుమార్ దాస్ వైసీపీకి రాజీనామా చేశారు. పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి తన రాజీనామా లేఖ పంపారు. రాజీనామాకు గల కారణాలను అందులో వివరించారు. పూర్వ ఉభయగోదావరి జిల్లాల పార్టీ ఇన్‌చార్జ్ మిథున్‌రెడ్డితో తనకు పి.గన్నవరం ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని జగన్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందుకోసం ఖర్చయ్యే రూ.15 కోట్లు సిద్ధం చేసుకోవాలంటే అంగీకరించానని తెలిపారు. అమలాపురం ఎంపీ కోసం తనను మిథున్‌రెడ్డి పరిశీలించారని, బయోడేటా తీసుకున్నారే కానీ ఎమ్మెల్యేగాని ఎంపీ టికెట్ కానీ ఇవ్వలేదని తెలిపారు. దీనితో మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్టు లేఖలో పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ఆదివారం | 5-5-2024 | పేజీలు: 10 + 8 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 19 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి సా. 5.42 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా. 7.57 తదుపరి రేవతి; వర్జ్యం: ఉ. 6.51-8.18; దుర్ముహూర్తం: సా. 4.51-5.42; అమృతఘడియలు: మ. 3.35-5.02; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 5.50; సూర్యాస్తమయం: 6.32 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేటి మ్యాచ్‌లు

పంజాబ్ x చెన్నై	మ.3.30 గం. నుంచి
లఖ్‌నవూ x కోల్‌కతా	రాత్రి 7.30 గం. నుంచి

ఐపీఎల్ నుంచి మయాంక్ అవుట్



న్యూఢిల్లీ: లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ యువ పేసర్ మయాంక్ యాదవ్ ఐపీఎల్ నుంచి వైదొలిగాడు. పొత్తి కడుపు గాయంతో అతను లీగ్‌కు దూరమయ్యాడని లఖ్‌నవూ ప్రధాన కోచ్ జస్టిన్ లాంగర్ శనివారం వెల్లడించాడు. ఈసారి ఐపీఎల్‌లో 4 మ్యాచ్‌లు ఆడిన మయాంక్ 7 వికెట్లు పడగొట్టాడు. అయితే రెండు మ్యాచుల్లో అతడు తన కోటా ఓవర్లను పూర్తి చేయలేకపోయాడు. గుజరాత్‌తో మ్యాచ్‌లో ఒక ఓవర్ వేశాక పక్కటెముకల గాయంతో తప్పుకొన్నాడు. నాలుగు వారాల పునరావాసం తర్వాత మళ్లీ జట్టులోకొచ్చాడు. అయితే, ముంబైతో మ్యాచ్‌లో తిరిగి గాయపడ్డాడు.

ఆసీస్ పర్యటనకు ఎంపిక..?

అత్యంత వేగవంతమైన బౌలింగ్‌తో సంచలనం సృష్టిస్తున్న మయాంక్ యాదవ్‌పై బీసీసీఐ దృష్టిసారించింది. 21 ఏళ్ల ఈ బౌలర్‌ను బీసీసీఐ ఇప్పటికే తన పేసర్ల కాంట్రాక్టు జాబితాలో చేర్చింది. అయితే తరచూ గాయాల బారిన పడుతున్న అతడిని ఎన్‌సీఏ లో చేర్పించి ప్రత్యేకంగా పునరావాస చర్యలు చేపట్టాలని భావిస్తోంది. గాయాల నుంచి కోలుకొని ఫిట్‌నెస్ సాధిస్తే జూన్-జూలైలో ఆస్ట్రేలియాలో పర్యటించే ఇండియా 'ఏ' జట్టుకు ఎంపిక చేయాలనుకుంటోంది. తద్వారా నవంబరులో ఆసీస్‌లో పర్యటించే భారత జట్టులోనూ అతడిని చేర్చాలని భావిస్తోంది.

డుప్లెసి ధమాకా

అదరగొట్టిన బౌలర్లు ● గుజరాత్‌పై బెంగళూరు గెలుపు



డుప్లెసి (64)

2 ఆర్‌సీబీ తరఫున రెండో ఫాస్టెస్ట్ (18 బంతుల్లో) ఫిఫ్టీ నమోదు చేసిన డుప్లెసి. గేల్ (17) టాప్‌లో ఉన్నాడు.

బెంగళూరు: ప్లేఆఫ్స్ ఆశలు అడుగంటిన వేళ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు చెలరేగుతోంది. బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో గుజరాత్ టైటాన్స్‌ను స్వల్ప స్కోరుకే కట్టడి చేసిన వేళ.. కెప్టెన్ డుప్లెసి (23 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 64) ధనాధన్ ఆటతో మెరిసింది. అయితే ఓ దశలో పేసర్ జోషువా లిటిల్ (4/45) ధాటికి తడబడినట్టు కనిపించినా.. మరో 38 బంతులుండగానే ఆర్‌సీబీ మ్యాచ్‌ను ముగించింది. తద్వారా 4 వికెట్లతో ఘనవిజయం సాధించడంతో పాటు 8 పాయింట్లతో ఏడో స్థానానికి ఎగబాకింది. టైటాన్స్‌కిది వరుసగా మూడో ఓటమి. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా గుజరాత్ 19.3 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటైంది. షారుక్ ఖాన్ (37), రాహుల్ తెవాటియా (35), మిల్లర్ (30) రాణించారు. యష్ దయాల్, సిరాజ్, వైశాఖ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో బెంగళూరు 13.4 ఓవర్లలో 6 వికెట్లకు 152 రన్స్ చేసి గెలిచింది. విరాట్ కోహ్లీ (27 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 42), దినేశ్ కార్తీక్ (21 నాటౌట్), స్వప్నిల్ (15 నాటౌట్) ఆకట్టుకున్నారు. నూర్ అహ్మద్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సిరాజ్ నిలిచాడు.

మెరుపు ఆరంభం: స్వల్ప ఛేదనలో ఆర్‌సీబీ పరుగుల వరద పారించింది. కెప్టెన్ డుప్లెసి బాదుడుకు పవర్‌ప్లేలోనే జట్టు 92 పరుగులతో వహ్వా అనిపించింది. కానీ ఆ తర్వాతే పేసర్ లిటిల్ ధాటికి టపటపా వికెట్లు కోల్పోవడంతో కాస్త టెన్షన్ నెలకొంది. కానీ దినేశ్ కార్తీక్ అండగా నిలిచి మ్యాచ్‌ను ముగించాడు. తొలి ఓవర్‌లో కోహ్లీ రెండు సిక్సర్లతో ఆకట్టుకోగా, ఆ తర్వాత ఆటంతా డుప్లెసీదే అయ్యింది. రెండో ఓవర్‌లో 4,4,6,4తో 20 రన్స్. నాలుగో ఓవర్‌లోనూ 4 ఫోర్లతో 18 రన్స్ అందించాడు. అటు ఈ దూకుడుకు 18 బాల్స్‌లోనే ఫిఫ్టీని కూడా పూర్తి చేసుకున్నాడు. ఇక ఐదో ఓవర్‌లో కోహ్లీ రెండు సిక్సర్లతో 14 రన్స్ అందించాడు. పేసర్ లిటిల్ ఓవర్‌లోనూ డుప్లెసి 4,6,4తో చెలరేగినా నాలుగో బంతికి క్యాచ్ అవుటయ్యాడు. దీంతో ఆర్‌సీబీ పరుగుల తుఫాన్‌కు తెరపడగా, తొలి వికెట్‌కు 35 బంతుల్లో 92 పరుగుల భాగస్వామ్యం కూడా ముగిసింది. ఈ దశలో ఆర్‌సీబీ అనూహ్యంగా తడబడి 25 రన్స్ వ్యవధిలోనే 6 వికెట్లు కోల్పోయింది. విల్ జాక్స్ (1), కోహ్లీని స్పిన్నర్ నూర్ అవుట్ చేయగా.. రజత్ పటీదార్ (2), మ్యాక్స్‌వెల్ (4), గ్రీన్ (1)లను లిటిల్ పెవిలియన్ చేర్చాడు. దీంతో ఆర్‌సీబీ 117/6తో నిలిచింది. అయితే అప్పటికే ఛేదనలో బంతులు ఎక్కువ, పరుగులు తక్కువగా ఉండడంతో ఇబ్బంది లేకపోయింది. రషీద్ ఓవర్‌లో కార్తీక్ 3 ఫోర్లతో 16 రన్స్ రాబట్టడంతో ఆర్‌సీబీ గెలుపు ఖాయమైంది.

పేసర్ల హవా: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ బ్యాటర్లు ఒక్కో పరుగు తీసేందుకు చెమటోడ్చారు. అటు ఈ సీజన్‌లో తొలిసారి ఆర్‌సీబీ బౌలర్లు అద్భుత రీతిలో చెలరేగారు. పేసర్లు సిరాజ్, యష్, గ్రీన్ చక్కటి లెంగ్త్‌తో బంతులు వేయడంతో టైటాన్స్ ఉక్కిరిబిక్కిరైంది. తన వరుస ఓవర్లలో సాహా (1), గిల్ (2) వికెట్లతో సిరాజ్ గట్టి షాకే ఇచ్చాడు. ఆరో ఓవర్‌లో సాయిసుదర్శన్ (6)ను షార్ట్ పిచ్ బాల్‌తో గ్రీన్ అవుట్ చేయగా పవర్‌ప్లేలో గుజరాత్ 23/3 స్కోరుతో దీనస్థితిలో నిలిచింది. ఈ దశలో షారుక్, మిల్లర్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరూ ఓవర్‌కో బౌండరీ ఉండేలా ఆడుతూ స్కోరును చక్కదిద్దారు. పదో ఓవర్‌లో మిల్లర్ 6, షారుక్ 4తో 12 రన్స్ వచ్చాయి. అయితే ఈ జోడీ ప్రమాదకరంగా మారుతున్న దశలో 12వ ఓవర్‌లో మిల్లర్‌ను కర్ణ్ శర్మ అవుట్ చేశాడు. అప్పటికి నాలుగో వికెట్‌కు 58 పరుగులు జత చేరాయి. ఇక తర్వాతి ఓవర్‌లోనే చక్కగా కుదురుకున్న షారుక్ రనౌటవడం దెబ్బతీసింది. విరాట్ నేరుగా విసిరిన మెరుపు త్రోతో అతను పెవిలియన్ చేరాడు. ఈ తరుణంలో తెవాటియా హిట్టింగ్‌కు దిగి 16వ ఓవర్‌లో వరుసగా 4,6,4,4తో 19 రన్స్ అందించాడు. అటు రషీద్ ఖాన్ (18) వీలు చిక్కినపుడల్లా బౌండరీలతో చెలరేగాడు. వీరి ఆటతో 150 దాటేస్తుందనిపించినా.. 18వ ఓవర్‌లో యష్ ఈ ఇద్దరినీ వెనక్కి పంపి ఆర్‌సీబీకి ఊరటనిచ్చాడు. 19వ ఓవర్‌లో విజయ్ శంకర్ (10) రెండు ఫోర్లతో ఊపు మీద కనిపించాడు. కానీ ఆఖరి ఓవర్ తొలి మూడు బంతుల్లోనే టైటాన్స్ చివరి 3 వికెట్లు కోల్పోయింది. మానవ్ (1), విజయ్ వికెట్లను వైశాఖ్ తీయగా.. మోహిత్ రనౌటయ్యాడు.

స్కోరుబోర్డు

గుజరాత్: సాహా (సి) దినేశ్ (బి) సిరాజ్ 1, గిల్ (సి) వైశాఖ్ (బి) సిరాజ్ 2, సాయి సుదర్శన్ (సి) కోహ్లీ (బి) గ్రీన్ 6, షారుక్ ఖాన్ (రనౌట్) 37, మిల్లర్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) కర్ణ్ శర్మ 30, తెవాటియా (సి) వైశాఖ్ (బి) యశ్ దయాల్ 35, రషీద్ ఖాన్ (బి) యశ్ దయాల్ 18, విజయ్ శంకర్ (సి) సిరాజ్ (బి) వైశాఖ్ 10, మానవ్ సూథర్ (సి) స్వప్నిల్ (బి) వైశాఖ్ 1, మోహిత్ శర్మ (రనౌట్) 0, నూర్ అహ్మద్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 19.3 ఓవర్లలో 147 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-1, 2-10, 3-19, 4-80, 5-87, 6-131, 7-136, 8-147, 9-147, 10-147; **బౌలింగ్:** స్వప్నిల్ 1-0-1-0, సిరాజ్ 4-0-29-2, యశ్ దయాల్ 4-0-21-2, గ్రీన్ 4-0-28-1, వైశాఖ్ 3.3-0-23-2, కర్ణ్ శర్మ 3-0-42-1.

బెంగళూరు: కోహ్లీ (సి) సాహా (బి) నూర్ 42, డుప్లెసి (సి) షారుక్ (బి) లిటిల్ 64, విల్ జాక్స్ (సి) షారుక్ (బి) నూర్ 1, పటీదార్ (సి) మిల్లర్ (బి) లిటిల్ 2, మ్యాక్స్‌వెల్ (సి) మిల్లర్ (బి) లిటిల్ 4, గ్రీన్ (సి) షారుక్ (బి) లిటిల్ 1, దినేశ్ (నాటౌట్) 21, స్వప్నిల్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 13.4 ఓవర్లలో 152/6; వికెట్ల పతనం:** 1-92, 2-99, 3103, 4-107, 5-111, 6-117; **బౌలింగ్:** మోహిత్ శర్మ 2-0-32-0, జోషువా లిటిల్ 4-0-45-4, మానవ్ 2-0-26-0, నూర్ అహ్మద్ 4-0-23-2, రషీద్ 1.4-0-25-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	10	8	2	0	16	0.622
కోల్‌కతా	10	7	3	0	14	1.098
లఖ్‌నవూ	10	6	4	0	12	0.094
హైదరాబాద్	10	6	4	0	12	0.072
చెన్నై	10	5	5	0	10	0.627
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
బెంగళూరు	11	4	7	0	8	-0.049
పంజాబ్	10	4	6	0	8	-0.062
గుజరాత్	11	4	7	0	8	-1.320
ముంబై	11	3	8	0	6	-0.356

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

క్రికెట్‌లో నాకు నాన్నలా..



ధోనీపై సీఎస్‌కే పేసర్ పతిరన

చెన్నై: తన క్రికెట్ కెరీర్‌లో ఎంఎస్ ధోనీ తండ్రిలాంటి వారని శ్రీలంక యువ పేసర్ మతీష పతిరన అన్నాడు. మహీ ఇచ్చే చిన్నచిన్న సూచనలు తనకు ఎంతో ఆత్మవిశ్వాసాన్నిస్తాయని చెప్పాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున పతిరన ఆకట్టుకొనే ప్రదర్శన చేస్తున్నాడు. 'నా తండ్రి తర్వాత.. నా క్రికెట్ జీవితంలో ఆ పాత్రను పోషిస్తున్న వ్యక్తి ధోనీ. ఎల్లవేళలా నా గురించి జాగ్రత్తలు తీసుకొంటాడు. ఇంటి వద్ద నాన్న ఎలా సలహాలిస్తారో.. ఇక్కడ ధోనీ అలా..! మైదానంలో ఆడుతున్నప్పుడు పెద్దగా ఒత్తిడి చేయడు. అవసరమైన విషయాలు మాత్రమే సూటిగా చెబుతాడు. అవి నాలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయ'ని చెన్నై ఫ్రాంచైజీ యూట్యూబ్ చానెల్ షోలో పతిరన చెప్పాడు. ఏదైనా అనుమానం ఉన్నా, స్వేచ్ఛగా వెళ్లి అతడితో మాట్లాడతానన్నాడు. ధోనీ వచ్చే సీజన్‌లో కూడా తమతో కలసి ఆడాలని కోరుకుంటున్నట్టు 21 ఏళ్ల పతిరన తెలిపాడు.

స్టేడియాలు 'చిన్న'బోతున్నాయి



న్యూఢిల్లీ: తాజా ఐపీఎల్‌లో బ్యాటర్ల హవాతో అతి భారీ స్కోర్లు నమోదవుతున్నాయి. 250కి పైగా పరుగులను కూడా అలవోకగా బాదేస్తున్నారు. ఇలాంటి భారీ హిట్టింగ్‌పై వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆందోళన వ్యక్తం చేశాడు. భారీ హిట్టింగ్‌ల ఈ కారణంగా స్టేడియాల పరిమాణానికి ప్రాముఖ్యం లేకుండా పోయిందని అన్నాడు. 'గతంలో నిర్మించిన స్టేడియాలు ప్రస్తుత ఆటతీరుకు ఏమాత్రం సరిపోవడం లేదనిపిస్తోంది. ఇంపాక్ట్ ప్లేయర్‌తో గేమ్స్ అన్నీ ఏకపక్షంగా మారుతున్నాయి. దీంతో బౌలర్లు మానసికంగా దృఢంగా ఉండాల్సిందే. ఆట సమతూకంతో ఉంటేనే బాగుంటుంది. అయితే నైపుణ్యం కలిగిన బౌలర్ సవాల్‌ను స్వీకరించేందుకు సిద్ధంగానే ఉంటాడు' అని అశ్విన్ తెలిపాడు.

జట్టు ఎంపికలో 'ఏఐ'

ఇంగ్లండ్ మహిళల క్రికెట్‌లో నూతన సాంకేతికత

లండన్: ఎల్లలు లేని విధంగా కృత్రిమ మేథ (ఏఐ) వినియోగం పెరిగిపోతోంది. ఆటల్లోనూ ఏఐ కీలకపాత్ర పోషించే స్థితికి వచ్చింది. జట్టు ఎంపికలో ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయం తీసుకొంటున్నట్టు ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టు చీఫ్ కోచ్ జాన్ లూయిస్ తెలిపాడు. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌లో 2-1తో ఇంగ్లండ్ జట్టు విజయంలో ఈ నవీన సాంకేతికత ఎంతో ఉపయోగపడిందని అతను చెప్పాడు. ఒకే తరహా నైపుణ్యాలతో ఇద్దరు ప్లేయర్లు ఉండి.. వారిలో ఒకరిని మాత్రమే ఎంపిక చేయాలనుకొన్న సమయంలో ఏఐ ఎంతో సాయం చేసిందని లూయిస్ తెలిపాడు. 'మనదగ్గర ఉన్న ఆటగాళ్లతో లైనప్ పంపితే.. పలు రకాలుగా పరీక్షించి ప్రత్యర్థి బలాలకు తగిన విధంగా ఉత్తమ జట్టును ఏఐ సూచిస్తుంద'ని లూయిస్ వెల్లడించాడు.

ఐఎస్‌ఎల్ విజేత ముంబై సిటీ



కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) టైటిల్‌ను ముంబై సిటీ ఎఫ్‌సీ రెండోసారి సొంతం చేసుకొంది. శనివారం జరిగిన ఫైనల్లో ముంబై 3-1తో మోహన్‌బగాన్ సూపర్ జెయింట్స్‌ను ఓడించింది. ఫస్టాఫ్ ఆఖర్లో జేసన్ కమ్మిన్స్ (44వ నిమిషం) గోల్‌తో మోహన్‌బగాన్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కానీ, సెకండాఫ్ ఆరంభమైన 8వ నిమిషంలోనే ముంబై ఆటగాడు జార్జ్ పెరీరా డియాజ్ (53వ) గోల్‌తో స్కోరు 1-1తో సమమైంది. 81వ నిమిషంలో బిపిన్ సింగ్ గోల్‌తో ముంబై 2-1తో పైచేయి సాధించింది. ఆ తర్వాత ఇంజ్యూరీ టైమ్‌లో జాకబ్ వోజ్టస్ (90+7) మూడో గోల్ అందించాడు.

43 పతకాలతో భారత్ రికార్డు

ఆసియా యూత్ బాక్సింగ్

అస్థానా (కజకిస్థాన్): ఆసియా అండర్-22, యూత్ చాంపియన్‌షిప్‌లో శనివారంనాటి పోటీల్లో మరో నలుగురు బాక్సర్లు తమ విభాగాల్లో ఫైనల్స్‌కు చేరడంతో..ఈసారి టోర్నీలో భారత్‌కు రికార్డు స్థాయిలో మొత్తం 43 పతకాలు ఖాయమయ్యాయి. ఆకాశ్ (60 కిలోలు), విశ్వంత్ (48 కి.), నిఖిల్ (57 కి.), ప్రీత్ (67 కి.) ఫైనల్స్ చేరారు. యూత్ మహిళల విభాగంలో నిషా (52 కి.), నికిత (60 కి.)తో పాటు మరో ఐదుగురు ఫైనల్లో అడుగుపెట్టారు. మరో ఐదుగురు మహిళా బాక్సర్లు కాంస్య పతకాలు సాధించారు.

కోటక్ బ్యాంక్ లాభం రూ.4,133 కోట్లు

ఒక్కో షేరుకు రూ.2 డివిడెండ్



న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి (క్యూ4) కోటక్ మహీంద్రా బ్యాంక్ నికర లాభం స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన 18 శాతం వృద్ధితో రూ.4,133 కోట్లకు చేరుకుంది. మొత్తం ఆదాయం రూ.15,285 కోట్లకు పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి బ్యాంక్ లాభం 26 శాతం వృద్ధితో రూ.13,782 కోట్లకు, మొత్తం ఆదాయం రూ.56,072 కోట్లకు చేరుకుంది. మరిన్ని ముఖ్యాంశాలు..

- క్యూ4లో కోటక్ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) వార్షిక ప్రాతిపదికన 13 శాతం పెరిగి రూ.6,909 కోట్లకు చేరుకోగా.. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఎన్ఐఐ 21 శాతం వృద్ధితో రూ.25,993 కోట్లుగా నమోదైంది. కాగా, నికర వడ్డీ మార్జిన్ 5.28 శాతంగా నమోదైంది.
- మార్చి 31 నాటికి బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 1.39 శాతానికి, నికర ఎన్‌పీలు 0.34 శాతానికి తగ్గాయి.
- మార్చి చివరి నాటికి బ్యాంక్ రుణాలు వార్షిక ప్రాతిపదికన 20 శాతం వృద్ధితో రూ.3.9 లక్షల కోట్లకు చేరుకోగా.. డిపాజిట్లు 23 శాతం పెరిగి రూ.4.45 లక్షల కోట్లకు ఎగబాకాయి.
- గత ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ వాటాదారులకు రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.2 డివిడెండ్‌ను ప్రకటించింది.

ఆర్‌బీఐ ఆంక్షలతో ప్రభావం చాలా తక్కువే: వాస్వానీ

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తమ వ్యాపారంపై విధించిన ఆంక్షల ఆర్థిక ప్రభావం చాలా తక్కువే అయినప్పటికీ, బ్యాంక్ పేరు ప్రతిష్ఠలకు నష్టం చేకూరుతుందని ఆందోళన చెందుతున్నట్లు కోటక్ బ్యాంక్ ఎండీ, సీఈఓ అశోక్ వాస్వానీ అన్నారు. ఆర్‌బీఐ ఆంక్షలు మరికొన్ని నెలల పాటు కొనసాగవచ్చని ఆయన ఈ సందర్భంగా సంకేతాలిచ్చారు. కోటక్ మహీంద్రా ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ చానెళ్ల ద్వారా కొత్త కస్టమర్లను చేర్చుకోకుండా, కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేయకుండా గత నెలలో ఆర్‌బీఐ నిషేధం విధించింది. బ్యాంక్ ఐటీ రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలో లోపాలను గుర్తించిన నేపథ్యంలో ఆర్‌బీఐ బ్యాంక్‌పై క్రమశిక్షణ చర్యలు చేపట్టింది.

బిజినెస్

ఐడీబీఐ బ్యాంక్ లాభంలో 44% వృద్ధి

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఐడీబీఐ బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 44 శాతం పెరిగి రూ.1,628 కోట్లకు చేరుకుంది. మొత్తం ఆదాయం రూ.7,887 కోట్లకు పెరిగింది. గత ఏడాదిలో ఇదే కాలానికి బ్యాంక్ రూ.1,133 కోట్ల లాభం, రూ.7,014 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) మొత్తానికి బ్యాంక్ నికర లాభం 55 శాతం వృద్ధితో ఆల్‌టైం గరిష్ఠ స్థాయి రూ.5,634 కోట్లకు, ఆదాయం రూ.30,037 కోట్లకు పెరిగింది. ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 12 శాతం పెరిగి రూ.3,688 కోట్లుగా నమోదైంది. మార్చి 31 నాటికి బ్యాంక్ నికర నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 0.34 శాతానికి తగ్గాయి. గత ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంక్ బోర్డు వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.15 డివిడెండ్ చెల్లించాలని ప్రతిపాదించింది.

22% పెరిగిన డీ-మార్ట్ లాభం

న్యూఢిల్లీ: డీ-మార్ట్ పేరుతో గొలుసుకట్టు సూపర్ మార్కెట్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్ లిమిటెడ్.. మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.563 కోట్ల లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి ఆర్జించిన రూ.460 కోట్ల లాభంతో పోలిస్తే 22.39 శాతం అధికమిది. కాగా, ఈ జనవరి-మార్చి కాలానికి సంస్థ ఏకీకృత ఆదాయం రూ.12,727 కోట్లకు పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.50,789 కోట్ల ఏకీకృత ఆదాయంపై రూ.2,536 కోట్ల లాభాన్ని గడించింది. ఏడాది కాలంలో సంస్థ మరో 41 కేంద్రాలను ప్రారంభించింది. దాంతో మొత్తం సూపర్ మార్కెట్ల సంఖ్య 365కు చేరుకుంది. దేశంలోని 23 నగరాలకు విస్తరించినట్లు కంపెనీ వెల్లడించింది.

కేకేఆర్ చేతికి హెల్తియమ్ మెడ్‌టెక్!



డీల్ విలువ రూ.7,000 కోట్లు!!

ముంబై: ప్రపంచంలో నాలుగో అతిపెద్ద సర్జికల్ సూచర్ (శస్త్రచికిత్స కుట్టు) తయారీదారు హెల్తియమ్ మెడ్‌టెక్ (గతంలో సూచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్)ను అమెరికన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ కేకేఆర్ టేకోవర్ చేయబోతోంది. బ్రిటన్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ అపాక్స్ పార్ట్‌నర్స్ నుంచి 84 కోట్ల డాలర్ల (రూ.7,000 కోట్లు)కు హెల్తియమ్‌ను దక్కించుకున్నట్లు సమాచారం. ఈ సంస్థ కొనుగోలుకు కేకేఆర్‌తో పాటు దేశీయ ఫార్మా కంపెనీ మ్యాన్‌కైండ్ ఫార్మా, క్రిస్‌క్యాపిటల్ కన్సార్షియం, డెన్మార్క్‌కు చెందిన ఔషధ సంస్థ నోవో నోర్డిస్క్ ప్రమోటర్ నోవో హోల్డింగ్స్ పోటీ పడ్డాయి. అయితే, నోవో హోల్డింగ్స్ చివరి నిమిషంలో పోటీ నుంచి తప్పుకున్నట్లు తెలిసింది. బిడ్డింగ్‌లో మ్యాన్‌కైండ్ ఫార్మా కన్సార్షియం 78 కోట్ల డాలర్లు (రూ.6,500 కోట్లు) ఆఫర్ చేయగా.. కేకేఆర్ రూ.7,000 కోట్ల బిడ్‌తో విజేతగా నిలిచినట్లు తెలిసింది. కాగా 2022లోనూ హెల్తియమ్‌కు చెందిన యూకే అనుబంధ విభాగాన్ని కేకేఆర్ కొనుగోలు చేసింది.

బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు

బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న హెల్తియమ్ మెడ్‌టెక్ కొనుగోలుకు సంబంధించి అపాక్స్ పార్ట్‌నర్‌తో కేకేఆర్ విధిగా కట్టుబడి ఉండే ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఈ డీల్‌ను సోమవారం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ప్రస్తుతం హెల్తియమ్ మెడ్‌టెక్‌లో అపాక్స్ పార్ట్‌నర్ 99.8% వాటా కలిగి ఉండగా..మిగతా 0.2% వాటాను హెల్తియమ్ సీఈఓ, ఎండీ అనీశ్ బాఫ్నా చేతిలో ఉంది. సంస్థ కేకేఆర్ చేతుల్లోకి వెళ్లిన తర్వాత హెల్తియమ్‌కు బాఫ్నాయే సారథ్యం వహించనున్నట్లు తెలిసింది. 2018లో అపాక్స్ పార్ట్‌నర్స్.. హెల్తియమ్‌ను టీపీజీ గ్రోత్, సీఎక్స్ పార్ట్‌నర్స్ నుంచి దాదాపు 30 కోట్ల డాలర్లకు (రూ.1,950 కోట్లు) కొనుగోలు చేసింది. స్మిత్ అండ్ నెఫ్యూ, జాన్సన్ అండ్ జాన్సన్ మాజీ ఎగ్జిక్యూటివ్‌లైన ఎల్‌జీ చంద్రశేఖర్, ఎస్ సుబ్రమణియమ్ 1992లో సూచర్స్ ఇండియాను ప్రారంభించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో హెల్తియమ్ రూ.820 కోట్ల ఆదాయంపై రూ.256 కోట్ల నిర్వహణ లాభాన్ని ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఆదాయం రూ.1,000 కోట్లు, నిర్వహణ లాభం రూ.350 కోట్ల స్థాయికి చేరుకోవచ్చని అంచనా.

జెన్ టెక్నాలజీస్ డివిడెండ్ 100 శాతం


క్యూ 4 లాభం రూ.33 కోట్లు

Zen Technologies Limited

హైదరాబాద్: జెన్ టెక్నాలజీస్.. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జనవరి-మార్చి త్రైమాసికానికి గాను కంపెనీ స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.138.04 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.33.03 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.74.33 కోట్ల ఆదాయంపై రూ.17.21 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.444.20 కోట్ల ఆదాయంపై రూ.129.23 కోట్ల లాభాన్ని ఆర్జించింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.1 ముఖ విలువ ప్రతి షేరుకు రూ.1 డివిడెండ్ (100 శాతం)ను బోర్డు సిఫారసు చేసింది. కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆమోదం పొందిన తర్వాత 30 రోజుల్లో ఈ డివిడెండ్‌ను చెల్లించనున్నట్లు తెలిపింది. కాగా మార్చి ముగిసే నాటికి చేతిలో రూ.1,401.97 కోట్ల ఆర్డర్లు ఉన్నట్లు జెన్ టెక్నాలజీస్ వెల్లడించింది.

ఐటీసీ ద్వారా చెల్లింపులు ఆలస్యమైనా వడ్డీ కట్టాలా..?





రాంబాబు గొండాల

జీఎస్‌టీలో నమోదై రిటర్నులు దాఖలు చేస్తూ పన్ను చెల్లించే వారిలో చాలా మందికి ఉండే ఆలోచన ఏమిటంటే పన్ను చెల్లింపు ఆలస్యమైనప్పటికీ.. ఆ మొత్తాన్ని నగదు ద్వారా కాకుండా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ద్వారా చెల్లిస్తే ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదని అనుకుంటారు. కానీ, ఇది కొంత వరకే నిజం. ఈ అవగాహనా లోపం వల్ల చాలామంది పొరపాట్లు చేస్తున్నారు. ఇలాంటి వారికి వడ్డీ చెల్లించమని నోటీసులు వస్తున్నాయి. అసలు ఈ విషయాన్ని ఎలా అర్థం చేసుకోవాలో చూద్దాం.

ఇంతకు ముందు ఉన్న విధానంతో పోలిస్తే జీఎస్‌టీలో రిటర్న్ దాఖలు చేసే పద్ధతి కొంచెం భిన్నంగా ఉంటుంది. అంటే నెలకు చెల్లించాల్సిన మొత్తం చెల్లిస్తే గానీ రిటర్న్ దాఖలు కాదు. ఉదాహరణకు ఒక వ్యక్తి ఒక నెలలో రూ.50,000 పన్ను చెల్లించాల్సి ఉండగా, రూ.40,000 ఐటీసీ ఉందనుకుందాం. అంటే మిగతా రూ.10,000 నగదు ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. కానీ, సమయానికి రూ.10,000 అందక రిటర్న్ వాయిదా పడింది. ఒక నాలుగు నెలల తర్వాత తనకు నగదు సర్దుబాటు అయిన అనంతరం మొత్తం రూ.50,000తో రిటర్న్ దాఖలు చేశాడు. సకాలంలో రిటర్న్ దాఖలు చేయనందుకు తాను లేట్ ఫీజు కూడా చెల్లించాడు. అయితే ప్రభుత్వానికి సకాలంలో పన్ను చెల్లించలేదు కాబట్టి పన్ను చెల్లించాల్సిన తేదీ నుంచి చెల్లింపు జరిగిన తేదీ వరకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. మరి ఈ వడ్డీ ఎంత మీద చెల్లించాలనే దానిపై మొదట్లో కొంత గందరగోళం ఉండేది. చెల్లించాల్సిన మొత్తం రూ.50,000 కాబట్టి ఆ మొత్తం మీద వడ్డీ చెల్లించాలని ఒక వాదన. కాగా రూ.40,000 సదరు వ్యక్తికి ఐటీసీ రూపంలో నిర్ణీత గడువు నాటికే అందుబాటులో ఉంది కాబట్టి నగదు రూపంలో చెల్లించిన రూ.10,000 మీద మాత్రమే వడ్డీ వర్తిస్తుందని మరొక వాదన.

మొత్తానికి దీనికి సంబంధించి ప్రభుత్వం కొంత వివరణ ఇవ్వటం జరిగింది. అంతేకాకుండా సంబంధిత సెక్షన్‌లో సవరణ కూడా చేయటం జరిగింది. దీని ప్రకారం రిటర్న్ ఆలస్యంగా దాఖలు చేసిన సందర్భంలో ఐటీసీ ద్వారా చెల్లించిన పన్ను మేరకు ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదు. అంటే నగదు ద్వారా చెల్లించిన పన్నుకు మాత్రమే వడ్డీ వర్తిస్తుంది. పై ఉదాహరణలో రూ.40,000 ఐటీసీ ద్వారా చెల్లించటం జరిగింది కాబట్టి దాని మీద వడ్డీ చెల్లించనవసరం లేదు. కేవలం రూ.10,000 మీద మాత్రమే చెల్లించాలి.

కానీ, ఇక్కడ కొన్ని షరతులు ఉన్నాయి. రిటర్న్ దాఖలు చేయటం లేట్ అయినప్పటికీ ఆ రిటర్న్ పీరియడ్‌కు సంబంధించిన వివరాలు అన్ని ఆ రిటర్న్‌లో కచ్చితంగా చూపాలి. ఉదాహరణకు ఒక వ్యాపారస్తుడు జనవరి నెలలో రూ.లక్ష అమ్మకాలు చేపట్టాడు. దానికి గాను రూ.12,000 పన్ను చెల్లించాలనుకుందాం. ఈ రూ.12,000 గాను తన దగ్గర రూ.14,000 ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఉంది. పన్ను చెల్లింపు మొత్తానికి ఐటీసీ సరిపోతుంది కాబట్టి నగదులో ఎలాంటి చెల్లింపులు చేయనవసరం లేదు. అయితే జనవరి నెల రిటర్న్ ఏదో కారణంతో సకాలంలో చేయకుండా ఒక రెండు నెలల తర్వాత చేశాడనుకుందాం. అయినప్పటికీ, ఆ రిటర్న్‌లో జనవరిలో జరిపిన రూ.లక్ష అమ్మకాలు మొత్తం చూపి, దానికి సంబంధించిన పన్నును నగదు ఉపయోగించకుండా ఐటీసీ ద్వారా చెల్లిస్తే ఎలాంటి వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. అలాకాకుండా, అదే జనవరి రిటర్న్ సకాలంలో వేసి రూ.లక్షకు గాను రూ.60,000 అమ్మకాలు మాత్రమే చూపి మిగతా రూ.40,000 అమ్మకాలు ఫిబ్రవరి నెల రిటర్న్‌లో కలిపి చూపితే ఐటీసీ సరిపోను ఉన్నప్పటికీ రూ.40,000కు వడ్డీ మినహాయింపు రాదు. అంటే పన్ను చెల్లింపు ఆలస్యమైనప్పటికీ సంబంధిత రిటర్న్ ఏ పీరియడ్‌కైతే దాఖలు చేస్తున్నారో, ఆ పీరియడ్‌లో జరిపిన సరఫరాల వివరాలు అన్నీ చూపి తగిన పన్ను చెల్లించాలి. అలా చెల్లించినప్పుడు మాత్రమే ఐటీసీ ద్వారా జరిపిన చెల్లింపునకు వడ్డీ మినహాయింపు లభిస్తుంది. ఇంకొక షరతు ఏమిటంటే, రిటర్న్ దాఖలు చేయటమనేది అధికారులు చర్యలు తీసుకోవటానికి పూర్వమే జరిగి ఉండాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,830 ▲	65,850 ▲	86,500 ▼
ముంబై	71,191 ▼	65,211 ▼	79,989 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ

హైదరాబాద్	465	విజయవాడ	460
వరంగల్	467	గోదావరి	460
చిత్తూరు	543	విశాఖపట్నం	470
		దజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	131	గోదావరి	139
వరంగల్	131	విజయవాడ	139
కరీంనగర్	131	గుంటూరు	139
మహబూబ్‌నగర్	131	ఒంగోలు	139
కర్నూలు	131	చిత్తూరు	137
విశాఖపట్నం	131		

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 5-5-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**

బస్సులు, రైళ్లు ఫుల్

* ప్రయాణాలపై ఎలక్షన్ ఎఫెక్ట్
* 11, 12 తేదీల్లో హైదరాబాద్ టూ విజయవాడ రిజర్వేషన్లు ఫుల్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రయాణాలపై ఎన్నికల ఎఫెక్ట్ పడింది. హైదరాబాద్ నుంచి వచ్చేవారు టికెట్లు బుక్ చేసుకోవటంతో ఆర్టీసీ బస్సులు, రైళ్లు హౌస్‌ఫుల్ అయ్యాయి. హైదరాబాద్, ఇతర తెలంగాణ రాష్ట్రాల్లోని జిల్లాల నుంచి లక్షన్నర మంది విజయవాడ వస్తున్నారని సమాచారం. 13న ఎన్నికలు ఉండటంతో 11, 12 తేదీల్లో హైదరాబాద్ నుంచి విజయవాడకు ఏసీ బస్సుల్లో సీట్లన్నీ ఫుల్ అయిపోయాయి. నాన్ ఏసీ బస్సుల్లో శనివారం నాటికి 95 శాతానికి పైగా టికెట్లు బుక్ అయ్యాయి. ఇక 13వ తేదీన విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వారితో బస్సులన్నీ ముందే రిజర్వ్ అయిపోయాయి. రైళ్లలోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం, శ్రీకాకుళానికి టికెట్లు భారీగా బుక్ అయ్యాయి. దీంతో రైళ్లలో కూడా చాంతాడంత వెయిటింగ్ లిస్టులు కనిపిస్తున్నాయి. కాగా, ఇంకా స్పెషల్స్ ఆలోచన చేయలేదు. ఆర్టీసీ అధికారులు మాత్రం భారీగా స్పెషల్ బస్సులు నడపాలని చూస్తున్నారు.



ఇందిరాగాంధీ స్టేడియంలో ఓటు వేస్తున్న ఉద్యోగులు (ఇన్‌సెట్‌లో) కలెక్టర్ పరిశీలన

పోస్టల్ బ్యాలెట్‌కు విశేష స్పందన

జిల్లావ్యాప్తంగా భారీగా తరలివచ్చిన ఉద్యోగులు

* మండుటెండను సైతం లెక్క చేయకుండా..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్‌కు ఉద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు, విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లో మొత్తం ఏడు ఫెసిలిటేషన్ కేంద్రాలతో పాటు ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ (ఐజీఎంసీ) స్టేడియంలో నిర్వహించిన సెంటరుకు ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ మందకొడిగా సాగినప్పటికీ ఆ తర్వాత ఊపందుకుంది. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా బ్యాలెట్ బాక్సులను ఏర్పాటు చేశారు. సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజీకి పెద్దసంఖ్యలో ఉద్యోగులు తరలివచ్చారు. ఇందిరాగాంధీ స్టేడియంలో పోస్టల్ బ్యాలెట్‌ను జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుమారు 23 వేల మందికి పైగా అధికారులు, సిబ్బంది ఓటుహక్కు వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. తొలిరోజు ప్రశాంత వాతావరణంలో ఉద్యోగులు ఓటుహక్కును వినియోగించుకున్నారన్నారు. ఆంధ్రా లయోల కళాశాల ఫెసిలిటేషన్ సెంటరును సబ్ కలెక్టర్ భవానీ శంకర్ పర్యవేక్షించారు. తిరువూరు, జగ్గయ్యపేట, మైలవరం, నందిగామ నియోజకవర్గాల్లో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్‌కు కూడా మంచి స్పందన వచ్చింది. చాలామంది ఉద్యోగులు మధ్యాహ్నం 3 గంటల తర్వాత రావటం వల్ల 5 గంటలకు ముగియాల్సిన బ్యాలెట్ ప్రక్రియ రాత్రి 7.30 గంటల వరకు కొనసాగింది. విజయవాడ తూర్పు, సెంట్రల్ నియోజకవర్గాల పరిధిలో పలువురు ఉద్యోగుల ఓట్లు వారి స్థానిక నియోజకవర్గాల జాబితాలో చేరాయి. దీంతో వారంతా అక్కడికి వెళ్లి ఓటు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని ఉద్యోగులు తమ సంఘ నేతల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై సీఐ ఓవరాక్షన్

లయోల కాలేజీ ఫెసిలిటేషన్ సెంటరులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై స్థానికంగా విధులు నిర్వహిస్తున్న సీఐ దురుసుగా ప్రవర్తించారు. ఫెసిలిటేషన్ సెంటరులో విధులు నిర్వహిస్తున్న రిటైర్డ్ తహసీల్దార్ రామకృష్ణ ఫొటోలు తీయటాన్ని ఆయన అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఐడీలు ఉన్నాయా అంటూ అరిచారు. దీంతో అక్కడే ఉన్న సబ్ కలెక్టర్ భవానీశంకర్ ఐడీ ఉందో లేదో మాత్రమే పరిశీలించమన్నారు. దీనిని అలుసుగా తీసుకున్న సీఐ దురుసుగా ప్రవర్తించారు. బలవంతంగా పంపించే ప్రయత్నం చేయటంతో పాటు కెమెరాలో ఫొటోలను డిలీట్ చేయించారు.



అవనిగడ్డలో బహిరంగ సభకు విచ్చేసిన జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న పవన్

జనసేనానికి జన జేజేలు

గుడివాడ, అవనిగడ్డలో పవన్ కల్యాణ్ పర్యటన

అడుగడుగునా అపూర్వ స్వాగతం

* కిక్కిరిసిపోయిన గుడివాడ రహదారులు
* ఎండను సైతం లెక్క చేయకుండా ఎదురుచూపులు
* అవనిగడ్డ బహిరంగ సభకు విశేష స్పందన

వైసీపీ ఎమ్మెల్యేలు, ప్రభుత్వంపై పవన్ ఫైర్

గుడివాడ జనవాడను తలపించింది. అవనిగడ్డ అపూర్వ స్వాగతం పలికింది. వారాహి విజయయాత్రలో భాగంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ శనివారం జిల్లాలో పర్యటించారు. ఇసుకేస్తే రాలనంతగా రహదారులు కిక్కిరిసిపోయాయి. గుడివాడకు అనుకున్న సమయం కంటే రెండు గంటలు ఆలస్యంగా వచ్చిన పవన్‌ను చూసేందుకు అభిమానులు మండుటెండలోనే వేచి ఉన్నారు. పవన్ సభా వేదికపైకి రాగానే కేకలు, అరుపులతో అభిమానాన్ని చాటుకున్నారు. ఏఎన్‌ఆర్ కళాశాల హెలీప్యాడ్ నుంచి నెహ్రూచౌక్ సెంటర్ వరకు పవన్ రోడ్ షో జరిగింది. అడుగడుగునా నీరాజనాలు పలికి గజమాలలతో సత్కరించారు. అనంతరం పవన్ అవనిగడ్డ చేరుకున్నారు. శనివారం రాత్రి వరకూ జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

- గుడివాడ/అవనిగడ్డ

నానీని ఇంటికి పంపినప్పుడే అసలైన పండుగ



కిక్కిరిసిన గుడివాడ రహదారులు

గుడివాడలో పవన్ మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పోలవరాన్ని పూర్తిచేసి, కృష్ణాడెల్టాకు రెండు పంటలకు సాగునీటిని అందిస్తామన్నారు. పంటకాల్వలో పూడిక తీయడానికి కూడా ప్రభుత్వానికి చేతులు రాలేదన్నారు. గుడివాడ-కంకిపాడు రహదారి మరమ్మతులు చేయాలని అడిగితే స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని బూతుపురాణం ఎత్తుతున్నాడన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా మోటూరులో మట్టి దోపిడీ యథేచ్ఛగా జరుగుతోందని మండిపడ్డారు. చెరువులు, శ్మశాన వాటికల్లోని మట్టిని సైతం దోచేశారన్నారు. కొడాలి నానీని ఇంటికి పంపిన నాడే అసలైన పండుగ చేసుకోవాలన్నారు. గుడివాడను ఎలా అభివృద్ధి చేయాలో తాను, వెనిగండ్ల రాము అసెంబ్లీలో ప్రణాళికలు సిద్ధం చేస్తామని చెప్పారు. పేకాట క్లబ్‌లు, కేసినోలు, మట్టి, ఇసుక దోపిడీ చేయడానికి వైసీపీ నాయకులకు చాలా ఓపిక ఉందన్నారు. ఆక్వా రంగానికి రూ.1.50కే విద్యుత్ ఇస్తామని చెప్పి, వారి వద్ద నుంచి రూ.5 వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టారని, హెల్త్ యూనివర్సిటీకి మాత్రం ఆయన పేరు ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. వైసీపీ బ్యాచ్ తిట్టే తిట్లకు పన్ను విధిస్తే, ఆ డబ్బుతో రాష్ట్రమంతా విద్యను ఉచితంగా అందించవచ్చని ఎద్దేవా చేశారు. కూటమి అధికారంలోకి రావడం ఖాయమని, మెజారిటీ ఎంత అన్నది మాత్రం ప్రజల ఆలోచన అన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ఉచిత బస్సు సౌకర్యం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆడబిడ్డ, తల్లికి వందనం పథకాలు అమలవుతాయన్నారు. ఎటువంటి పదవి లేనప్పుడే గుడివాడలోని పేదలకు, యువతకు ఉపాధి కల్పించిన వెనిగండ్ల రాము వంటి వ్యక్తి అసెంబ్లీలో అడుగు పెడితే నియోజకవర్గానికి ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. మచిలీపట్నం ఎంపీ జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాముకు ఓట్లు వేసి గెలిపించాలని పవన్ కోరారు. అనంతరం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఏం అభివృద్ధి సాధించావ్.. సింహాద్రి రమేశ్..?

అవనిగడ్డలో పవన్ మాట్లాడుతూ ఏం అభివృద్ధి సాధించావని ఓట్లు అడుగుతున్నావంటూ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌ను ప్రశ్నించారు. ఎదురుమొండి వారధి నిర్మించి గానీ ఓట్లు అడగనని చెప్పి ఇప్పుడు ఎలా అడుగుతున్నావన్నారు. తాము అధికారంలోకి రాగానే ఎదురుమొండి వంతెన, ఎడ్లంక వంతెన నిర్మించి తీరుతామన్నారు. డాక్టర్ కోట శ్రీహరి హత్య జరిగి నాలుగేళ్లు దాటుతున్నా దోషులు ఎవరో ఇంతవరకూ తేల్చలేదని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దోషులను పట్టుకుంటామన్నారు. జనసేన పార్టీ అధికారంలోకి వస్తే అణగారిన వర్గాలపై దాడులకు పాల్పడుతుందంటూ స్థానిక ఎమ్మెల్యే దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

అభివృద్ధి చేసి చూపిస్తాం.. : ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం పార్లమెంట్ జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ అసెంబ్లీ జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తమను గెలిపిస్తే నియోజకవర్గాన్ని సమర్థవంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్ ఏర్పాటు చేస్తామని, పోర్టు కనెక్టివిటీ ద్వారా ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము మాట్లాడుతూ పవన్ పేరులోనే వైబ్రేషన్ ఉందని, ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన వ్యక్తి అని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్, గుడివాడలో నానీలు దుర్మార్గ పాలన సాగించారని, వారిని ఇంటికి సాగనంపే సమయం ఆసన్నమైందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ కూటమి ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన పవన్ కల్యాణ్‌ను అభినందించారు. పామర్రు టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్‌రాజా, క్రికెటర్ అంబటి రాయుడు మాట్లాడారు.

మద్యేమార్గం

మద్యం వ్యాపారుల సరికొత్త మార్గం

* తెలంగాణ నుంచి భారీగా డంప్
* వాహనాలకు ప్రత్యేక ఏర్పాట్లు
* సీసాలు పైకి కనిపించకుండా ముసుగు
* ఎన్నికల వేళ మందు ప్రయోగాలు



స్కూటీలో బయటపడిన మద్యం సీసాలు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : అక్రమ వ్యాపారాలు చేయాలనుకుంటున్న వారిపై సినిమాల ప్రభావం తీవ్రంగా పడుతోంది. తక్కువ ధరకు వచ్చే సరుకును సరిహద్దులు దాటించి ఎక్కువ ధరకు అమ్ముకుంటే ఆదాయం సంపాదించుకోవచ్చనుకుంటున్నారు లోకల్ 'పుష్పాలు'. తెలంగాణతో పోల్చి చూసుకుంటే ఇక్కడ మద్యం ధరలు చాలా ఎక్కువ. బ్రాండెడ్ కంపెనీలకు సంబంధించిన మద్యం అక్కడ అందుబాటులో ఉంటే, ఇక్కడ చిత్రవిచిత్రమైన బ్రాండ్లే ఉన్నాయి. ఇష్టమైన సరుకు దొరక్కపోవడం, ధరలు దారుణంగా ఉండటంతో మందుబాబులు పొరుగు రాష్ట్రం మద్యం వైపు చూస్తున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు సరిహద్దులు దాటించేస్తున్నారు. తెలంగాణ నుంచి మద్యాన్ని వివిధ మార్గాల్లో సరిహద్దుల్లోకి తీసుకొస్తున్నారు. ఇందుకోసం రకరకాల సదుపాయాలను వాహనాల్లో ఏర్పాటు చేసుకుంటున్నారు.

100 సీసాలకు తగ్గకుండా..

తెలంగాణ మద్యాన్ని సరిహద్దులు దాటిస్తున్న వారిలో అటు తెలంగాణవాసులు, ఇటు ఆంధ్రా వ్యక్తులు ఉంటున్నారు. ఒక్కో ట్రిప్పునకు 100 సీసాలకు తగ్గకుండా తరలిస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీ బృందాలకు చిక్కకుండా అనుకున్న గమ్యానికి చేరితే ఆరోజు పంట పండినట్టే. అదే తనిఖీ బృందాలకు చిక్కితే మాత్రం కేసుల్లో ఇరుక్కుంటున్నారు. ఇలా మద్యాన్ని తరలిస్తున్న వారిలో యువకుల నుంచి వృద్ధుల వరకు ఉంటున్నారు. మద్యం సీసాలను తరలించడానికి వీలుగా ద్విచక్ర వాహనాలను తయారు చేయించుకుంటున్నారు. ఈ తరలింపునకు ఎక్కువగా స్కూటీలు, యాక్టివా వాహనాలను ఉపయోగిస్తున్నారు. జగ్గయ్యపేట, తిరువూరు సరిహద్దుల నుంచి ఈ మద్యం రాష్ట్ర సరిహద్దుల్లోకి ప్రవేశిస్తోంది. బ్రాండెడ్ మద్యం ధరలో తెలంగాణకు, ఆంధ్రాకు వ్యత్యాసం ఉండటంతో తెలంగాణ మద్యానికే సరిహద్దు జిల్లాల్లోని మందుబాబులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇలా తీసుకొచ్చిన సరుకును బెల్టుషాపుల వద్ద విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నందిగామ పోలీసులు రెండు రోజుల క్రితం నిర్వహించిన తనిఖీల్లో ఒక వృద్ధుడిని పట్టుకున్నారు. స్కూటీపై వస్తున్న అతడిని ఆపి తనిఖీ చేయగా, మద్యం సీసాలను దాచిపెట్టడానికి చేసిన ఏర్పాట్లను చూసి పోలీసులు అవాక్కయ్యారు. స్కూటీకి సీటు కింద డిక్కీకి ఒక బాక్సును తయారు చేయించుకున్నాడు. దీనికి అడుగు భాగాన ఖాళీ ఉండేలా చూసుకున్నాడు. ఇందులో కొన్ని మద్యం సీసాలు పెట్టాడు. బాక్సులా తయారు చేయించుకున్న డిక్కీలో కొన్ని సీసాలు పెట్టాడు. హ్యాండిల్ భాగంలో హెడ్‌లైట్‌కు కింద ఉండే ప్లాస్టిక్ ప్లేట్ లోనూ కొన్ని సీసాలు పెట్టాడు. తీసేకొద్దీ సీసాలు వస్తుండటంతో పోలీసులు ఆశ్చర్యపోయారు.

ఏపీలో కూటమిదే అధికారం..

ప్రసాదంపాడులో సినీ హీరో సాయిధరమ్ తేజ్ ఎన్నికల ప్రచారం - 2లో.



చిలకలపూడి మునిసిపల్ హైస్కూలు వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

సమన్వయ లోపం!

- నోడల్ ఆఫీసర్ తీరుతో పోస్టల్ బ్యాలెట్ వేయలేక వెనుదిరిగిన ఉద్యోగులు
- ఉద్యోగులకు ఇవ్వని ముందస్తు సమాచారం

మచిలీపట్నం టౌన్, మే4 : పోస్టల్ బ్యాలెట్ విషయంలో జిల్లా కలెక్టరు ఉత్తరువులకు, నోడల్ అధికారి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి మధ్య సమన్వయ లోపంపై చిలకలపూడి హైస్కూలుకు వచ్చిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. కృష్ణా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బాలాజీ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం.. ఇతర జిల్లాల్లో ఓటు కలిగి ఇక్కడ ఉద్యోగం చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు శనివారం పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు మచిలీపట్నం చిలకలపూడి హైస్కూల్‌కు వచ్చారు. కలెక్టర్ బాలాజీ ఉద్యోగులకు ఎన్నికల శిక్షణ రోజున ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగిన ఉద్యోగులు ఈనెల 4వ తేదీన పోస్టల్ బాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించినట్టు చెప్పారు. లేని పక్షంలో చర్యలు తప్పవని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు లిఖిత పూర్వక ఉత్తర్వులు ఇచ్చారు. సదరు ఉత్తర్వుల మేరకు చిలకలపూడి హైస్కూల్‌కు శనివారం ఉదయం పదిగంటలకు కృష్ణాజిల్లాలో పనిచేస్తు ఇతర జిల్లాల్లో ఓటు ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చారు. అయితే హైస్కూలు తలుపులు మూసి ఉండటంతో ఉద్యోగులు ఆందోళనకు దిగారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో ఓటు ఉండి కృష్ణా జిల్లాలో ఎన్నికల విధులకు నియమించిన ఉద్యోగులు 2500 మంది ఉన్నారు. వీరందరూ తమ ఓటు వేసేందుకు ఫారం-12లో నమోదు చేసిన విధంగా ఆయా పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన బ్యాలెట్ పేపర్లను కృష్ణాజిల్లాకు కలెక్టరు తెప్పించారు. అయితే వాటిని చిలకలపూడి స్కూల్‌కు తీసుకురావడంలో విఫలమయ్యారు. కనీసం 6వ తేదీన రావాలని ముందుగా కనీస సమాచారం ఇవ్వలేదు. దీంతో శనివారం ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కార్యాలయ ఉద్యోగి బాలాజీ వారిని 6 వతేదీన రావాలని చెప్పడంతో.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు మళ్లీ రావడానికి ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. శాఖల మధ్య సమన్వయ లోపం తమకు శాపమైందన్నారు.

ఆరో తేదీన పది కౌంటర్లు ఏర్పాటు చేస్తాం

- షేక్ షాహిద్ బాబు, నోడల్ ఆఫీసర్

చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లో ఆరో తేదీ ఉదయం నుంచి పోస్టల్ బ్యాలెట్‌లు ఇచ్చి ఓటింగ్ నిర్వహిస్తాం. ఎక్కువ మంది వస్తున్నందున 10 కౌంటర్ల వరకు ఏర్పాటు చేస్తాం. ఎవరికీ ఇబ్బంది లేకుండా చేస్తాం. ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు సుమారు 2500 మంది వచ్చే అవకాశం ఉంది.



ఆరో తేదీకి మారిందని ఉద్యోగులకు చెబుతున్న బాలాజీ



పోలింగ్ బూత్ వద్ద ఎండలో విధుల నిర్వహణ



10.30గంటలకు షామియానా వేస్తున్న సిబ్బంది



అప్పటికప్పుడు కుర్చీలు, మంచినీటిని తరలిస్తున్న దృశ్యం

అధికారుల అలసత్వం!

- కనీస సౌకర్యాల ఏర్పాటులో ఆర్వో నిర్లక్ష్యం!
- పోలింగ్ బూత్ వద్ద ఎండలో ఉద్యోగుల పాట్లు
- ఓట్లు మురిగిపోతాయని పలువురి ఆందోళన

గుడివాడ, మే 4 : వివాదాస్పద నిర్ణయాలతో తరచుగా వార్తల్లో నిలుస్తున్న గుడివాడ రిటర్నింగ్ అధికారి ఎన్నికల విధుల్లో మరోసారి నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు సౌకర్యాల కల్పన, సమాచార విషయంలో అలసత్వం బయటపడింది. స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఉద్యోగుల పోస్టల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్లకు కనీస వసతులు ఇక్కడ కల్పించకపోవడం గమనార్హం. మండల తహసీల్దార్, రిటర్నింగ్ అధికారి అక్కడే ఉన్నా.. ఎండ వేడిమితో ఓటర్లు చెట్ల నీడకు చేరడం వారికి కనిపించకపోవడంపై ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ బాలాజీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించనున్నారనే సమాచారంతో 10.45 నిమిషాలకు హుటాహుటిన షామియానా, కుర్చీలు, మంచినీటిని తెప్పించారు.

మోడల్ నమూనా బ్యాలెట్ ప్రదర్శన లేదు

పోలింగ్ జరిగే గదుల వద్ద మోడల్ నమూనా బ్యాలెట్‌ను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఓటు హక్కు వినియోగించుకునే వారికి ఉపయోగకరంగా ఉంటుందని ఏర్పాటు చేశారు. ఉద్యోగుల పోస్టల్ పోలింగ్ కేంద్రంలో పార్లమెంట్, అసెంబ్లీ నమూనా బ్యాలెట్ ఎక్కడా కానరాలేదు. దీంతో ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు.

సందేహాలు తీర్చేవారే కరువయ్యారు..

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు వినియోగించుకునే ఉద్యోగుల సందేహాలను నివృత్తి చేయాలి. వారికి అవసరమైన సహాయాన్ని అందించాలి. ప్రతి ఉద్యోగి ఓటు వేసే సమయంలో ఫారం 13ఎ సమర్పించాలి. సదరు ఫారంలో ఓటరును ధృవీకరిస్తూ గెజిటెడ్ అధికారి సంతకం పెట్టాలి. సంతకంతో పాటు స్టాంప్, సీల్ తప్పనిసరిగా వేయాలి. అయితే గుడివాడలో దీనికి భిన్నంగా సాగింది. ఫారం 13ఎ పైన స్టాంప్ లేకుండానే గెజిటెడ్ అధికారి సంతకం పెట్టారు. ఉద్యోగులు అడిగితే అవసరం లేదని, ఓటును వినియోగించుకోవాలని ఉచిత సలహా యిచ్చారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఉపాధ్యాయులకు ఓటు మురిగిపోయిందనే సందేహం తలెత్తింది. గెజిటెడ్ అధికారి స్టాంప్ లేకపోవడంతో ఓటును పరిగణలోకి తీసుకోరని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

సిబ్బందికి శిక్షణపై అనుమానాలు

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో పాటించాల్సిన నియమ, నిబంధనలను సిబ్బందికి శిక్షణలో తెలిపాలి. ఫెసిలిటేషన్ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వలేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. సంతకంతో పాటు తప్పనిసరిగా స్టాంప్, సీల్ వేయాలన్న నిబంధన ఖచ్చితంగా పాటించాల్సి ఉన్నా ఎందుకు పట్టించుకోలేదనే సందేహం వారిలో వ్యక్తమవుతున్నది. గెజిటెడ్ అధికారి తీరుపై పలు అనుమానాలు వ్యక్తవుతున్నాయి.

ఎన్నికల విధుల్లో ఆర్డీవో అలసత్వం

ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్న ఆర్డీవో పి.పద్మావతి విధుల పట్ల అలసత్వం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎన్నికల కమిషన్ ఒత్తిడి మేరకే విధులు నిర్వర్తిస్తున్నట్టు ఆమె ప్రవర్తన ఉంది. నిబంధనలను తుంగలో తొక్కడం పరిపాటిగా మారింది. వైసీపీ అభ్యర్థి కొడాలి నాని ప్రధాన ఎన్నికల ఏజెంట్ శశితో పోలింగ్ కేంద్రంలో దాదాపుగా గంటపాటు ఉద్యోగుల ఉండగానే బాతాఖానీ నిర్వహించినట్టు సమాచారం.

ఏపీలో కూటమిదే అధికారం..

- సినీ హీరో సాయిధరమ్ తేజ్



ప్రసాదంపాడు బల్లెంవారి వీధిలో ఎన్నికల ప్రచారంలో హీరో సాయిధరమ్ తేజ్

గుణదల/పెనమలూరు, మే 4 : ఏపీలో కూటమి అత్యధిక మెజారిటీతో గెలుపొంది అధికారంలోకి రావడం ఖాయమని సినిమా హీరో సాయిధరమ్ తేజ్ జోశ్యం చెప్పారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామంలోని బల్లెంవారి వీధిలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కూటమి టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును బలపరుస్తూ సాయిధరమ్ తేజ్ రోడ్‌షో ద్వారా స్థానికుల్లో జోష్‌ను పెంచారు. సాయిధరమ్ తేజ్‌కు యువత అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. శనివారం నిర్వహించిన యార్లగడ్డ రోడ్‌షోలో పెద్దసంఖ్యలో తరలి వచ్చిన వారిని ఉద్దేశించి సాయిధరమ్ తేజ్ మాట్లాడారు. సంక్షేమం ఎంత ప్రధానమో రాష్ట్రంలోని ప్రజలకు అభివృద్ధి అంతే ప్రధానమన్న విషయాన్ని గుర్తెరిగి రెండు సమపాళ్లలో చేసి చూపించగల కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. రాజకీయాలు అభివృద్ధి చేయడానికి పోటీపడి చేయాలని, రాజకీయమనే ఉపాధి ఎంచుకుని చేసేవారికి పట్టంగట్టకూడదన్నారు. వైసీపీకి అధికార దాహం పెరిగిపోయిందని వారి దాహార్తిని తీర్చుకోవడానికి దేన్నయినా పణంగా పెట్టేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అవసరమైన సంపద ఉందని దానిని సక్రమంగా వినియోగించుకుని దేశంలోనే ఏపీని ఉన్నత స్థితికి తీసుకెళ్ల వచ్చని చెప్పారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, మహిళలు ఆర్థికంగా బలపడాలన్నా, ఉద్యోగులు స్వయం ప్రతిపత్తితో పనిచేయాలన్నా, సంక్షేమం.. అభివృద్ధి సమపాళ్లలో జరగాలన్నా కూటమి అధికారంలోకి వస్తేనే సాధ్యపడుతుందన్నారు. అభివృద్ధే లక్ష్యంగా ప్రజాసేవే మహాభాగ్యంగా భావించి రాజకీయాల్లోకి వచ్చిన గన్నవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోల్లా ఆనంద్, అద్దేపల్లి సాంబశివనాగరాజు, నబిగాని కొండ, జనసేన మండల అధ్యక్షుడు పొదిలి దుర్గారావు, గన్నవరం నియోజకవర్గం జనసేన సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, సాగనబోయిన సుభాషిణి, అల్లిన మహేష్ తదితరులు పాల్గొన్నారు. తాడిగడప డొంకరోడ్డు, యనమలకుదురులోని ఇందిరానగర్ కాల్వ కట్ట1, 3ల వద్ద జరిగిన ప్రచారయాత్రలో సాయిధరమ్ తేజ్ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్, ఎంపీ అభ్యర్థి బాలశౌరి కుమారుడు వల్లభనేని అరుణ్‌లతో కలిసి ప్రచారయాత్రలో పాల్గొన్నారు. యనమలకుదురులో సాయిధర్మతేజ్ ప్రచారయాత్రకు వేలాదిగా తరలివచ్చారు. కూటమి అభ్యర్థులు బోడె ప్రసాద్‌ను, వల్లభనేని బాలశౌరిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని ప్రజా ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.



వైసీపీ నేతలకు పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కేశినేని శివనాథ్

రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమిని గెలిపించుకుందాం

- జగన్ దుర్మార్గ పాలనకు చరమగీతం పాడుదాం : కేశినేని చిన్ని

విద్యాధరపురం, మే 4 : జగన్ దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడుదామని, రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించుకుందామని కూటమి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. శనివారం గురునానక్‌కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో కేశినేని చిన్ని సమక్షంలో భారీ సంఖ్యలో పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వైసీపీ నగర జనరల్ సెక్రటరీ ముత్యం మణెమ్మ ఆధ్వర్యంలో 200 మంది వేర్వేరుగా టీడీపీలో చేరారు. చిన్ని వారందరికీ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జగన్ రాక్షసపాలనను భరించలేక రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమని నమ్మి వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి వస్తున్నారని చిన్ని అన్నారు. 2014-2019లో లోటు బడ్జెట్‌లో ఉన్నా పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు టీడీపీ కృషి చేసిందన్నారు. కనకదుర్గా ఫ్లైఓవర్ నిర్మించడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారమైందన్నారు. టీడీపీ శ్రేణుల కుటుంబసభ్యులకు ఏ సమస్య వచ్చినా తాను, కూటమి పశ్చిమ అభ్యర్థి సుజనాచౌదరి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో తనను ఎంపీగా, సుజనాచౌదరిని ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు కేశినేని చిన్నిని గజమాలతో ఘనంగా సత్కరించారు. టీడీపీలో చేరిన వారిలో 38వ డివిజన్‌కు చెందిన మట్టి కోటేశ్వరరావు, 39వ డివిజన్‌కు చెందిన ఏలూరు వెంకన్న, వించిపేటకు చెందిన మదీర ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమాల్లో నేతలు బొమ్మసాని సుబ్బారావు, షేక్ కరీముల్లా, ఎండీ ఫతావుల్లా, అబ్దుల్‌ఖాదర్, నరసింహచౌదరి, కామా దేవరాజ్, డాక్టర్ ఎస్.విశ్వనాథ్ పి.పద్మ, బడుగు గణేష్, ఎస్.బాలు, చింతపల్లి సత్యం తదితరులు ఉన్నారు.

రాష్ట్రాన్ని గాడిలో పెట్టేది ఎన్డీఏ కూటమే

- వసంత కృష్ణప్రసాద్



చెవుటూరు ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్

జి.కొండూరు, మే 4 : ఏపీని జగన్ సర్వనాశనం చేశాడని, ప్రజలపై పెనుభారం మోపాడని, రూ.13 లక్షల కోట్లు అప్పులు చేశాడని, అన్ని వ్యవస్థలను గాడి తప్పించాడని వాటన్నింటినీ తిరిగి గాడిలో పెట్టగల సత్తా ఎన్డీఏ కూటమిలో ముఖ్యమంత్రి అయ్యే చంద్రబాబుకు మాత్రమే ఉందని బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ అన్నారు. శనివారం ఆయన చెవుటూరు, వెంకటాపురం, కుంటముక్కల, వెల్లటూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనకు ప్రతి గ్రామంలో ప్రజలు అపూర్వస్వాగతం పలికారు. హారతులు పట్టి విజయ తిలకం దిద్దారు. అనంతరం వసంత మాట్లాడుతూ, జగన్ ఐదేళ్ల పాలనలో ప్రజలు, నిరుద్యోగులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, అమరావతి రైతులు అన్ని రకాలుగా నష్టపోయారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్లను మూసివేసి అందరికీ అన్యాయం చేశారన్నారు. తెలుగుదేశం మహా కూటమి అధికారంలోకి రాగానే అన్ని వర్గాలకు సంబంధించిన కార్పొరేషన్ల కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ సబ్సిడీ రుణాలు అందిస్తామన్నారు. జగన్ బాధితులంతా మీ అందరి భవిష్యత్ కోసం ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలన్నారు. అభివృద్ధితో పాటు ప్రజలకు సంక్షేమం అందించడం చంద్రబాబు వల్ల మాత్రమే అవుతుందని జగన్‌కు అభివృద్ధి చేయడం చేతకాక ఓట్ల కోసం మీట నొక్కుడు ఎంచుకున్నాడని అప్పులు చేసి మీటలు నొక్కలేక ఉత్త బటన్స్ నొక్కాడన్నారు. విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)కి తనకు ఓటు సైకిల్‌పై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలసలు..



వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సమక్షంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం తీసుకున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రెండు మండలాలకు చెందిన ఎంపీపీలు, పలువురు గ్రామ సర్పంచ్‌లు టీడీపీ తీర్థం తీసుకున్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మండలం జూపూడి, రెడ్డిగూడెం మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు వసంత సమక్షంలో టీడీపీ తీర్థం తీసుకున్నారు.



పీఎం రోడ్ షో ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులు

పీఎం రోడ్ షో ప్రాంతాల పరిశీలన

విజయవాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఈనెల ఎనిమిదో తేదీన రోడ్డు షో నిర్వహించే ప్రాంతాలను ఎన్టీఆర్ జిల్లా అధికారులు శనివారం పరిశీలించారు. కలెక్టర్ ఢిల్లీరావు, పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ, డీసీపీలు కంచి శ్రీనివాసరావు, అధిరాజ్‌సింగ్ రాణా తదితరులు ఎంజీ రోడ్డును పరిశీలించారు. మోదీ ఎనిమిదో తేదీన గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఎంజీ రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి బెంజ్‌సర్కిల్ వరకు రోడ్‌షో నిర్వహిస్తారు. ఇక్కడ ప్రధాని భద్రత, ప్రముఖులు వచ్చే వాహనాల పార్కింగ్ ప్రదేశాలను కలెక్టర్, సీపీ తదితరులు పరిశీలించారు. రోడ్డు షో నిర్వహించే సమయంలో ఎంజీ రోడ్డులో ట్రాఫిక్‌ను ఏయే ప్రాంతాల మీదుగా మళ్లించాలనే అంశాలను పరిశీలించారు.

ఇళ్లపై వైసీపీ జెండాలు.. తొలగించిన అధికారులు



వీడియో తీస్తున్న అధికారులు

జగ్గయ్యపేట రూరల్, మే 4 : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో పలువురు ఇళ్లపై వైసీపీ జెండా కట్టిన వైనంపై టీడీపీ నాయకులు సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయటంతో స్క్వాడ్-2 అధికారులు ఆ ప్రాంతంలోని జెండాలను వీడియో తీయటంతో పాటు కట్టిన వారితోనే తీయించారు. వివరాలలోకి వెళితే.. జగ్గయ్యపేట కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి వస్తున్నారని తెలిసి స్థానిక వైసీపీ నేత అత్యుత్సాహంతో తమకు అనుకూలురు ఇళ్ల ఎదుట పార్టీ జెండాలు ఏర్పాటు చేయించారు. నిబంధనల మేరకు ఇంటి ముందు పార్టీ జెండాలు ఉండరాదని పలుమార్లు అధికారులు చెబుతున్నా జెండాలను ఏర్పాటు చేశారు. దీనిపై ప్రచారానికి వచ్చిన టీడీపీ శ్రేణులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ప్రచారం సందర్భంగా ఎటువంటి ఘర్షణలు లేకుండా చూసేందుకు వచ్చిన పోలీసులకు జెండాలు కనిపించకపోవడం గమనార్హం. పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని, ఇలా అయితే ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉండదని ఏవైనా అల్లర్లు, ఘర్షణలు జరిగితే అందుకు బాధ్యులెవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

దుర్గగుడిలో మహిళా ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక కమిటీ

వన్‌టౌన్, మే 4 : దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులతో పాటు మహిళా సెక్యూరిటీ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది ఇతర విభాగాల్లో పనిచేస్తున్న మహిళల సమస్యలు స్వీకరించడానికి దేవస్థానం ఈవో కేఎస్ రామారావు శనివారం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో దుర్గగుడి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) ఎల్.రమాదేవి, ఏఈవో పి.సుధారాణి, సూపరింటెంటెంట్ పి.సునీత, సీనియర్ అసిస్టెంట్ భవ్య ఉన్నారు. ఈ కమిటీ వారంలో ఒకటి రెండుసార్లు మహిళా ఉద్యోగుల నుంచి సమస్యలతో కూడిన వినతి పత్రాలను స్వీకరించి తన దృష్టికి తీసుకురానున్నట్టు ఈవో రామారావు తెలిపారు.

దుర్గమ్మ సేవలో దేవదాయ కమిషనర్

దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలోని కనకదుర్గమ్మ దర్శనార్థం శనివారం దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

కూటమి అభ్యర్థుల రోడ్‌షోలో వంగవీటి



పటమట, మే 4 : తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్, ఎంపీగా కేశినేని శివనాథ్(చిన్ని)లను గెలిపించాలని కోరుతూ దర్శిపేట నుంచి జరిగిన రోడ్‌షోకు శనివారం టీడీపీ స్టార్ క్యాంపెయినర్ వంగవీటి రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన బైక్ ర్యాలీలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, వంగవీటి రాధా అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు. డప్పు వాయిద్యాల, డీజేలతో పవన్‌కల్యాణ్, చంద్రబాబు ప్రసంగాల ఆడియోలతో యువకులు కేరింతల మధ్య ఈ ర్యాలీ కోలాహలంగా జరిగింది. తొలుత దర్శిపేట రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహించి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో వంగవీటి రాధాతో పాటు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, అమ్మిశెట్టి వాసు, బొప్పన భవకుమార్, పోతంశెట్టి నాగేశ్వరరావు ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ప్రతి సెంటర్‌లో అభిమానులు క్రేన్‌ల ద్వారా తమ అభిమాన నాయకులకు గజమాలలు వేశారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో ఎన్టీఆర్ క్రీడాకారులకు పతకాలు

విజయవాడ స్పోర్ట్స్, మే 4 : చిత్తూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ స్టేడియంలో శనివారం ముగిసిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ అండర్-17 చాంపియన్‌షిప్‌లో ఎన్టీఆర్ జిల్లా రెజ్లర్లు పతకాలతో సత్తా చాటారు. నగరంలోని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్, నున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. బాలుర విభాగంలో ఎస్.రోహిత్‌కుమార్ బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఎన్‌జే.విజయ్ కుమార్‌కు రజతం, డి.రామచంద్ ఈశ్వర్, టి.శ్యామ్. వైజిక్రిరెడ్డి కాంస్యాలు సాధించారు. బాలికల విభాగంలో డి.శరణ్య, ఎస్‌కే.సదాలు రజతాలను, బి.పుష్ప, వి.గీతశ్రీ, డి.భవానీలు కాంస్యాలను సాధించారు.

లోన్ యాప్‌కు యువకుడు బలి

విజయవాడ, మే 4 (ఆంధ్రజ్యోతి) : యాప్‌ల్లో రుణాలు తీసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన శనివారం బయటపడింది. విజయవాడ మొగల్రాజపురంలోని గిరిపురం సంది ఏసేబు వీధికి చెందిన కుక్కల స్వరూప హోటల్‌లో పనిచేస్తోంది. ఆమెకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దమ్మాయి శార, ఆమె భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లలు స్వరూప వద్ద ఉంటున్నారు. మనవడు టేకేటి ఇసాక్(23) పీవీపీ వద్ద ఇంటర్నెట్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ప్రతిరోజూ ఉదయం తొమ్మిదిన్నర గంటలకు ఇంటి నుంచి వెళ్లి సాయంత్రం ఆరు గంటలకు తిరిగి వస్తాడు.

ఈనెల మూడున స్వరూప హోటల్‌కు వెళ్లింది. ఇంట్లో మనవరాలు దివ్య ఉంది. ఇసాక్ ఇంటర్నెట్ సెంటర్‌కు వెళ్లి మధ్యాహ్నం నుంచి అనారోగ్యంగా ఉందని ఇంటికి వచ్చాడు. దివ్య చర్చికి వెళ్లింది. స్వరూప కుమారుడు, పిల్లలు భోజనం చేయడానికి ఇంటిపైన ఉండే రేకుల షెడ్‌లోకి వెళ్లారు. ఎంత కొట్టినా తలుపులు తీయకపోవడంతో అతడు స్వరూపకు ఫోన్ చేశాడు. ఆమె వెంటనే వచ్చి తలుపులు బద్దలుకొట్టి చూడగా ఇసాక్ చున్నీతో ఉరిపోసుకుని ఉన్నాడు. వెంటనే సూర్యరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. స్వరూప ఇచ్చిన ఫిర్యాదుపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. లోన్ యాప్‌ల్లో రుణాలు తీసుకోవడంతో అప్పుల పాలయ్యాడని పోలీసులు తెలిపారు. ఇలా తీసుకున్న రుణాలను ఇసాక్ ఏం చేశాడన్నది తెలియడం లేదు.

క్రికెట్ బెట్టింగ్‌లపై తల్లిదండ్రులు మందలించారని..

రైల్వేస్టేషన్ : క్రికెట్ బెట్టింగ్‌లో పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్నందుకు తల్లిదండ్రులు క్రికెట్ బెట్టింగ్‌లు ఆడవద్దని మందలించినందుకు మనస్థాపం చెంది రాణిగారితోటకు చెందిన మేకల చంద్రశేఖర్ (30) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాణిగారితోట మాదంశెట్టి సీతయ్య వీధిలో ఎం.వి.వి.సత్యనారాయణ భార్య, కుటుంబసభ్యులతో ఉంటున్నాడు. నక్కల రోడ్డులోని ఓ ఫార్మా కంపెనీలో డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్నాడు. చంద్రశేఖర్ తండ్రితో పాటే పనిచేస్తున్నాడు. చంద్రశేఖర్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బెట్టింగ్‌లకు అలవాటుపడ్డాడు. బెట్టింగ్‌ల వల్ల పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్నాడు. దీనివల్ల కొందరి వద్ద అప్పులు కూడాచేశాడు. అప్పుల వాళ్లు చంద్రశేఖర్ ఇంటికి వెళ్లి అప్పుడప్పుడు గొడవ చేస్తుండగా అతని తల్లిదండ్రులే అప్పులు తీరుస్తుండేవారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు చంద్రశేఖర్ డిస్ట్రిబ్యూషన్‌లో ఉన్న తండ్రి వద్దకు వెళ్లి డబ్బులివ్వమని గొడవపడ్డాడు. ఈ విషయాన్ని సత్యనారాయణ తన భార్యతో చెప్పాడు. దీంతో కుమారుడు చంద్రశేఖర్‌ను మందలించారు. దీంతో మనస్థాపం చెందిన చంద్రశేఖర్ శనివారం మధ్యాహ్నం 1 గంటకు ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అతనిని కిందకు దించి 108లో ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్టు నిర్ధారించారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

గంజాయి ముఠా అరెస్టు

- 9.5 కిలోల గంజాయి స్వాధీనం

హనుమకొండ టౌన్, మే 4 : చింతపండు, యూరియా బస్తాల మధ్య గంజాయి రవాణా చేస్తున్న నలుగురు ముఠా సభ్యులను హనుమకొండ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి పోలీసులు రూ.2లక్షల 35వేల విలువైన 9.5కిలోల గంజాయితోపాటు నాలుగు సెల్‌ఫోన్లు, చింతపండు బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి శనివారం హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలానికి చెందిన ఈదర కృష్ణనాగేశ్వర్‌రావు, అనుమోలు వెంకటరమణలు గంజాయి వ్యాపారం చేస్తున్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న సీలేరుకు చెందిన సురేష్ వద్ద గంజాయి కొనుగోలు చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా చింతపండు, యూరియా బస్తాల మధ్య గంజాయిని భద్రపరిచి హనుమకొండలో పరిచయం ఉన్న మహ్మద్ అబ్దుల్‌రహీమ్, మహారాష్ట్రకు చెందిన త్రిపాఠిలకు విక్రయించేందుకు శుక్రవారం హనుమకొండ బస్టాండ్ చేరుకున్నారు. ఏపీ నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు బస్టాండ్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్టు సమాచారం రావడంతో ఎస్సై శ్రావణ్ సిబ్బందితో హుటాహుటిన బస్టాండ్‌కు చేరుకున్నారు. ఇద్దరు నిందితులు హనుమకొండకు చెందిన ఇద్దరి నిందితులకు గంజాయిని విక్రయించే క్రమంలో ఎస్సై శ్రావణ్ సిబ్బందితో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నిందితులు గంజాయి క్రయ విక్రయాలను జరుపుతున్నట్టు వెల్లడైంది. నిందితుల నుంచి గంజాయి, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎస్సై శ్రావణ్‌తో పాటు హనుమకొండ పోలీస్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు. దాడుల్లో ఎస్సైలు శ్రీనివాస్, పరుశురాములు, పోలీసు సిబ్బంది భాస్కర్, కిరణ్, శివ, గౌస్‌పాష పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	144, 153, 164
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.40

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని యువకుడి మృతదేహం

రైల్వేస్టేషన్, మే 4: విజయవాడ ఈశాన్య క్యాబిన్ నుంచి గుణదల మధ్య రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభించినట్లు శనివారం రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. రైల్వే ట్రాక్‌పై ఓ మృతదేహం ఉన్నట్లు స్టేషన్ సూపరింటెండెంట్ ఇంతియాజ్‌కు సమాచారం తెలిసింది. ఆయన సూచన మేరకు రైల్వే పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.

మృతదేహం వద్ద ఎలాంటి గుర్తింపు ఆధారాలు లేనందున పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి సుమారు 25 సంవత్సరాల వయస్సు ఉంటుందని ఒంటిపై నలుపురంగు ప్యాంట్, ఎరుపు రంగు షర్టు ఉన్నట్లు పోలీసులు చెప్పారు.

ల్యాండ్ టైటిలింగ్‌తో ప్రజల ఆస్తులకు ఎసరు

తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్

భారతీనగర్/గుణదల, మే 4: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల ప్రజలు కష్టపడి సంపాదించుకున్న ఆస్తులకు ఎసరు పెట్టేందుకు జగన్మోహన్ రెడ్డి చూస్తున్నారని జనసేన, బీజేపీ బలపరిచిన టీడీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. శనివారం తూర్పు నియోజకవర్గం 3వ డివిజన్ పరిధిలోని విజయలక్ష్మీ కాలనీ హైటెన్షన్ వైర్ల రోడ్డు మూడో వీధిలో గద్దె రామ్మోహన్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో జనసేన, బీజేపీ బలపరిచిన తూర్పు అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా కేశినేని శివనాథ్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు పోయినా పర్వాలేదు కాని తనకు రాజకీయ లబ్ధి కలగాలనే ఉద్దేశ్యంతోనే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉన్నారని అన్నారు.ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల ప్రజల ఆస్తులకు ఇబ్బంది అని అన్నారు. పేదల నుంచి ఉన్నత వర్గం కూడా ఈ చట్టం వల్ల భయపడుతున్నారని అన్నారు. 1994లో ప్రతిపక్ష హోదా కూడా రాకుండా కాంగ్రెస్ పార్టీ ఓడిపోయినట్లుగా 2024లో జరుగుతున్న ఈ ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా రాకుండా ఓడిపోవడం ఖాయమని అన్నారు.


ఎన్నికల ప్రచారంలో గద్దె రామ్మోహన్, తదితరులు

టీడీపీ హయాంలోనే విజయవాడ అభివృద్ధి

వచ్చే ఎన్నికల్లో గెలిచి టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొండపై తాగునీటి సరఫరా వ్యవస్థను మరింతగా మెరుగుపరుస్తామని, అలాగే భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థను సరిచేస్తామని గద్దె రామ్మోహన్ అన్నారు. కొండ ప్రాంత వాసులకు, కృష్ణలంక ప్రాంత వాసులకు ఇళ్ల పట్టాలను ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత విజయవాడను అభివృద్ధి చేస్తామన్నారు. పోతంశెట్టి నాగేశ్వరరావు, తాడి బాబురావు, గుత్తికొండ కృష్ణమోహన్, యలమంచిలి పండు, గుత్తికొండ మోహన్‌రావు, ఏసుబాబు, బండి కోమలి, పేరేపి ఈశ్వర్, రాజనాల సురేష్ పాల్గొన్నారు.

ఉమ్మడి మేనిఫెస్టోకు ప్రజల మద్దతు : గద్దె అనురాధ

భారతీనగర్, మే 4: ఐదు సంవత్సరాలుగా జగన్మోహన్‌రెడ్డి చేసిన మోసాలను, పెట్టిన ఇబ్బందులను రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదని జడ్పీ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. శనివారం తూర్పు నియోజకవర్గం 4వ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్, కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలో గద్దె అనురాధ, గద్దె క్రాంతి కుమార్‌లు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో జనసేన, బీజేపీ బలపరిచిన తూర్పు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గద్దె అనురాధ కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేసే సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి ఆమె వివరించారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోకు ప్రజల మద్దతు ఉందన్నారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, గొల్లపూడి నాగేశ్వరరావు, సలిమిశెట్టి రాజామణి, కొర్రపాటి సురేంద్ర, కర్రి ఉమామహేశ్వరి, గొల్లపూడి అశోక్, మిక్కిలినేని బుజ్జిబాబు, మొవ్వ వెంకటరత్నం, పర్వతనేని రత్నశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారంజక పాలన టీడీపీకే సాధ్యం

కేశినేని జానకీ లక్ష్మి


రామకృష్ణాపురంలో ప్రచారం చేస్తున్న కేశినేని జానకీ లక్ష్మి

సత్యనారాయణపురం, మే 4: సంక్షేమం అభివృద్ధిని సమతుల్యంగా నడిపించే శక్తి సామర్థ్యాలు చంద్రబాబునాయుడికే సాధ్యమని విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి కేశినేని జానకీ లక్ష్మి పిలుపు నిచ్చారు. 30వ డివిజన్ రామకృష్ణాపురంలో శనివారం ఆమె పర్యటించారు. రామకృష్ణాపురంలోని హోమ్లి అపార్టుమెంట్స్, వశిష్టా అపార్టుమెంట్స్, ధనుంజయ అపార్టుమెంట్స్‌తో పాటు డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా జానకీ లక్ష్మి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన జగన్మోహనరెడ్డికి రాబోయే ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. రామరాజ్యం తిరిగి రావాలన్నా, ప్రజారంజక పాలన సాగాలన్నా తిరిగి టీడీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యం అన్నారు. అపార్టుమెంట్స్ ప్రెసిడెంట్ అప్పలరాజు, పురుషోత్తం, డివిజన్ అధ్యక్షుడు సూర్యనారాయణ, ఇన్‌చార్జి గొట్టుముక్కల శేషంరాజు, గరిమెళ్ల నాగమణి, శారద, శ్రీను, బీజేసీ, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కారు పార్కింగ్ రుసుం అడిగినందుకు
కాంట్రాక్టర్‌పై ఆరుగురు దాడి

వన్‌టౌన్, మే 4 : పార్కింగ్‌లో కారు నిలిపినందుకు రుసుం అడిగితే ఆరుగురు పార్కింగ్ కాంట్రాక్టర్‌పై దాడి చేసి అతని చొక్కా చింపివేసిన సంఘటన శుక్రవారం రాత్రి కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈ3 పార్కింగ్ వద్ద జరిగింది. బాధితుడు శనివారం కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం కొత్తపేట కేబీఎన్ కళాశాల వెనుక ఫణుకు ఫణీంద్ర ఉంటున్నాడు. ఇతను బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని పార్కింగ్ నిర్వహణకు పాడుకున్నాడు.


పార్కింగ్‌లో నిలిపిన కారు ఇదే


కాంట్రాక్టర్ ఫణీంద్ర

శుక్రవారం రాత్రి 10.30కు యూపీఎ1ఏయూ2624 నెంబర్ గల కారులో ఆరుగురు పార్కింగ్ ప్రాంగణంలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్‌కు వచ్చారు. పార్కింగ్ కాంట్రాక్టర్ ఫణీంద్ర కారుకు పార్కింగ్ రుసుం చెల్లించమని అడుగగా తిరిగి వెళ్లేటప్పుడు ఇస్తామని వారిలో ఒకడు చెప్పాడు. సుమారు 11 గంటల తరువాత ఆరుగురు కారులో తిరిగి వెళుతుండగా ఫణీంద్ర కారు రుసుం ఇవ్వమని వారిని అడుగగా మద్యం మత్తులో ఉన్న వారు ఫణీంద్రతో గొడవపడి అసభ్యకరంగా దూషించి అతని చొక్కాను చించి కొట్టారు. ఈ సంఘటనలో బాధితుడి జేబులో ఉన్న సుమారు రూ.20వేలు మాయం అయ్యాయి. సమాచారం తెలుసుకున్న సీఐ ఏ మురళీకృష్ణ తన సిబ్బందిని ఘటనా ప్రాంతానికి పంపి ఆరుగురిలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తీసుకువచ్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

● సైరన్ కొట్టుకుంటూ హడావుడి

కారులో వచ్చిన ఆరుగురు తమ కారుకు సైరన్ ఏర్పాటు చేసుకుని ఆ సైరన్ కొట్టుకుంటూ స్థానికులు భయభ్రాంతులను చేస్తూ బార్ అండ్ రెస్టారెంట్‌కు వచ్చి హడావుడి చేశారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై కూడా కృష్ణలంక పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఆరుగురిలో ముగ్గురు విదేశాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని, వారిపై కేసు లేకుండా తప్పించడానికి ప్రయత్నం జరుగుతున్నట్టు తెలుస్తుంది.

స్పష్టమైన అవగాహనతో విధులు నిర్వర్తించాలి

పీఓ, ఏపీఓల శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, మే 4 : ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికలను నిర్వహించడంలో ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారుల (ఏపీఓ) పాత్ర కీలకమని, వీరు ప్రతి అంశంపైనా స్పష్టమైన అవగాహన పెంచుకొని చిత్తశుద్ధి, అంకితభావంతో నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి ఎస్.దిల్లీరావు సూచించారు. శనివారం విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి పీఓ, ఏపీఓల శిక్షణా కార్యక్రమం జరిగింది. అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు (ఏఎల్ఎంటీ) ద్వారా జరుగుతున్న రెండో దశ శిక్షణా కార్యక్రమాన్ని దిల్లీరావు పరిశీలించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, వీడియోల ప్రదర్శన ద్వారా వివిధ అంశాలపై ట్రైనర్లు శిక్షణ ఇస్తున్న తీరును పరిశీలించారు.

ముఠా కార్మికులకు అండగా ఉంటా

పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి

వన్‌టౌన్, మే 4: ముఠా కార్మికులకు అండగా ఉంటానని కూటమి బలపరచిన విజయవాడ పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా సుజనా చౌదరి టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరాతో కలిసి వన్‌టౌన్ వస్త్రలతలోని ముఠా కార్మికులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన ముఠా కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఠా కార్మికులందరికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. నాగుల్ మీరా మాట్లాడుతూ సుజనా చౌదరి, కేశినేని చిన్నిలను గెలిపించుకుంటే పశ్చిమ అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుందన్నారు. మాజీ మేయర్ తాడి శకుంతల, బీజేపీ నాయకులు పైలా సోమినాయుడు, 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, నాయకులు కే.శ్రీనివాస్, బి.శ్రీను, పి.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుజనా చౌదరి

ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా అమలుకు చర్యలు

విజయవాడ స్పోర్ట్స్: రైల్వే స్టేడియంలో కబడ్డీ, వాలీబాల్ ప్లేయర్స్‌తో ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరీ శనివారం ఉదయం మాటామంతీ కార్యక్రమంలో పాల్గొన్నారు. క్రీడాకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా అమలులో సమస్యలున్నాయని వివరించారు. కూటమి అధికారంలోకి రాగానే ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కబడ్డీ కోచ్ వై.శ్రీనివాసరావు, వాలీబాల్ సీనియర్ ప్లేయర్లు లింకన్, రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పాల్గొన్నారు.

జగన్ అరాచక పాలనకు ముగింపు పలకండి

పాత రాజరాజేశ్వరిపేట: 35వ డివిజన్ పూర్ణానందంపేట, పెజ్జోనిపేటలో బీజేపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ జగన్ అరాచకపాలన అంతం చేయడానికి ప్రజలు సిద్ధం అవ్వాలని పిలుపు నిచ్చారు. నాగూల్‌మీరా, పైలా సోమినాయుడు, సుభాషిణి, నందకుమారి, ప్రదీప్‌రాజ్ పాల్గొన్నారు.

గెలిపించండి...సేవకుడిగా పనిచేస్తా : సుజనా చౌదరి

విద్యాధరపురం: ఎన్నికల్లో తనను గెలిపిస్తే సేవకుడిలా పనిచేస్తానని కూటమి బలపరచిన పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. శనివారం రాత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, అధికార ప్రతినిధి నాగుల్ మీరాలతో కలిసి 40, 41, 42, 43 డివిజన్లలో రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా 40వ డివిజన్ భవానీపురంలోని పార్టీ కార్యాలయం నుంచి డివిజన్‌లోని అన్ని వీధుల్లో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలిచిన వెంటనే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన ఎన్నికల ప్రచారం, రోడ్డు షోలకు పార్టీ శ్రేణులతో పాటు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చినవెంకటసుబ్బయ్య, నాయకులు గుడూరు కొండయ్య, ఆంజనేయులు, రమణ, రాజేంద్ర, రమణయ్య, రామానాయుడు, నారాయణ, సురేష్, ఆయా డివిజన్ల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


40వ డివిజన్‌లో ప్రచారంలో సుజనా, బుద్దా, నాగుల్‌మీరా తదితరులు

కూటమి విజయంతోనే రాష్ట్ర పురోగతి

బొండా ఉమా

సత్యనారాయణపురం, మే 4: బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి విజయంతోనే రాష్ట్ర పురోగతి ఆధారపడి ఉందని చంద్రబాబును నాయుడును ముఖ్యమంత్రిగా గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 31వ డివిజన్ ముత్యాలంపాడు అల్లూరిసీతారామరాజు కల్యాణమండపం వద్ద నుంచి పసుపుతోట 1వ లేన్ వరకూ శనివారం సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు రోడ్‌షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో వార్ వన్‌సైడ్ అని టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. ఎంపీ అభ్యర్థిగా కేశినేని శివనాథ్ ,సెంట్రల్ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలన్నారు. మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తి రాజు, గాయత్రి, దెందుకూరి మురళీకృష్ణంరాజు, బీజేసీ, జనసేన, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

పాయకాపురం : 61వ డివిజన్‌లోని పైపుల రోడ్డు నుంచి పాయకాపురం వంగవీటి మోహనరంగా విగ్రహం వరకు టీడీపీ నేతలు శనివారం రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గొప్ప విజన్ ఉన్న నేత చంద్రబాబు, నిబద్ధత కలిగిన వ్యక్తి పవన్‌కల్యాణ్‌లు అని వీరి కలయికతో రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలకు మేలు జరగబోతోందన్నారు. కనకారావు, పెప్సీ, ఉదయశ్రీ పాల్గొన్నారు.


రోడ్‌షో ద్వారా ప్రచారం చేస్తున్న బొండా ఉమా

మధురానగర్: బీజేపీ-జనసేన బలపరచిన పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్, అసెంబ్లీ అభ్యర్థి బొండా ఉమాకు సైకిల్ గుర్తు మీదే ఓటేసి గెలిపించాలని కోరుతూ శనివారం 29వ డివిజన్ మధురానగర్ పప్పుల మిల్లు ఏరియా, నేతాజీ కాలనీలో బొండా రవితేజ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. డివిజన్ ఇన్‌చార్జి నెక్కంటి ప్రసాద్, అధ్యక్షుడు పీవీఆర్, కార్యదర్శి సూరి , కోశాధికారి రామినాయుడు, బీసీ నాయకులు అంగిరేకుల రాంబాబు, మహిళా నాయకురాలు రాజి, జనసేన డివిజన్ అధ్యక్షుడు కెంబూరి కృష్ణ, భవానీ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి

సాధారణ ఎన్నికల జిల్లా పరిశీలకురాలు మంజురాజపాల్


ప్రతిజ్ఞ చేయిస్తున్న సాధారణ ఎన్నికల జిల్లా పరిశీలకురాలు మంజురాజ పాల్

వన్‌టౌన్, మే 4: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సాధారణ ఎన్నికల జిల్లా పరిశీలకురాలు మంజురాజపాల్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్‌ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ఓటర్ల అవగాహన సదస్సును శనివారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మంజురాజపాల్ మాట్లాడుతూ కొత్తగా ఓటర్లుగా చేరిన విద్యార్థులు ఓటు వేయడాన్ని బాధ్యతగా గుర్తించాలన్నారు. ఎన్నికల రోజును పండుగగా జరుపుకోవాలన్నారు. విద్యార్థులు తమతో పాటుగా చుట్టు ఉన్న సమాజాన్ని సైతం ఓటు విషయంలో జాగృతం చేయాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించగా పశ్చిమ రిటర్నింగ్ ఆఫీసర్ కిరణమ్మయి, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ సోమశేఖరరెడ్డి, స్వీప్ నోడల్ ఆఫీసర్ యు.శ్రీనివాసరావు, జిల్లా అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ చంద్రబోసు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమానికి కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు ఎన్. సాంబశివరావు, డి.పవన్‌కుమార్, కల్మబేగం, శాంతిబాబు పాల్గొన్నారు.



'గుర్తు'ండిపోయేలా ప్రచారం

భవానీపురం, మే 4 : ఎన్నికల ప్రచారం ఘట్టం చివరి దశకు చేరుకోవడంతో ఓటర్లలో గుర్తులపై మరింత అవగాహనకు పశ్చిమ అభ్యర్థుల గుర్తులను ఓటర్లకు వివరించడంపై జనసైనికులు కీలక పాత్ర పోషిస్తున్నారు. జనసేన డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు స్వచ్ఛందంగా టీడీపీ, బీజేపీలతో కలిసి కలియతిరుగుతున్నారు. 44వ డివిజన్ జనసేన పార్టీ యువ నాయకుడు నామన కార్తీక్ సిమెంట్ రోడ్డు కొండప్రాంతంలో కూటమి ఎమ్మెల్యేగా సుజనా చౌదరిని, ఎంపీగా టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని కమలం, సైకిల్ గుర్తులను చేతపట్టుకుని ఓటర్లకు వివరిస్తూ ఇంటింటా ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాలపై కరపత్రాలను కూడా ఆయన పంచారు.

కార్మికుల పక్షాన నిలిచే కమ్యూనిస్టులను గెలిపించండి

● పశ్చిమ సీపీఐ అభ్యర్థి కోటేశ్వరరావు

భవానీపురం, మే 4 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్న సందర్భంలో కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులను చట్టసభలకు పంపేలా ఈ ఎన్నికల్లో గెలిపించాలని పశ్చిమ సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి జి.కోటేశ్వరరావు అన్నారు. భవానీపురం ఐరన్‌యార్డులో ముఠా కార్మికులతో శనివారం నిర్వహించిన సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ పశ్చిమ నుంచి పోటీ చేస్తున్న తనకు కంకి కొడవలి గుర్తుపై ఓటేసి గెలిపించాలన్నారు. సీఐటీయూ నాయకులు సీతారాములు, ఏఐటీయూసీ నాయకులు మూలి సాంబశివరావు, కార్మిక సంఘాల నాయకులు శ్రీనివాసరెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, బత్తు తిరుపతయ్య, కన్నె వెంకటేశ్వర్లు, కృష్ణ, కొండ పాల్గొన్నారు.

ప్రకటన

యీ దిగువ షెడ్యూలు ఆస్తి అనగా విజయవాడ, గురునానక్ నగర్ ఏరియా, పటమట రీ సర్వే నెం.143/4, 143/4ఎ లోని చ.గ.129-76 నివేశన స్థలము అందలి గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు కట్టడము గల ఆస్తి యందూరు బాలకృష్ణారావు గారి భార్య ఆదిలక్ష్మి గారి ఆస్తిని, నా క్లయింటునూ్న విజయవాడ వాస్తవ్యులయిన ఎస్.డి.ఎస్. లక్ష్మి గారు క్రయం పొందుటకు ఒప్పందము కుదుర్చుకుని విక్రయ అడ్వాన్సు చెల్లించియున్నారు. సదరు ఆస్తిపై చెల్లదగిన బాకీలు గానీ, ఏ విధమైన లిటిగేషన్లు గాని, ఏ విధమైన క్లయిములు గానీ, అభ్యంతరములు గానీ యున్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి వారం రోజుల లోపుగా యీ దిగువ తెలిపిన నా క్లయింటు చిరునామాకు లిఖిత రూపముగా రిజిస్టర్ పోస్టు విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ ద్వారా తెలియ జేయవలసినది. దరిమిలా నా క్లయింటు పై తెలిపిన వారికి బ్యాలెన్సు క్రయ ప్రతిఫలము చెల్లించి వారి నుండి సక్రమమైన రిజిస్టరు విక్రయ దస్తావేజు పొందగలరనియు దరిమిలా వచ్చు ఎట్టి క్లయిములు గానీ, అభ్యంతరములు గానీ, నా క్లయింటును ఎంత మాత్రము బైండు చేయ జాలవనియూ అందరికీ ఇందుమూలముగా తెలియచేయటమైనది.

షెడ్యూలు: లోగడ కృష్ణా జిల్లా, ప్రస్తుతము ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ, గురునానక్ నగర్ ఏరియా, పటమట తాలూకు రీ సర్వే నెం.143/4, 143/4ఎ, డోర్ నెం.59ఎ-8/7-12/1, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ లోని ఆస్తికి **హద్దులు: తూర్పు:** మారుతి కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ వారి ఆస్తి హద్దు, అ.21-2లు, **దక్షిణం:** యితరుల ఆస్తి, అనగా మహ్మద్ ఫరియాజ్ అహ్మద్ గారు ఇతరులకు విక్రయించిన ఆస్తి, అ.55-0లు, **పడమర:** అ.40-0లు వెడల్పు గల రోడ్డు, అ.21-2లు, **ఉత్తరం:** వర్మా సచ్‌దేవ్ గారి స్థలము హద్దు అ.55-0లు. యీ నాలుగు హద్దుల మధ్య చ.గ.129-76 స్థిరాస్తి స్థలము అందలి గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్లు గల ఆర్‌సిసి బిల్డింగ్, సదరు బిల్డింగ్‌కు అమర్చియున్న యావత్తు కట్టడములు, కరెంట్ సర్వీస్ సెక్యూరిటీ డిపాజిట్ సహాయున్నా, మున్సిపల్ పంపు మరియు మోటారు, నాలుగు వైపుల కాంపౌండు వాల్స్ సహాయున్నా మరియు యావత్తు యీజ్‌మెంట్ హక్కులతో సహా.

నా క్లయింటు అడ్రసు:	ఇట్లు
ఎస్.డి.ఎస్. లక్ష్మి	ఎం.డి.ఎస్. నాగేశ్వర గుప్త
డోర్ నెం.9-64-2,	అడ్వకేట్
సయ్యద్ గులాబ్ వీధి,	ఎం.ఎస్. వీధి, హనుమాన్‌పేట
కొత్తపేట, విజయవాడ	విజయవాడ

కూటమికే..

వైసీపీ శ్రేణుల గుండెల్లో రైళ్లు!

అంతరాత్మ సాక్షిగా ఓటింగ్‌లో పాల్గొన్న ఉద్యోగులు

ఉద్యోగుల మొగ్గు

- ఎన్టీఆర్ జిల్లాలో 4శాతం ఓట్లను ప్రభావితం చేయనున్న ఉద్యోగులు
- కూటమివైపే ఉద్యోగుల మొగ్గు.. ఎండలో మండుతూనే ఓర్పుతో ఓటేశారు
- రెండేళ్ల కిందటే ఉద్యోగుల అంతిమ నిర్ణయం, సమయం రావటంతో చూపించారు
- ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్ల కుటుంబ సభ్యులతో పెరగనున్న శాతం





ఆంధ్రజ్యోతి, విజయవాడ: పోస్టల్ బ్యాలెట్ తొలిరోజునే ఉద్యోగులు కదం తొక్కడాన్ని గమనిస్తే వారు పూర్తిగా ఎటువైపు మొగ్గు చూపారన్నది నిగ్గు తేలుతోంది! టీడీపీ కూటమికే ఉద్యోగులు బలంగా మొగ్గు చూపినట్టు కనిపిస్తోంది. ఉద్యోగులు తమ అంతరాత్మ సాక్షిగా నిర్ణయాత్మక తీర్పును వెలువరించబోతున్నారన్నది స్పష్టమౌతోంది. తమను రోడ్డున పడేసిన వైసీపీ ప్రభుత్వంపై ఉద్యోగులు రెండేళ్ల కిందటే మనసు విరిగిపోయి ఒక నిర్ణయం తీసుకున్నారు. ఓటుతో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని ఉద్యోగులు ఎన్నో సందర్భాల్లో చెబుతూ వచ్చారు. పోస్టల్ బ్యాలెట్ ప్రారంభం రోజునే ఉద్యోగులు కదం తొక్కటం కూటమికి లాభించబోతోందన్నది అర్థమౌతోంది. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 3 రోజుల పాటు దాదాపుగా 20వేల మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. 90శాతానికి పైగా టీడీపీ కూటమికే ఓట్లు వేసినట్టు అర్థమౌతోంది. ఈ లెక్కన చూస్తే ఉద్యోగుల్లో వైసీపీ ప్రభుత్వం పట్ల ఉన్న తీవ్ర వ్యతిరేకత అర్థమౌతోంది. ఉద్యోగులే కదా అని అనుకోవటానికి వీల్లేదు. ఎందుకంటే వారి కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఇదే వైఖరితో ఉండే అవకాశాలే ఎక్కువ. జిల్లావ్యాప్తంగా 17లక్షల మంది ఓటర్లున్నారు. వీరిలో 20వేల మంది ఉద్యోగులంటే 1.17 శాతం ఓటర్లే అనుకోవచ్చు. వారి కుటుంబ సభ్యులను కనీసం ఇద్దరిని కలుపుకుంటే 4శాతానికి పెరుగుతుంది. ఒక్క పోస్టల్ బ్యాలెట్ ద్వారానే 3శాతం ఓట్లను ఉద్యోగులు ప్రభావితం చేయగలుగుతున్నారంటే నేరుగా ప్రత్యక్ష ఎన్నికల్లో వినియోగించుకునే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పదవీ విరమణ చెందిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులుంటారు. వీరే కాకుండా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సీపీఎస్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు వారి కుటుంబ సభ్యులు కూడా ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా భారీగా ఉంటారు. కుటుంబ సభ్యులే కాకుండానే వీరంతా 15వేల మంది వరకు ఉంటారు. కుటుంబ సభ్యులతో కలిపి 45వేల మంది అవుతారు. వీరంతా కలిపితే మరో 2.64 శాతం మంది ఉంటారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల 3శాతం, నాన్ పోస్టల్ బ్యాలెట్ అంటే ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే ఉద్యోగులు, కార్మికులు వారి కుటుంబ సభ్యులు కలిపి 2.64 శాతం మొత్తంగా 5.64 శాతం మేర ఉద్యోగులు ప్రభావితం చూపబోతున్నారన్నది స్పష్టంగా అర్థమౌతోంది. పోనీ మరో 1.64 శాతం కూడా తీసివేద్దాం. ఇలా చూసినా 4 శాతం మేర ఓట్లను ఎన్టీఆర్ జిల్లాలో ఉద్యోగులు ప్రభావితం చేస్తున్నారంటే మామూలు విషయం కాదు. ప్రధాన పార్టీల మధ్య ఓట్ల శాతం పెద్దగా తేడా ఏమీ లేదు. దీన్ని బట్టి చూస్తే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు 4 శాతం ఓట్లను ఆయా పార్టీలపై గణనీయమైన ప్రభావాన్ని చూపగలుగుతాయన్నది స్పష్టంగా అర్థమౌతోంది. శనివారం జిల్లా వ్యాప్తంగా జరిగిన ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలకు కదంతొక్కిన ఉద్యోగులను చూసి వైసీపీ శ్రేణుల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తున్నాయి.



> మైలవరం నియోజకవర్గ తాగు, సాగునీటి సమస్యల పరిష్కారమే తన ప్రథమ ప్రాధాన్యమని మైలవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇబ్రహీంపట్నం మండల తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తామన్నారు. 5 నెలల్లో చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రచారంలో బిజీ బిజీగా ఉన్న వసంత కృష్ణ ప్రసాద్‌తో 'ఆంధ్రజ్యోతి' ముఖాముఖి.
>
> - విజయవాడ - ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సాగు, తాగునీటికే

తొలి ప్రాధాన్యం!

- ఇబ్రహీంపట్నం తాగునీటి సమస్య పరిష్కరిస్తా
- 5 నెలల్లో అందుబాటులోకి చింతలపూడి
- బూడిద కాలుష్యం నుంచి విముక్తి
- ఎలాగైనా నన్ను ఓడించాలన్నదే జగన్ లక్ష్యం
- రూ.కోట్లు గుమ్మరించేందుకు సిద్ధమవుతున్నారు
- అయినా ప్రజలు నన్ను గెలిపించటం ఖాయం

మైలవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్

ప్రచారం ఎలా జరుగుతోంది..

ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జగన్‌కు అభివృద్ధి అంటేనే గిట్టదు. పరిశ్రమలు లేవు. యువతకు ఉపాధి లేదు. 90 శాతం పూర్తయిన తాగు, సాగునీటి ప్రాజెక్టులనూ పూర్తిచేయలేని దుస్థితి. చింతలపూడి ఎత్తిపోతల మైలవరం నియోజకవర్గ ప్రజలకు ఒక వరం. 90శాతం పూర్తయిన దాన్ని పూర్తిచేసి ఉంటే ఈ ప్రాంత ప్రజలకు జగన్ దేవుడయ్యేవాడు. గుంతల రోడ్లు, సాగునీటి సమస్య ఇక్కడి ప్రజల్లో తీవ్ర ప్రభావం చూపింది. ప్రపంచంలో ఎక్కడా విజయవంతం కాని మూడు రాజధానుల అంశంతో కక్షసాధింపునకే జగన్ పరిమితమయ్యాడు. అభివృద్ధి అనే పదానికే అర్థం తెలియని వ్యక్తి కాబట్టి దూరదృష్టితో ఆలోచన చేయడం చేతకాలేదు. ఈ విషయాలన్నీ నేను చెబుతున్నవి కాదు. ప్రచారంలో ప్రజలే నాకు చెబుతున్న అంశాలు. ప్రతి ఎన్నికల్లోనూ మా కుటుంబమంతా ప్రచారం చేయడం ఆనవాయితీ. గత ఎన్నికలకు ముందు కూడా ప్రచారంలో అందరం పాల్గొన్నాం. ఈసారీ అదే వినమ్రతతో ఓటర్లను కలిసి ఓట్లను అభ్యర్థిస్తున్నాం. జనాల నుంచి సానుకూల స్పందన వస్తోంది.

ప్రత్యర్థి బలాలు.. బలహీనతలు

'నన్ను కాదని వెళ్లాడు కాబట్టి ఏమైనా చేసి వసంతను ఓడించాలి' అనే పట్టుదలతో జగన్ రెడ్డి ఉన్నారు. పేదలకు, పెత్తందారులకు నడుమ పోటీ జరుగుతుందని చెబుతున్నారు. నేను పెత్తందారు అయితే 2019లో నాకు టికెట్ ఎందుకు ఇచ్చారు. వైసీపీ అభ్యర్థి పేదవాడు అయితే జగన్ రెడ్డి కోట్లాది రూపాయలు నియోజకవర్గానికి పంపి తన సొంత సామాజికవర్గానికి చెందిన వారిని సమన్వయకర్తలుగా పెట్టి డబ్బులు పంపిణీ చేస్తున్నారు. రాయలసీమ నుంచి 70-80 మందిని దింపారు. ఇవన్నీ పేదవాళ్లు చేసే పనులా.. పెత్తందారులు చేసే పనులా..? జగన్ రెడ్డి ఎన్ని కోట్లు గుమ్మరించినా.. ఎంతమందిని దింపినా.. మైలవరం నియోజకవర్గ ప్రజలు నన్ను గెలిపించడం ఖాయం.

నేతల నడుమ సమన్వయం ఎలా ఉంది..?

నేను వైసీపీ నుంచి టీడీపీలోకి రావడం వల్ల తొలుత కాస్త ఇబ్బందులున్న మాట వాస్తవమే. కానీ నాతోపాటు వైసీపీ నుంచి వచ్చిన వారిని, టీడీపీ క్యాడర్‌ను కూర్చోబెట్టి సమావేశాలు నిర్వహించాం. దీంతో అందరూ కలిసి ముందుకు వెళుతున్నాం. నేతలందరూ మనస్ఫూర్తిగా కలిసి పనిచేస్తున్నారు. అంతిమంగా టీడీపీని గెలిపించాలన్న కసి క్యాడర్‌లో కనిపిస్తోంది.

ప్రజలకు మీరిచ్చే ప్రధాన హామీలు

నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నియోజకవర్గ ప్రజలకు హామీ ఇస్తున్నా. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇబ్రహీంపట్నం మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తా. 5 నెలల్లో చింతలపూడి ఎత్తిపోతల పూర్తి చేస్తాం. టీడీపీ హయాంలో సాగర్ ఆయకట్టు రైతుల ఇబ్బందులు గుర్తించి చింతలపూడి ద్వారా నికర జలాలు అందించేందుకు రూ.4100 కోట్లు ఖర్చు చేశారు. 90 శాతం పనులు పూర్తి చేశారు. ఈ ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేయలేకపోయింది. మైలవరం రాజధాని ప్రాంతానికి దగ్గరగా ఉంది. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తా. చివరిగా కొండపల్లి మున్సిపాలిటీ ప్రజలకు బూడిద కాలుష్యం నుంచి విముక్తి కల్పిస్తా. ఓ వైసీపీ ప్రజాప్రతినిధి బూడిదను దోచుకుంటూ నిన్నటి వరకు నెపాన్ని నాపై నెట్టారు. కానీ ఇప్పటికీ బూడిద దందా కొనసాగుతూనే ఉంది. దీనికెవరు బాధ్యులు? టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బూడిద దందాపై కఠినచర్యలు తీసుకుంటాం.

మాటతప్పిన సామినేని..!

- ఐదేళ్లు గడిచినా ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని ఉదయభాను
- టిడ్కో ఇళ్లు ఉచితంగా ఇప్పిస్తానని నాడు లబ్ధిదారులకు లేఖలు
- నాడు వాయిదాలతో గడిపేసి నేడు కొత్తగా మళ్లీ హామీలు


టిడ్కో ఇళ్లకు వైసీపీ ప్రభుత్వం వేసిన నీలి రంగులు

జగ్గయ్యపేట, మే 5: గత ఎన్నికల్లో టిడ్కో ఇళ్లను రూపాయికే ఇస్తానని జగ్గయ్యపేట వైకాపా అభ్యర్థి సామినేని ఉదయభాను లబ్ధిదారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయారు. 2019 ఎన్నికల ప్రచారంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తమ ప్రభుత్వం రాగానే రూపాయికే ఇంటిని స్వాధీనం చేయిస్తానని హామీ ఇచ్చి, ఒక లేఖను కూడా ఇచ్చారు. ఐదేళ్ల పదవీకాలాన్ని వాయిదాలతో గడిపేశారు. పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో 3,324 ఇళ్లను టీడీపీ హయాంలో ఎన్టీఆర్ నగర్ పేరుతో నిర్మాణం చేపట్టారు. 77బ్లాకుల్లో ఇళ్లను నిర్మించారు. దీన్ని మరో పేటలా తీర్చిదిద్దేందుకు నాటి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, టీడీపీ నేతలు నెట్టెం రఘురాం, తొండపు దశరథ జనార్ధన్ ఎంతో శ్రమించారు. 80శాతం ఇళ్లు పూర్తికాగా, లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈలోపు ఎన్నికల కోడ్ రావటంతో, పనులు పూర్తికాక ఇళ్లను లబ్ధిదారులకు అందచేయలేదు. అప్పటి వైకాపా అభ్యర్థి సామినేని ఉదయభాను తాము అధికారంలోకి వస్తే ఇళ్లను ఉచితంగా ఇస్తామని నమ్మబలికారు. తీరా అధికారంలోకి వచ్చాక నాలుగేళ్లు పట్టించుకోలేదు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండగా హడావుడి మొదలుపెట్టారు. డిపాజిట్లు చెల్లించిన లబ్ధిదారులు కొంతమంది వెనక్కి తీసుకున్నారు. గతంలో టీడీపీ 72 బ్లాకులకు శ్రీకారం చుడితే వైసీపీ ప్రభుత్వం 65 బ్లాకులకు తగ్గించేశారు. లబ్ధిదారులను 3120కి కుదించారు. లబ్ధిదారుల పేరున బ్యాంకుల్లో రుణాలు తీసుకుని కొన్ని బ్లాకులకు వైసీపీ రంగులేసి ముస్తాబు చేశారు. మంచినీరు, రోడ్లు, డ్రైన్లు లేకుండా పూర్తిచేసినా గృహ ప్రవేశాలు చేయించలేదు. మునిసిపల్ కౌన్సిల్ సమావేశాల్లో టీడీపీ కౌన్సిలర్లు అనేకసార్లు మునిసిపల్ ఛైర్మన్ రాఘవేంద్రను నిలదీశారు. అయినా లాభం లేకపోయింది. ఇదిలా ఉంటే టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంకులు రుణాల కింద వాయిదాలు చెల్లించాలని నోటీసులివ్వటంతో కలకలం రేపింది. దీంతో అధికార పార్టీ నేతలను నిలదీయటంతో బ్యాంకర్లపై ఒత్తిడి చేశారు. ఐదేళ్లుగా అద్దెలు చెల్లిస్తూ, బ్యాంకు వడ్డీల భారం మోస్తున్న లబ్ధిదారులు ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్నారు. 20శాతం పనులు కూడా పూర్తి చేయించలేని వైకాపా నేతలు మీటింగుల్లో ప్రజల ముందు సమర్థత గురించి మాట్లాడుతున్నారని జగ్గయ్యపేట టీడీపీ కూటమి అభ్యర్థి శ్రీరాం తాతయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడ్కో లబ్ధిదారులకు నమ్మక ద్రోహం చేశారని విమర్శించారు.


ఇదీ టిడ్కో ఇళ్ల లోపలి దుస్థితి

సిగ్గు.. సిగ్గు.. గురువు గారూ.. ఇదేం పని!

- ఓటుకు నోట్లడుగుతున్న ఉపాధ్యాయులు..!
- ముక్కున వేలేసుకుంటున్న ప్రజలు

అవనిగడ్డ రూరల్: మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో కొందరు తమ ఓటు హక్కును వేలానికి పెడుతున్నారనటంలో ఎలాంటి సందేహం లేదు. మండలంలోని ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకోవటానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధికారులు పోస్టల్ బ్యాలెట్‌ను అందజేశారు. అక్కడ ఓటు వేయటానికి వచ్చిన వారిలో వివిధ పార్టీల అభిమానులు మమేకమై ఉన్నారు. కొందరు ఉపాధ్యాయులు ఓటు వేస్తాం. మాకేమిస్తారంటూ చర్చలు జరపటం అక్కడ ఉన్నవారిని ఆశ్చర్యానికి గురిచేసింది. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులు తమ ఓటుకు వెల కట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు. తమ ఓటు రూ.1000 నుంచి రూ.1500 పలుకుతుందని, మీరెంత ఇస్తారో చెబితే మీకే ఓటు వేస్తామని చెప్పటం సిగ్గుచేటని బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

నా బీసీలు.. నా ఎస్సీలంటూ రాజకీయ ప్రసంగాలే తప్ప వాస్తవంగా దళితులకు జగన్ చేస్తున్న అన్యాయం చెప్పనలవి కాదు. భూములివ్వటమే కానీ లాక్కోవటం జగనన్నకు చేతకాదని వేదికలపై గొప్ప గొప్ప ఉపన్యాసాలు చేసి ఈలలు వేయించుకోవటం తప్ప జగన్ ఐదేళ్లలో ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఇవ్వలేదు. పైగా 45 ఏళ్లుగా దళితుల సాగుచేసుకుంటున్న 9.47 ఎకరాల వ్యవసాయ భూమిని జగనన్న లే అవుట్ పేరుతో నాలుగేళ్ల క్రితం కర్కశంగా లాగేసుకున్న తీరుపై ఇప్పటికీ పోరాటం చేస్తూనే ఉన్నా వైసీపీ పాలకుల్లో జాలీదయ కనిపించటం లేదని దళితులు మండిపడుతున్నారు.

- తోట్లవల్లూరు

దళితుల భూములే లాక్కోవాలా..?

నా ఎస్సీలంటూ సీఎం జగన్ చెప్పే డైలాగులు ఉత్తుత్తివే..!

- జగనన్న లే అవుట్లకు కర్కశంగా దళితుల భూముల స్వాధీనం
- దళిత ఎమ్మెల్యే కైలే ఉన్నా దక్కని న్యాయం

తోట్లవల్లూరు బంగాళతోటలో ఆర్ఎస్‌నెం 166/6లో ముళ్లపొదలతో బీడుగా తయారైన 9.47 ఎకరాల ప్రభుత్వ భూమిని 45ఏళ్ల క్రితం 22 దళిత కుటుంబాలు బాగుచేసుకుని పంటలు పండించుకుంటూ జీవిస్తున్నాయి. ఈ భూముల్లో ఎస్సీ కార్పొరేషన్ నుంచి మోటార్లు, కరెంటు లైన్‌లు వేయించుకున్నారు. కానీ 2020లో వైసీపీ సర్కార్ కన్ను ఈ భూములపై పడింది. జగనన్న లే అవుట్ కోసం దళితుల భూములను తీసుకోవాలని ఆదేశాలివ్వటంతో రెవెన్యూ అధికారులు బలవంతపు చర్యలతో నాలుగేళ్ల క్రితం భూములను స్వాధీనం చేసుకున్నారు. సాగులో ఉన్న కంది, గోంగూర పంటలను ఎక్సకవేటర్‌తో ధ్వంసం చేసేందుకు రెవెన్యూ అధికారులు రాగా దళితులు అడ్డుగా పడుకుని అడ్డుకున్నా పోలీసు బలగాలను ఉపయోగించి నిర్దాక్షిణ్యంగా స్వాధీనం చేసుకున్నారు. సాక్షాత్తు దళిత ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఉన్నా దళితుల పక్షాన నిలవకపోవడంతో అధికారులకు భూమి స్వాధీనం తేలిగ్గా జరిగిపోయింది. అధికారులు వెంటనే సెంటున్నర చొప్పున ప్లాట్లుగా విభజించి రోడ్లు పోశారు. దాంతో దళితుల ప్రతినిధి మొవ్వా సంగీతరావు సీపీఎం నేతల సాయంతో హైకోర్టులు కేసు వేయగా హైకోర్టు స్టే ఆర్డర్ మంజూరు చేసింది. దాంతో తోట్లవల్లూరులో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ నిలిచిపోయింది. ఆ తరువాత వైసీపీ నేతలు దళితులతో రాజీకి వచ్చి పామర్రు ఎమ్మెల్యే కార్యాలయానికి తీసుకెళ్లారు. 22 మందికి రూ.5 లక్షల నగదు, రెండ్లు ఇళ్ల స్థలాల ప్లాట్లు ఇవ్వజూపటంతో హైకోర్టులో కేసు ఉపసంహరించుకుంటామని దళితులు ప్రతిపాదన చేశారు. దీనికి ఎమ్మెల్యే సాక్ష్యంగా కూడా ఉన్నారు. కానీ ప్రభుత్వ భూమికి ప్రభుత్వం పరిహారం ఇవ్వటం కుదరదని అధికారులచేత చెప్పించి మోసం చేశారు. అలా అయితే తాము కేసు ఉపసంహరించుకోబోమని దళితులు చెప్పటంతో జమ్మిడొంకలో రూ.4 కోట్లు పెట్టి పదెకరాల ప్రైవేటు భూమిని ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేశారు. ప్రైవేటు భూమిని కొన్నప్పటికీ తోట్లవల్లూరులో ఇంత వరకు ఇళ్ల స్థలాల పంపిణీ చేయలేదు. మరోవైపు బంగాళతోటలో దళితుల నుంచి తీసుకున్న 9.47 ఎకరాలు నిరుపయోగంగా తయారయ్యాయి. ఇద్దరు ముగ్గురు దళితులు భూముల్లోకి ట్రాక్టర్ తీసుకెళ్లి సాగు చేసుకునే ప్రయత్నం చేయగా అధికారులు అడ్డుకుంటున్నారు. దీన్ని బట్టి జగనన్న సర్కార్‌కు దళితులపై ఉన్న ప్రేమ ఎలాంటిదో తేటతెల్లమవుతోంది.


నిరుపయోగంగా ఉన్న బంగాళతోట భూములు


2020లో బంగాళతోట భూముల్లోకి ఎక్సకవేటర్ వెళ్ళకుండా అడ్డుగా పడుకున్న దళితులు (ఫైల్‌ఫొటో)

మా పొట్టపై కొట్టారు

మట్టా జయమ్మ



బంగాళతోట భూముల్లో చెరకు, పసుపు, కూరగాయలు తదితర పంటలు పండించుకుని 22 కుటుంబాలు బతికేవి. అలాంటి భూములను మా నుంచి జగన్ ప్రభుత్వం బలవంతంగా లాగేసుకుంది. అటు పేదలకు ఇళ్ల స్థలాలకు ఇచ్చి మాకు న్యాయం చేయాలని అడిగాం. అదీ చేయకుండా భూములను గాలికొదిలేసి వేరేచోట కొన్నారు. ఇదెక్కడి న్యాయం. మా భూములను మాకు తిరిగి అప్పగించాలి.

ఎమ్మెల్యేను కలిసినా న్యాయం జరగలేదు

మొవ్వా సంగీతరావు



ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను పామర్రు ఆఫీసులో కలిసి జరిగిన అన్యాయాన్ని తెలియజేస్తే న్యాయం చేస్తానన్నారు. కానీ మూడేళ్లుగా న్యాయం చేయలేదు. రూ.5 లక్షలు, 3 సెంట్లు ఇస్తానన్న హామీకి మేము అంగీకారం తెలిపాం. ఈ చిన్నపాటి పరిహారం ఇవ్వకుండా రూ.4కోట్లు పెట్టి ప్రైవేటు భూములు కొన్నారు. హైకోర్టులో కేసు వేసి పోరాటం చేస్తున్నాం. కోర్టులే మాకు న్యాయం చేస్తాయని నమ్ముతున్నాం.

జన కేతనం
ప్రజా అజెండా
అభివృద్ధి.. సంక్షేమం.. సమ న్యాయం..
మీ ఓటు భవిష్యత్తు
ఆంధ్రజ్యోతి
ఆదివారం ◇ 5-5-2024
కౌంట్ డౌన్ 8 రోజులు



కట్టాలంటే సంకల్పం కావాలి! ప్రణాళిక రూపొందించాలి! ఆచరణలోకి తేవాలి! పట్టుదలతో ముందుకు సాగాలి! అందులోనూ ఒక నగరాన్ని నిర్మించాలంటే... అనితర సాధ్యుడై ముందుకు సాగాలి.

కానీ... కూల్చాలంటే! ఇవేవీ అక్కర్లేదు. విధ్వంసపు ఆలోచన ఒక్కటి చాలు! అంతా నాశనమే!

ఇందులో సంకల్పం నాటి సీఎం చంద్రబాబుదైతే... విధ్వంసం 2019లో గద్దెనెక్కిన జగన్మోహన్ రెడ్డిది! కేవలం చంద్రబాబుపై కసితో 'అమరావతి' అనే ఆంధ్రుల కలను ఛిద్రం చేసిన నాయకుడు జగన్! తాను రాష్ట్రానికో ప్యాలెస్ కట్టుకుని... అమరావతిలో ప్రజాధనంతో నిర్మించిన భవనాలను పాడుపెట్టిన విధ్వంసకుడు జగన్! జగన్ అధికారంలోకి వచ్చేదాకా... అమరావతి ఒక అద్భుతం! అది కనీవినీ ఎరుగని నిర్మాణ యజ్ఞం!

ఒక్కసారి అమరావతి వైభవాన్ని గుర్తుకు తెచ్చుకుంటే..

అద్భుత ప్రణాళికతో 'అమరావతి'కి రూపకల్పన.. దేశంలోనే తొలిసారి నవ నగర సృష్టికి శ్రీకారం

రాజధాని కోసం భూసమీకరణ ఓ రికార్డు.. రహదారుల నుంచి భవనాలదాకా వినూత్న ప్రణాళిక

2019 మార్చి దాకా శరవేగంగా సాగిన పనులు.. వేలకొద్దీ కార్మికులతో నిత్యం నిర్మాణ జాతర

90 శాతం వరకు పూర్తయిన కొన్ని ప్రాజెక్టులు.. కళ్లుండీ చూడలేని గుడ్డివాళ్లలా వైసీపీ నేతలు

అమరావతిపై విషం చిమ్మి, విధ్వంసం సృష్టించిన జగన్

పైసా ఖర్చు కాకుండా ప్రణాళిక

అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు. సేకరించిన భూమిలో రైతులకు ప్లాట్లు, ప్రభుత్వ నిర్మాణాలు, రోడ్లు, పార్కులకు పోను మిగిలిన భూమి అమ్మకం ద్వారా వచ్చే సొమ్ముతోనే రాజధానిని నిర్మించే ప్రణాళిక రూపొందించారు. 8,437 ఎకరాల మిగులు భూమి ప్రస్తుతం ప్రభుత్వ స్వాధీనంలో ఉంది. ఎన్నికల ముందు ఇక్కడ మార్కెట్ విలువ గజం రూ.36 వేలకు పెరిగింది. ఆ లెక్కన 8,437 ఎకరాల విలువ రూ.1.48 లక్షల కోట్లు. ఈ డబ్బుతోనే రాజధానిని నిర్మించవచ్చు. సైబరాబాద్ తరహాలో భూముల విలువ పెరుగుతుందని అంచనా. మొత్తం రూ.4.26 లక్షల కోట్లకు పెరిగే అవకాశం ఉంది. ఆ భూమిని దశలవారీగా అమ్ముతూ రాజధాని నిర్మాణానికి చేసిన అప్పులను వడ్డీతో సహా చెల్లించవచ్చు. మిగిలిన డబ్బును 13 ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి వినియోగించుకోవచ్చు.

నాడు రాత్రీ పగలు తేడా లేకుండా ఓ యజ్ఞంలా సాగిన రాజధాని నిర్మాణం.. నేడు అదే ప్రాంతాన్ని ఇలా పాడుబెట్టారు.





అమరావతి

నాడు నేడు

చంద్రబాబు జగన్

నిర్మాణం X నిర్వాకం!

నిర్మాణ యజ్ఞాన్ని బూడిదపాలు చేసిన జగన్

ఆకాశాన్నంటేలా వరుసలో నిల్చున్న భారీ క్రేన్లు! అల్లంత దూరం నుంచే కాంక్రీటు పోసే ఆధునిక యంత్రాలు! విసుగూ విరామం లేకుండా నిరంతరం దుమ్మురేపుతూ మెటీరియల్‌ను చేరవేస్తున్న టిప్పర్లు! ఒకేసారి, ఒకే చోట కొన్ని వేల మంది నిర్మాణ కార్మికులు! 'అమరావతి'లో అప్పుడు సాగింది ఒక మహా నిర్మాణ యజ్ఞం! నవ్యాంధ్రుల రాజధాని కళ్లముందు ఆవిష్కృతమవుతున్న అద్భుతం! అవి ఉత్తుత్తి డిజైన్లు కావు! గ్రాఫిక్ మాయలు కావు! కళ్లముందు పోతపోసినట్లు నిలిచి ఉన్న భారీ నిర్మాణాలు! 2019 మార్చి-ఏప్రిల్ నాటికి రాజధాని ప్రాంతంలో కనిపించిన దృశ్యాలు ఇవి!

ఇప్పుడు అక్కడ పరిస్థితి ఏమిటంటే... ముళ్ల కంపల మధ్య అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలు. నాలుగున్నరేళ్లుగా నీళ్లలో నానుతున్న జీఏడీ టవర్ల పునాదులు. తుప్పు పట్టిపోతున్న ఐరన్. సగంలో వదిలేసిన పైపు లైన్లు. ధ్వంసమైన రోడ్లు!

ఒక అద్భుతానికి శ్రీకారం...

రాజధానిలేని రాష్ట్రంగా నవ్యాంధ్ర! రాష్ట్రంలో నవోత్తేజం నింపే ఒక వినూత్నమైన కార్యం చేపట్టాలి! ప్రపంచమే మనవైపు చూడాలి! కేవలం రాజధాని నగరంగా మాత్రమే కాదు... అది రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టాలి. దేవతల రాజధానిని దివి నుంచి భువికి దించాలి! ఈ ఆలోచన నుంచి పుట్టిందే 'అమరావతి'! ఏదైనా కొత్తగా, భారీగా, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆలోచించే చంద్రబాబు నవ్యాంధ్ర తొలి సీఎంగా 'అమరావతి'కి ప్రాణప్రతిష్ఠ చేశారు. భూసమీకరణ నుంచి నిర్మాణం వరకు... ఈ నగర ప్రణాళిక ఒక అద్భుతం!

ల్యాండ్ పూలింగ్ రికార్డు

చంద్రబాబు ప్రభుత్వం రాజధాని కోసం పైసా ఖర్చు లేకుండా 58 రోజుల్లో 33 వేల ఎకరాల భూములను రైతుల నుంచి సమీకరించి రికార్డు సృష్టించింది. 2015 జనవరి 1న భూసమీకరణ పథకానికి సీఆర్‌డీఏ రూపకల్పన చేసింది. 28,538 మంది రైతుల నుంచి 34,395.50 ఎకరాలను సమీకరించింది. అమరావతి ల్యాండ్ పూలింగ్‌ను లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ కేస్ స్టడీగా తీసుకోవడం విశేషం.



నాడు అద్దంలా రోడ్లేస్తే.. నేడు అడ్డగోలుగా తవ్వుకుపోయారు

ఇటుక లేకుండానే...

ఇటుక మీద ఇటుక పెట్టి, గోడలు కట్టి, స్లాబులు వేసి, క్యూరింగ్ చేసి... ఇది సంప్రదాయ పద్ధతి! కానీ నిర్మాణ రంగంలో అప్పుడప్పుడే ప్రాచుర్యంలోకి వచ్చిన 'ప్రీకాస్ట్' టెక్నాలజీని అమరావతికి పరిచయం చేశారు. పిల్లర్ల నుంచి స్లాబు వరకు మరోచోట సిద్ధం చేసి... వాటిని తరలించి, అతికించి భవనాన్ని సిద్ధం చేసేస్తారు! సీఆర్డీయే ప్రధాన కార్యాలయాన్ని పూర్తిగా ఈ ప్రీకాస్ట్ విధానంలో చేపట్టారు. పిల్లర్లు, మెట్లు, గోడలు, శ్లాబ్, చివరికి బాత్‌రూమ్ గోడలను కూడా ప్రీకాస్ట్‌లోనే అమర్చేలా డిజైన్ చేశారు. ఏడంతస్తుల ఈ భవంతిలో సీఆర్డీయేతోపాటు అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ), ఏపీరెరా తదితర కార్యాలయాలు కొలువుతీరేలా చేపట్టారు. 60 శాతానికిపైగా పూర్తయిన ఈ నిర్మాణం జగన్ కారణంగా ఆగిపోయింది.

ఇదీ పరిపాలనా నగరి..

ఒక కిలోమీటరు వెడల్పు... 6.6 కిలోమీటర్ల పొడవు! ఇది అమరావతిలోని పాలనా నగరి భౌగోళిక విస్తీర్ణం! ఒకవైపు కృష్ణా నదిని ఆనుకుని ముఖ్యమంత్రి నివాసం, రాజ్‌భవన్‌తో ఈ 'నగరం' మొదలవుతుంది. ఆ తర్వాత వరుసగా... మంత్రులు, ఎమ్మెల్యేలు, న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది గృహ సముదాయాలు, జడ్జీల బంగళాలు... హైకోర్టు, జ్యుడీషియల్ కాంప్లెక్స్ సచివాలయ టవర్లు నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. మొత్తం అమరావతికి 'పరిపాలనా నగరి' హృదయంలాంటిది. ఇది కేవలం పరిపాలనా, అధికారుల నివాస ప్రాంతంగా మాత్రమే కాకుండా... ప్రజలు, సందర్శకులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచేలా డిజైన్ చేశారు. పరిపాలనా నగరిలో ఎక్కడా గజిబిజితనం కనిపించదు. వీధి దీపాల స్తంభాలు మినహా తీగలు కూడా బయటికి కనిపించవు. ఈ ప్రాంతంలో ఉన్న హైటెన్షన్ టవర్లను మరో చోటికి (రీలొకేట్) తరలించారు. 6.6 కిలోమీటర్ల పొడవునా కొత్త లైన్‌వేసి ఎల్ఈడీ విద్యుత్ దీపాలను అమర్చారు.



నాడు



నేడు

నాడు శరవేగంగా పూర్తయిన ఎన్జీవోల క్వార్టర్స్‌కు వెళ్లే దారి సైతం నేడు తుప్పలతో నిండిపోయిన దృశ్యం

గృహ శోభ...

నగరం అంటేనే ట్రాఫిక్ జంఝాటం! ఉరుకులు, పరుగుల జీవితం! కానీ... అమరావతి పరిధిలోని ఉద్యోగులకు ఇలాంటి కష్టాలేవీ లేకుండా ప్రణాళిక రూపొందించారు. ప్రభుత్వ పాలనా నగరి పరిధిలోనే గెజిటెడ్ అధికారులకు, ఎన్జీవోలకు, నాలుగో తరగతి ఉద్యోగులకు క్వార్టర్స్ నిర్మాణం మొదలుపెట్టారు. ఇంటి నుంచి కార్యాలయానికి పది నిమిషాల్లోపు చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఉద్యోగులతోపాటు అఖిల భారత సర్వీసు అధికారులు, వివిధ స్థాయి ఉద్యోగులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల కోసం 61 టవర్లలో ఏకంగా 3840 ఫ్లాట్ల నిర్మాణం చేపట్టారు. అన్నిచోట్లా షీయర్ వాల్ టెక్నాలజీని వినియోగించారు. 2019 జనవరి నాటికే 1200కు పైగా ఫ్లాట్ల నిర్మాణం పూర్తయింది. ఇవి కాకుండా... కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శుల కోసం 186 బంగ్లాల నిర్మాణం చేపట్టారు. ఈ మొత్తం వైభవాన్ని జగన్ ధ్వంసం చేశారు.

సమున్నతంగా సచివాలయ టవర్స్..

మొత్తం రాజధాని పరిధిలో సమున్నతంగా నిలిచే భవనాలు... సచివాలయ టవర్లు! మొత్తం ఐదు ఆకాశ హర్మ్యాల పనులను రూ.3,500 కోట్ల వ్యయంతో చేపట్టారు. 2019 జనవరి నాటికే వీటన్నింటి ర్యాఫ్ట్ ఫౌండేషన్ దాదాపు ముగిసింది. దేశంలోనే మొదటిసారిగా... సచివాలయంతోపాటు ఆయా శాఖల ప్రధాన కార్యాలయాలు కూడా ఒకేచోట కొలువుతీరేలా వీటిని రూపొందించారు. ముఖ్యమంత్రి, సీఎస్ ఉండే జీఏడీ టవర్‌ను 50 అంతస్థులతో... ఇతర టవర్లను 40 అంతస్థులతో ప్లాన్ చేశారు. జగన్ విధ్వంస ఆలోచన కారణంగా... ఈ ర్యాఫ్ట్ ఫౌండేషన్లు నీళ్లలో నానుతున్నాయి.

-విజయవాడ/గుంటూరు/మంగళగిరి, ఆంధ్రజ్యోతి

పేదలకూ చక్కటి గూడు

అమరావతి ప్రజా రాజధాని! ఇక్కడ అన్ని వర్గాల వారికీ చోటు కల్పించారు. రాజధాని పరిధిలో భూమిలేని పేదల కోసం ప్రత్యేకంగా పీఎంఏవై-ఎన్టీఆర్ గృహ సముదాయాలను నిర్మించారు. చక్కటి ప్లానింగ్, ప్రమాణాలతో 'ఎంత బాగున్నాయో' అనిపించేలా... పది గ్రామాల్లో ఐదు వేల గృహాల నిర్మాణం దాదాపుగా పూర్తయింది. చాలాచోట్ల ఇక లబ్ధిదారులకు వాటిని కేటాయించడమే మిగిలింది. వీటన్నింటినీ జగన్ పాడుపెట్టారు. పేదలపైనా పగబట్టారు.

తవ్వకాల తంటా ఉండదు

విద్యుత్తు, నీరు, వంటగ్యాస్, సమాచార వ్యవస్థ ఇలా అన్ని అవసరాలకోసం ప్రత్యేకంగా భూగర్భంలోనే 'డక్ట్'ల నిర్మాణం చేశారు. దీనివల్ల... మళ్లీ మళ్లీ రోడ్లు తవ్వాల్సిన అవసరమే ఉండదు. సీడ్ యాక్సెస్ రోడ్ పొడవునా ఏకంగా ఆరు అడుగుల వెడల్పు, ఆరు అడుగుల ఎత్తుతో డక్ట్‌ల నిర్మాణం చేపట్టారు. అమరావతిలోని అన్ని రహదారుల వెంటా ఇలాంటి డక్ట్‌లు ఉంటాయి. వర్షపు నీటి ప్రవాహానికీ ముందుగానే కాలువలు తవ్వేలా ప్రణాళిక రూపొందించారు. ఇక... మొత్తం రాజధాని తాగునీటి అవసరాలకోసం భూగర్భంలో భారీ పైప్‌లైన్ల నిర్మాణాన్ని చేపట్టారు. జగన్ వచ్చేశాక ఈ డక్ట్‌లన్నీ గోతులుగా మారాయి. పైపులను దొంగలు ఎత్తుకెళుతున్నా దిక్కులేదు.

'స్పీడ్' యాక్సెస్...

రాజధానిలో రవాణాకు అతి కీలకమైనది, ప్రత్యేకమైనది సీడ్ యాక్సెస్ రోడ్! విజయవాడ-గుంటూరు దారిలో కనకదుర్గ వారధి నుంచి దొండపాడు వరకు... 21.2 కిలోమీటర్ల దారి 2019 జనవరి నాటికే పూర్తయింది. జగన్ పార్టీ కుయుక్తులు, కుట్రల కారణంగా... భూసమీకరణ సమస్య ఏర్పడి 3 కిలోమీటర్ల దారి మాత్రం పూర్తి కాలేదు. ఈ రోడ్డు వెడల్పు 200 అడుగులు! అలాగే... రాజధాని నగరంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా సులువుగా, వేగంగా చేరుకునేలా మొత్తం 320 కి.మీ. ప్రాధాన్య రహదారుల నిర్మాణం చేపట్టారు.



నాడు



నేడు

నాడు సర్వ హంగులతో సిద్ధమైన ఐఏఎస్ క్వార్టర్ల నేటి దుస్థితి ఇది



నాడు



నేడు

నాడు వేల కార్మికులతో శ్రమైక జీవన కళ.. పక్కన పడేసిన హెల్మెట్ల పోగే నేటి శిథిల వాస్తవం

కొలువు దీరిన కార్మిక శక్తి...

అమరావతి నిర్మాణంలో 20కిపైగా కాంట్రాక్టు సంస్థలు ఏకకాలంలో భాగస్వాములయ్యాయి. అప్పట్లో.. నిత్యం 15 వేల నుంచి 20 వేల మంది కార్మికులు పనిచేసేవారు. వీరందరి కోసం నిర్మాణ స్థలాల్లోనే నివాసాలు ఏర్పాటు చేశారు. అక్కడంతా ఒక జాతరలా ఉండేది. జగన్ రాగానే ఇదంతా ఒక్కసారిగా మాయమైపోయింది.

నిర్మాణం పూర్తైతే.. రేపటి సంచికలో

అబ్బ ఛా!


గుడివాడ అమర్‌నాథ్, మంత్రి

స్టీల్ ప్లాంటు కోసం పదవిని వదిలేస్తా!

విశాఖపట్నం స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరించబోమని అనకాపల్లి పర్యటనలో ప్రధాని నరేంద్రమోదీ ప్రకటిస్తే 'ఈ పదవిని' త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నా. అవసరమైతే గాజువాక సీటు కూడా వదిలేస్తా. నా తాత ఎమ్మెల్యే, నా తండ్రి మంత్రిగా చేశారు. నేను కూడా చిన్న వయసులోనే మంత్రినయ్యా. ఇంకా నాకు బోలెడు వయస్సుంది. పదవులు లేకపోయినా ఫరవాలేదు.

వైసీపీ నేతలకు పండగ

పథకం.. పేదలకు! ఆ పేరుతో కాసుల పండగ మాత్రం అధికార వైసీపీ నేతలకు! జగనన్న ఇళ్ల కాలనీలకు భూసేకరణ పేరిట వేల కోట్లు దోచేశారు. స్థానిక నేతలు.. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై భారీ అవినీతికి పాల్పడ్డారు.

కోట్లు కుమ్మేశారు

పేదల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 25,360 ఎకరాల భూములు కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.55 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు ప్రభుత్వమే చెబుతోంది. వైసీపీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి.. వాటిని తిరిగి నాలుగైదు రెట్లు ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్మేశారు. దళితులు, గిరిజనులను కూడా బెదిరించి వారి భూములను తక్కువ ధరకు కొట్టేశారు.

లెవెలింగ్‌లోనూ కుమ్ముడు

భూములను మెరక చేసి (లెవెలింగ్) జగనన్న కాలనీలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.33 వేల కోట్లు ఖర్చు చేసింది. ఇందులోనూ సగానికిపైగా సొమ్మును అధికార పార్టీ నేతలు జేబులో వేసుకున్నారు. మట్టి తరలింపు పేరుతో వేల కోట్లు దోచుకున్నారు. ఇక ఇళ్ల నిర్మాణంలోనూ కాంట్రాక్టర్లు సొమ్ములు నొక్కేశారు.

ఊళ్లకు దూరంగా స్థలాలు..!

చాలాచోట్ల ఊరికి దూరంగా, శ్మశానాలకు దగ్గరగా, లోతట్టు ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. నివాస యోగ్యం కానీ చోట ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఆవ భూములు, బంక భూములు కూడా కొనుగోలు చేసి పేదలకు అంటగట్టారు. చిన్నపాటి వర్షాలకే జగనన్న లేఅవుట్లు చెరువులుగా మారాయి.

జగనన్న ఇళ్ల కాలనీల్లో వేల కోట్లు దోపిడీ

పేదల ఇళ్ల స్థలాల కోసం భూముల కొనుగోలు వ్యవహారంలో వైసీపీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు అడ్డగోలుగా వ్యవహరించారు. కొన్నిచోట్ల ఎమ్మెల్యేలే రంగంలోకి దిగారు. మరికొన్నిచోట్ల బంధువులు, బినామీలను ముందు పెట్టి వ్యవహారం నడిపించారు. మొదట జనావాసాలకు దూరంగా, నివాసం ఉండటానికి ఏమాత్రం సౌకర్యం లేనిచోట తక్కువ ధరకు భూములు కొనుగోలు చేశారు. ఆ తర్వాత ఆ భూములనే జగనన్న కాలనీల కోసం కొనుక్కునేలా అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వానికి భారీ ధరకు అంటకట్టారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల అధికార పార్టీ నేతలు కోట్లు వెనకేసుకున్నారు. జగనన్న కాలనీల లెవెలింగ్ పనుల్లోనూ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు.

- పేదల పేరుతో వైసీపీ పెద్దలకు పండగ
- స్థలాల కొనుగోలులో కోట్లు కొల్లగొట్టేశారు
- పనికిరాని భూములను చౌక ధరకు కొని ప్రభుత్వానికి 4-5 రెట్లకు అమ్మేశారు
- స్థలాల సేకరణకే 55 వేల కోట్లు ఖర్చు
- లే అవుట్ల లెవెలింగ్‌కు 33 వేల కోట్లు
- ఇందులోనూ కోట్లు కుమ్ముడు
- ఇళ్ల నిర్మాణంలోనూ అవినీతి



స్కీం వెనుక స్కాం

అధికారులు, నేతలు కుమ్మక్కై..

ఉమ్మడి కృష్ణా జిల్లాలో జగనన్న కాలనీలకు ఇళ్ల స్థలాల సేకరణలో అప్పటి రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతలు కలసి కోట్లాది రూపాయలు దోచుకున్నారు. జక్కులనెక్కలం గ్రామంలో గతంలో దళిత వర్గాలకు అసైన్డ్ పట్టాలుగా ఇచ్చిన 7 ఎకరాలను రూ.20 లక్షల చొప్పున బినామీ వ్యక్తుల పేరుతో కొనుగోలు చేసి.. రూ.65 లక్షల చొప్పున ప్రభుత్వానికి విక్రయించారు. రెవెన్యూ అధికారులే దళారుల అవతారం ఎత్తి బినామీ పేర్లతో వ్యవహారం నడిపించారు. వైసీపీ నేతలతో కలసి లక్షల రూపాయలు ఆర్జించారు. అలాగే బల్లిపర్రు గ్రామంలో రైతులను బెదిరించి 3 ఎకరాల అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకున్నారు. గన్నవరం విమానాశ్రయానికి కూతవేటు దూరంలోని కేసరపల్లిలో ఎందుకూ పనికిరాని ముంపు ప్రాంతానికి చెందిన భూములను ఎకరం రూ.75 లక్షల చొప్పున కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంలో భారీఎత్తున అవినీతి జరిగిందని అప్పట్లో కలెక్టర్‌కు ఫిర్యాదులు వచ్చాయి.


నున్న లే అవుట్

రాక్రీట్ సంస్థపై కేసు

విజయవాడలోని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిన నున్న మోడల్ లే అవుట్‌లో ప్రభుత్వం తరఫున 600 ఇళ్లు కట్టించేందుకు వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి బంధువులకు చెందిన రాక్రీట్ సంస్థ పనులను దక్కించుకుంది. కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై కింద అందించే రూ.1.80 లక్షలు కాకుండా అదనంగా లబ్ధిదారుడు రూ.35 వేలు చెల్లించే పద్ధతిలో ఒప్పందం కుదిరింది. లబ్ధిదారుడి తరఫున జిల్లా యంత్రాంగం బ్యాంకు ద్వారా రుణాలిప్పించింది. ఈ రుణాన్ని నేరుగా కాంట్రాక్టు సంస్థ తీసుకునే అవకాశాన్ని కల్పించింది. ఆ డబ్బులను తీసేసుకున్న కాంట్రాక్టు సంస్థ కేవలం బేస్‌మెంట్ పనులు చేసి వెళ్లిపోయింది. తీసుకున్న అప్పులకు లబ్ధిదారులు వడ్డీలు కట్టాల్సి వస్తోంది. రాక్రీట్ సంస్థ మోసాలపై ఆటోనగర్ పోలీసు స్టేషన్‌లో లబ్ధిదారులు కేసు పెట్టారు. ఈ కేసుపై ఎలాంటి పురోగతి లేదు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'ఇళ్లు లేని పేదలందరికీ స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తాం. ఐదేళ్లలో 25 లక్షల పక్కా ఇళ్లు నిర్మిస్తాం. ఒక్కో లబ్ధిదారుడికి 2 నుంచి 5 లక్షల విలువైన ఇంటిని ఆస్తిగా అందజేస్తాం' అని గత ఎన్నికల ముందు వైసీపీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. ఈ ఐదేళ్లలో 5 లక్షల ఇళ్లు మాత్రమే కట్టారు. మిగిలినవి ఎప్పటికి పూర్తవుతాయో కానీ ఈ పథకం వైసీపీ నేతలకు కల్పవృక్షంలా మారింది. పేదలకు ఇళ్ల స్థలాల సేకరణకు అధికార పార్టీ నేతలు చౌక ధరకు భూములు కొని, ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మి భారీగా సొమ్ము చేసుకున్నారు. ఆ తర్వాత జగనన్న కాలనీల లెవెలింగ్ పేరుతోనూ వేల కోట్లు దండుకున్నారు. భూముల కొనుగోలు, లెవలింగ్ పనులకు ప్రభుత్వం దాదాపు 83 వేల కోట్లు ఖర్చు చేసింది. ఈ పథకం వల్ల పేదలకు కలిగిన ప్రయోజనం అంతంతే. వైసీపీ నేతలు మాత్రం కోట్లు కొల్లగొట్టారు. నివాస యోగ్యం కానీ చోట స్థలాలు ఇవ్వడంతో చాలాచోట్ల పేదలు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్ష మంది లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇళ్ల పట్టాలను ప్రభుత్వానికే తిరిగి ఇచ్చేశారు. 15 వేలకు పైగా జగనన్న కాలనీలను ఏర్పాటు చేశామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా.. చాలా చోట్ల మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదు.

అస్మదీయులకే కాంట్రాక్టులు

ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టుల్లోనూ అధికార పార్టీ నేతలు దోచుకున్నారు. ఆప్షన్-3 ఇళ్లను ప్రభుత్వం నిర్మించకుండా అస్మదీయ కాంట్రాక్టర్లకు కట్టబెట్టారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి బంధువులు, అనుచరులు డైరెక్టర్లుగా ఉన్న రాక్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 52,262 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును అప్పగించారు. జేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు 78,065 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును ఇచ్చారు. దాదాపు 1500 కోట్ల విలువైన పనులను ఈ ఒక్క సంస్థకే కట్టబెట్టారు. దీనివెనుక రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో పని చేసిన ఒక అఖిల భారత సర్వీస్ అధికారి చక్రం తిప్పినట్లు సమాచారం. ఇక అజాయా వెంచర్స్‌కు 23,571 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును కట్టబెట్టారు. రాష్ట్రంలో ఆప్షన్-3 కింద నిర్మించాల్సిన ఇళ్లలో సగానికిపైగా కాంట్రాక్టులను ఈ మూడు సంస్థలకే ఇవ్వడం వెనుక లోపాయికారీ ఒప్పందాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మూడు సంస్థలతోపాటు జిల్లాలవారీగా కావాల్సిన వారికి కాంట్రాక్టులు ఇచ్చారు. గృహ నిర్మాణ శాఖలో పని చేస్తున్న కొంతమంది అధికారులు కూడా తమ సమీప బంధువులను కాంట్రాక్టర్లుగా రంగంలోకి దింపినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టకుండానే అడ్వాన్సుల రూపంలో రూ.కోట్ల ప్రజాధనాన్ని దోచేశారు. ఒక్కో ఇంటి పునాదికి రూ.70 వేలు చొప్పున మొత్తం 3.50 లక్షల ఇళ్లకు అడ్వాన్సులు ఇచ్చారు. ఒక్కో ఇంటికి 342 కేజీల స్టీలు, 40 బస్తాల సిమెంట్ చొప్పున లక్షలాది టన్నుల స్టీలు, సిమెంటుతోపాటు ఉచితంగా ఇసుకను కూడా కాంట్రాక్టర్లకు సరఫరా చేశారు. దీనికి ప్రతిఫలంగా అధికారులు కమీషన్లు దండుకున్నారు. అడ్వాన్స్‌లు తీసుకున్న కాంట్రాక్టర్లు నామ్ కే వాస్తేగా పనులు చేపట్టారు. సిమెంటు, స్టీలు అమ్మేసుకుని కోట్లు కొల్లగొట్టారు.


ఆవలో నీట మునిగిన ఇళ్ల స్థలాలు

ఆవ భూముల్లో కోట్లు దోపిడీ

తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడిలో ఎకరా రూ.30 లక్షలు కూడా చేయని ఆవ భూములను రూ.45 నుంచి రూ.60 లక్షల ధరకు సుమారు 600 ఎకరాలు కొనుగోలు చేశారు. వైసీపీ నేతలు కోట్లాది రూపాయలు దోచుకున్నారు. స్థానిక నేతలు రాష్ట్రస్థాయి నేతలతో కుమ్మక్కై ఈ వ్యవహారం నడిపారు. అప్పట్లో ఇది సంచలనమైంది. రాజమండ్రి అర్బన్ పేదల కోసం రాజానగరం మండలం కానవరంలో 100 ఎకరాలు సేకరించారు. ఎకరం రూ.66 లక్షలకు కొనుగోలు చేశారు. అందులో 60 లక్షలు భూమి యజమానికి ఇచ్చి, వైసీపీ, రెవెన్యూ అధికారులు రూ.6 లక్షలు తీసుకునేలా ఒప్పందం చేసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. ఇక్కడ లేఅవుట్లు కూడా వేయలేదు. ఇంకా పొలాలుగానే ఉన్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందు సుమారు 10 వేలమందికి పట్టాలు పంచేశారు. వారికి స్థలాలు మాత్రం చూపించలేదు.


లక్ష్మీపురం లే అవుట్


బొల్లవరం లే అవుట్

గిరిజన భూముల్ని చౌకగా కొని..



విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని రామన్నదొరవలస సమీపంలో గిరిజనులకు చెందిన 20ఎకరాల అసైన్డ్ భూములను ఓ వైసీపీ నాయకుడు ముందుగానే అతి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. తరువాత ఆ భూములను జగనన్న కాలనీ కోసం ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మేశారు. ఆయన లక్షలాది రూపాయలు వెనకేసుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు లోకాయుక్తలో కేసు వేశారు. ప్రస్తుతం కేసు నడుస్తోంది.

మెరక పనుల్లోనూ మేత

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో లక్ష్మీపురం, పోణంగి, పాలగూడెం ప్రాంతాల్లో భూముల కొనుగోలులో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. లక్ష్మీపురంలో మార్కెట్ రేటు కన్నా ఎక్కువ ధరకు భూములు కొనుగోలు చేశారని అప్పట్లో ప్రతిపక్ష నాయకులు ఆందోళనలు చేశారు. లక్ష్మీపురం, పోణంగిలో మెరక పనులకు సంబంధించి కాంట్రాక్టర్లతో కుమ్మక్కై. అధికారులు అవినీతికి పాల్పడ్డారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నివాసయోగ్యం కాకున్నా...

కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం గ్రామాల్లో రూ.167 కోట్లు వెచ్చించి రైతుల నుంచి 478.67 ఎకరాలను కొన్నారు. మీనాపురంలో తప్ప రామేశ్వరం, బొల్లవరం గ్రామాలలో సేకరించిన భూములు నివాసయోగ్యమైనవి కావు. వైసీపీ నేతలు బినామీల పేరిట భూములు కొనుగోలుచేసి ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మినట్టు ఆరోపణలు వచ్చాయి. ఇందులో చాలావరకు చుక్కల భూములు, నల్లరేగడి బంక భూములు ఉన్నాయి. భూసేకరణ వ్యవహారంలో అధికార పార్టీ నేతలు కోట్లు దోచుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

గుసగుసలు

ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీకి జై!



నెల్లూరు జిల్లాలో ఒక వైసీపీ అభ్యర్థి వింత ప్రచారం చేస్తున్నారు. "ఇప్పుడు ఒక పార్టీ నుంచి పోటీ చేస్తున్నా! అదే పార్టీలోనే ఉంటానని అనుకోవద్దు. ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీలో చేరిపోతా. నాకు పార్టీలు ముఖ్యం కాదు. నియోజకవర్గ అభివృద్ధి.. ప్రజల సమస్యలు ముఖ్యం. అధికార పార్టీలో ఉంటే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయి. అందుకే... మా పార్టీ గెలిస్తే మా పార్టీలో ఉంటా. ప్రతిపక్షం గెలిస్తే ప్రతిపక్షంలో చేరిపోతా!" అని ఆయన ఓటర్లకు చెబుతున్నారు. ఇది తెలిసిన ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి అప్రమత్తమయ్యారు. "నన్నే గెలిపించండి. మా పార్టీనే అధికారంలోకి వస్తుంది. పార్టీ మారతానని చెప్పే వారి మాటలు నమ్మొద్దు" అని కోరుతున్నారు.

సంఘం చెప్పిన మాట


కేఆర్‌కే రాజు, కో కన్వీనరు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ సాధన సమితి

కూటమి మేనిఫెస్టోలో క్షత్రియులకు ప్రాధాన్యం

జగన్ క్షత్రియులను నయవంచన చేశారు. ఐదేళ్లలో క్షత్రియులకు ఆయన చేసింది ఏమీ లేదు. క్షత్రియులు ఎదుర్కొంటున్న సమస్యలు, క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు, భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం తదితర అంశాలపై టీడీపీ అధినేత చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చాం. ఆయన చాలా సానుకూలంగా స్పందించారు. మేనిఫెస్టోలో కూడా చేర్చారు. దీంతో క్షత్రియ కార్పొరేషన్ సాధన సమితి కూటమికి పూర్తి మద్దతు ఇస్తోంది. ఈమేరకు క్షత్రియులను చైతన్యవంతం చేస్తున్నాం.

- విజయనగరం

ఓటు వేయడం అనేది మనపట్ల, ఇతరులపట్ల, ఈ దేశంపట్ల, ఈ ప్రపంచంపట్ల మనకున్న నిబద్ధతకు నిదర్శనం


- షారోన్ షాబీబెర్గ్ (అమెరికన్ రచయిత)



గుడివాడలో హోరాహోరీ



మాజీ మంత్రి కొడాలి నానితో వెనిగండ్ల రాము ఢీ

వరుసగా ఐదోసారి గెలుపుపై నాని కన్ను.. తొలి గెలుపు కోసం పక్కా వ్యూహంతో రాము

కీలకం ?

రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్న నియోజకవర్గాల్లో కృష్ణా జిల్లాలోని గుడివాడ ఒకటి. ప్రధాన పార్టీ అభ్యర్థులిద్దరూ ఆర్థిక, అంగబలాల్లో సమాన స్థాయిలో ఉండడంతో గుడివాడ పోరు ఆసక్తి రేపుతోంది. వైసీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు అలియాస్ నాని, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తరఫున టీడీపీ అభ్యర్థిగా ఎన్నారై వెనిగండ్ల రాము పోటీ చేస్తున్నారు. ఇక్కడి నుంచి వరుసగా నాలుగు సార్లు విజయం సాధించిన నానీ ఐదోసారి కూడా గెలవాలని తహతహలాడుతున్నారు. అయితే అదంత సునాయాసంగా కనిపించడం లేదని సొంత పార్టీ శ్రేణులే అంటున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌పై బూతుల దాడిలో ముందుండే నానీ ఓటమే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు కసితో పనిచేస్తున్నాయి.

ఒకనాడు టీడీపీ కంచుకోట

గుడివాడ.. టీడీపీ ఆవిర్భావం నుంచీ ఆ పార్టీకి కంచుకోట. టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు పుట్టిన నిమ్మకూరు ఒకప్పుడు గుడివాడ నియోజకవర్గంలోనే ఉండేది (2009లో పామర్రులోకి వెళ్లింది). సొంత గడ్డపై మమకారంతో 1983లో ఎన్టీఆర్ తన రాజకీయ అరంగేట్రానికి ఈ నియోజకవర్గాన్నే కార్యశాలగా ఎంచుకున్నారు. గుడివాడ వాసులూ అంతే మమకారంతో ఆయన్ను గెలిపించారు. 1985లోనూ విజయం సాధించారు. ఆయన హయాంలో గుడివాడ రూపురేఖలు మారిపోయాయి. అభివృద్ధి పరుగులు తీసింది. అందమైన రహదారులతో పాటు క్రీడాప్రియుల కోసం ఎన్టీఆర్ స్టేడియం నిర్మించారు. టీడీపీ పుట్టిన తర్వాత ఇప్పటి వరకు 10 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే 7 సార్లు టీడీపీ జెండా ఎగిరింది. ఒక్కసారి కాంగ్రెస్, గత రెండుసార్లు వైసీపీ గెలుపొందింది. కొడాలి నానీ వరుసగా నాలుగు సార్లు (2004, 2009ల్లో టీడీపీ తరఫున, 2014,19ల్లో వైసీపీ తరఫున) విజయం సాధించారు. వరుస ఓటముల నుంచి పాఠాలు నేర్చుకున్న టీడీపీ.. ఎన్నారై వెనిగండ్ల రామును ఎన్నికలకు రెండేళ్ల ముందే రంగంలోకి దింపింది. గత రెండేళ్లుగా నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలతో ఆయన చొచ్చుకుపోయారు. మాజీ ఎమ్మెల్యే, స్థానికంగా బలమైన నాయకుడిగా ఉన్న రావి వెంకటేశ్వరరావు తొలుత ఆయనకు దూరంగా ఉన్నా అధిష్ఠానం జోక్యంతో ప్రస్తుతం ఇద్దరూ కలిసి పనిచేస్తున్నారు. రాము సతీమణి ఎస్సీ సామాజికవర్గానికి చెందిన మహిళ కావడం కలిసొచ్చే అంశమని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

విధ్వంసం, కేసినోలు.. సెంటిమెంట్..

నానీ సైతం దీటైన వ్యూహాలతో ఐదోసారి గెలుపు కోసం కసరత్తు చేస్తున్నారు. తనపై నియోజకవర్గ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని గ్రహించి.. ఆఖరి అస్త్రంగా సెంటిమెంట్‌ను తెరపైకి తెచ్చారు. ఇవే తనకు చివరి ఎన్నికలని.. గెలిపించి గౌరవప్రదంగా రాజకీయాల నుంచి నిష్క్రమించే అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు. అయితే ఒకప్పుడు అభివృద్ధికి మారుపేరుగా ఉన్న గుడివాడలో గత ఐదేళ్లలో విధ్వంసం రాజ్యమేలింది. తాగునీటికీ ప్రజలు అల్లాడుతున్నారు. సాగునీటిదీ అదే పరిస్థితి. వీటికితోడు నాని గుడివాడను జూదశాలగా మార్చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా కేసినో సంస్కృతిని తొలిసారి దిగుమతి చేసుకున్న పట్టణంగా గుడివాడ నిలిచిపోయింది. నానీ మూడేళ్లు రాష్ట్ర మంత్రిగా చేశారు. నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టడం కన్నా ప్రతిపక్ష నాయకులపై బూతులతో విరుచుకుపడడానికే ప్రాధాన్యమిస్తూ వస్తున్నారు. ఇసుక రీచ్‌ల్లో ఇసుక దోపిడీతో కోట్లు కొల్లగొడుతున్నారని విపక్షాలు దుయ్యబడుతున్నాయి. రోడ్ల బాగునూ నానీ పట్టించుకోలేదు. టిడ్కో ఇళ్లను ఐదేళ్లపాటు లబ్ధిదారులకు ఇవ్వకుండా ఎన్నికల ముందు సీఎం జగన్‌తో ప్రారంభింపజేసి హడావుడి చేశారు. ఈ పరిణామాల దరిమిలా ఆయన చెమటోడ్చాల్సిన పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి





వెనిగండ్ల రాము బలాలు..

ఉన్నత విద్యావంతుడు.. ఆర్థిక, అంగ బలం పరంగా బలమైన నాయకుడు. స్థానిక టీడీపీ నేతలతో మమేకం..

బలహీనతలు: తొలిసారి పోటీ
టీడీపీలో ఉన్న నానీ కోవర్టులు
ఎన్నికల నిర్వహణ కొత్త

కొడాలి నాని బలాలు..

20 ఏళ్లగా ఎమ్మెల్యే.. ఆర్థిక, అంగబలాలు.. ఎన్నికల నిర్వహణలో ఆరితేరడం.. ఎస్సీ ఓటు బ్యాంకు.

బలహీనతలు

గత ఐదేళ్లలో అభివృద్ధిలేమి, కేసినో సంస్కృతిపై ఆగ్రహ జ్వాలలు.. ఎన్నికలప్పుడు తప్ప అందుబాటులో ఉండకపోవడం.

గుడివాడ నియోజకవర్గ స్వరూపం..

మండలాలు: గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ

మొత్తం ఓటర్లు:	2,04,271
పురుషులు:	97,710
మహిళలు:	1,06,550
ట్రాన్స్‌జెండర్లు:	11

కీలక సామాజిక వర్గాలు

ఎస్సీలు-60 వేలు, బీసీలు-40 వేలు, కాపులు-30 వేలు, ముస్లింలు-30 వేలు, కమ్మ-12 వేలు, రెడ్లు-8 వేలు, బ్రాహ్మణ/వైశ్య/మార్వాడీలు- 25 వేలు

వదల బొమ్మాళి.. వదలా





కొన్ని పాత్రలు కొంతమంది తారల కోసమే పుట్టాయా అనిపిస్తుంటుంది. అలాగే 'అరుంధతి' చిత్రంలో జేజమ్మ పాత్ర మాత్రం అనుష్క కోసమే పుట్టింది. ఈ సినిమాతో మరో రెండు మూడేళ్ల వరకూ తీరిక లేనంతగా బిజీ అయ్యారు అనుష్క. 'అరుంధతి' చిత్రంలో జేజమ్మ పాత్ర కోసం చాలా మంది హీరోయిన్ల పేర్లు అనుకున్నారు. కొంతమందిని సంప్రదించారు కూడా. అయితే ఐదు అడుగుల పది అంగుళాల ఎత్తు కలిగి, రాయల్ లుక్ కలిగిన నటి కావాలి కనుక నిర్మాత శ్యామ్‌ప్రసాదరెడ్డి ఆ విషయంలో రాజీ పడలేదు. చివరకు 'జెమినీ' కిరణ్ సూచనపై అనుష్క నటించిన 'సూపర్' చిత్రం చూసి ఆమెను పిలిపించారు. రకరకాలుగా ఆడిషన్స్ చేసి చివరకు ఆమెను ఫైనలైజ్ చేశారు.

దర్శకుడి మార్పు

'అరుంధతి' చిత్రానికి మొదట తమిళ దర్శకుడు సభాపతిని ఎంపిక చేశారు శ్యామ్. మెగాస్టార్ చిరంజీవితో ఆయన నిర్మించిన 'అంజి' చిత్రానికి కూడా మొదట్లో కొన్ని రోజులు పని చేశారు సభాపతి. ఆ తర్వాత ఆయన స్థానంలోకి కోడి రామకృష్ణ వచ్చారు. అలాగే 'అరుంధతి' సినిమాలోని పతాక సన్నివేశాల చిత్రీకరించమని సభాపతికి చెప్పారు శ్యామ్. అనుష్కతో షూటింగ్ చేసి, ఆ వర్క్ ఎడిట్ చేసి శ్యామ్‌ప్రసాదరెడ్డికి చూపించారు సభాపతి. అది ఆయనకు నచ్చలేదు. మరోసారి తీయమని చెప్పారు. సభాపతి రెండో సారి కూడా తీసిన సన్నివేశాలు నచ్చకపోవడంతో ఆయన్ని తొలగించి కోడి రామకృష్ణకు దర్శకత్వ బాధ్యతలు అప్పగించారు.

డ్రమ్ సాంగ్ కోసం 45 రోజులు


అప్పట్లో ఒక చిన్న సినిమాను 45 నుంచి 50 రోజుల్లో పూర్తి చేసేవారు. కానీ 'అరుంధతి' చిత్రంలో అనుష్క పాల్గొన్న డ్రమ్ సాంగ్ చిత్రీకరణ కోసం 45 రోజులు పట్టడం విశేషం. పర్‌ఫెక్షన్ కోసం నిర్మాత శ్యామ్‌ప్రసాద్ రెడ్డి ఎంతగా తపిస్తారో అని చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే. 210 రోజులు షూటింగ్ చేసిన తర్వాత అరుంధతి చిత్రం రషెస్ చూశారు శ్యామ్‌ప్రసాద్ రెడ్డి. అందులో చాలా సన్నివేశాలు ఆయనకు నచ్చలేదు. అందుకే మరో 40 రోజుల పాటు రీ షూట్ చేసి మొదట తీసిన సన్నివేశాలకు బెటర్‌మెంట్ తెచ్చారు. రూ.3 కోట్ల బడ్జెట్ అనుకుని ప్రారంభించిన ఈ సినిమా పూర్తయ్యేసరికి రూ 13 కోట్లు అయింది. 2009 సంక్రాంతికి విడుదలైన 'అరుంధతి' చిత్రం ఘన విజయం సాధించడమే కాకుండా రూ 70 కోట్లు వసూలు చేసింది.

'వదల బొమ్మాళి.. నిన్ను వదల' అంటూ 'అరుంధతి' చిత్రంలో పశుపతి చెప్పిన డైలాగ్ గుర్తుంది కదూ. తన గెటప్‌తో, అభినయంతో అదరగొట్టేసి పశుపతి పాత్రతో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు సోనూ సూద్. పశుపతి వేషం ఆయనకు దక్కడం వెనుక ఆసక్తికరమైన కథ ఉంది. అదేమిటంటే.. పశుపతి పాత్రకు మొదట తమిళ నటుడు పశుపతిని అనుకున్నారు నిర్మాత శ్యామ్ ప్రసాద్‌రెడ్డి. ఆ పాత్రకు ఆ పేరు పెట్టడానికి కారణం పశుపతిని పిలిపించి గెటప్ వేసి స్టిల్స్ తీశారు. చిత్రంలో అఘోరా పాత్రకు ఆయన చక్కగా సూట్ అయ్యారు కానీ రాజుగా కనిపించే సన్నివేశాల కోసం గెటప్ వేసినప్పుడు పశుపతి తేలిపోయారు. దాంతో ఆలోచనలో పడ్డారు శ్యామ్‌ప్రసాద్ రెడ్డి. ఆ పాత్రకు ఎవరా అని ఆలోచిస్తున్న తరుణంలో జూనియర్ ఎన్టీఆర్ నటించిన

20 రోజులు.. రూ 43 లక్షలు

'అశోక్' చిత్రం విడుదల అయింది. అందులో విలన్‌గా నటించిన సోనూ సూద్ శ్యామ్ దృష్టిని ఆకర్షించారు. వెంటనే ఆయన ఫోన్ నంబర్ తీసుకుని, మాట్లాడి ముంబై నుంచి హైదరాబాద్‌కు పిలిపించారు. పశుపతి పాత్ర కోసం వేసిన గెటప్ స్కెచ్ చూడగానే ఆ పాత్ర తను చెయ్యనని చెప్పేశారు సోనూ సూద్, ఒకసారి గెటప్ వేసి మేకప్ టెస్ట్ చేద్దామనీ, అప్పుడు కూడా నచ్చకపోతే వేరే నటుడిని తీసుకుంటానని శ్యామ్ చెప్పారు. సరేనన్నారు సోనూ సూద్. 'దశావతారం' చిత్రానికి కమల్ హాసన్‌కు మేకప్ చేసిన రమేశ్‌ను పిలిపించి ఆయనతో సోనూ సూద్‌కు అఘోరా గెటప్ వేయించారు. కేవలం మేకప్‌కే ఆరు గంటలు పట్టింది. ఆ పాత్ర చేయడం తనకు ఇష్టం లేకపోయినా నిర్మాతగా శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తపన చూసి చివరకు అంగీకరించారు సోనూ సూద్. '20 రోజుల్లో మీ వర్క్ పూర్తి చేస్తా. పారితోషికం ఎంత కావాలి' అని శ్యామ్ అడిగితే రూ. 18 లక్షలు ఇవ్వమన్నారు సోనూ సూద్. 'అలా కాకుండా మీరు రూ.20 లక్షలు ఇస్తే ఎన్ని రోజులైన పని చేస్తా' అని ఇంకో ఆప్షన్ కూడా ఇచ్చారు. అయితే శ్యామ్‌ప్రసాదరెడ్డి అలా అంగీకరించకుండా 'మీరు కోరినట్లు 20 రోజులకి రూ. 18 లక్షలు ఇస్తా. ఆ తర్వాత ఎన్ని రోజులు ఎక్కువ వర్క్ చేసినా రోజుకి రూ.25 వేలు చొప్పున ఇస్తా' అన్నారు. ఓకే అన్నారు సోనూ సూద్. ఫైనల్‌గా ఆయనకు ఇచ్చిన పారితోషికం ఎంతో తెలుసా.. రూ.43 లక్షలు.


అలసిపోయానబ్బా.. విశ్రాంతి తీసుకుంటున్నా



ఒకే ఏడాదిలో వరుసగా 'పఠాన్', 'జవాన్', 'డంకీ' చిత్రాలతో మూడు హిట్లు ఇచ్చి బాక్సాఫీసుని షేక్ చేసిన షారుఖ్‌ఖాన్ ఇప్పుడు రెస్ట్ మోడ్‌లో ఉన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆయన కొత్త చిత్రం ఏదీ ఒప్పుకోకుండా హాలీడేస్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. 'ఒకటి కాదు రెండు కాదు.. వరుసగా మూడు చిత్రాలు ఒకే సంవత్సరంలో చేయాల్సి రావడంతో బాగా శారీరకంగా, మానసికంగా అలసిపోయానబ్బా.. అందుకే ప్రస్తుతం రెస్ట్ తీసుకుంటున్నా. క్రికెట్ మ్యాచ్‌లు చూస్తూ ఎంజాయ్ చేస్తున్నా. నా కొత్త సినిమా షూటింగ్ జులైలో కానీ ఆగస్టులో కానీ ప్రారంభం కావచ్చు. జూన్‌కల్లా నేను ఫ్రీ అయిపోతాను కానీ ఆ సినిమా షూటింగ్ జూన్‌లో కూడా ప్రారంభం కావచ్చు.' అన్నారు. కొత్త సినిమా వివరాలు ఆయన చెప్పలేదు కానీ సుజయ్ ఘోష్ ఆ సినిమాకు దర్శకత్వం వహిస్తారనేది ఓ టాక్. అలాగే 'జవాన్' దర్శకుడు అట్లీ కూడా షారుఖ్ కోసం ఓ కథ సిద్ధం చేశారు. వీటిల్లో ఏది మొదలవుతుందనే విషయంలో త్వరలో క్లారిటీ వస్తుంది.

చిన్న సినిమాదే సందడి

ఈ ఏడాది వేసవి టాలీవుడ్‌కు నిరాశనే మిగిల్చింది. ఎన్నికలు, ఐపీఎల్, ఎండలు... ఇలా కారణాలు ఏవైనా ఒక మంచి సీజన్ చేజారింది. ఏటా వేసవి బరిలో పోటీపడే పెద్ద సినిమాలు ఈ సారి బరి నుంచి వెనక్కు తగ్గాయి. దీంతో కొన్ని చిన్న, మిడ్ రేంజ్ సినిమాలు మాత్రం మేలో ప్రేక్షకులకు వినోదం పంచేందుకు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. వారానికో అరడజను సినిమాలు చొప్పున విడుదలకు సిద్ధమయ్యాయి.







సక్సెస్ కోసం సత్యదేవ్



రెండో వారంలోనూ చిన్న సినిమాలు బాక్సాఫీసు దగ్గర సందడి చేసేందుకు సిద్ధమయ్యాయి. సరైన హిట్ కోసం ఏళ్లగా ఎదురుచూస్తున్న సత్యదేవ్ ఈసారి 'కృష్ణమ్మ' అనే చిత్రంతో మరో ప్రయత్నం చేస్తున్నారు. ఈ నెల 10న ఈ చిత్రం విడుదలవుతోంది. ఇందులో ఆయన మాస్ అవతార్‌లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి వి.వి గోపాలకృష్ణ దర్శకుడు. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు.

హిందుత్వ సిద్ధాంతాలతో ప్రేరేపితమైన చారిత్రక ఘట్టాలు, సంఘటనల ఆధారంగా ఇప్పుడు బాలీవుడ్‌లో తామర తంపరగా సినిమాలు వస్తున్నాయి. ఈ తరహా కథాంశంతో వచ్చిన 'రజాకార్' చిత్రంతో టాలీవుడ్ కూడా ఓ మంచి సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకొంది. ఈ కోవలోనే హిందుత్వం, దేశభక్తి, వామపక్ష రాజకీయాలు, నక్సలిజం లాంటి అంశాలను స్పృశిస్తూ తెరకెక్కిన తాజా చిత్రం 'జితేందర్ రెడ్డి'. పూర్తిగా కొత్త తారాగణంతో తెరకెక్కినా, ప్రచార చిత్రాలతో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచడంలో చిత్రబృందం విజయం సాధించింది. అయితే ఈ పాజిటివ్ టాక్ బాక్సాఫీసు దగ్గర ఎంతవరకూ ఫలిస్తుంది అనేది తెలియాలంటే వేచిచూడాలి. ఈ సినిమా పదో తేదీన విడుదలవుతోంది.

వీటితో పాటు 'ఆరంభం', 'బ్రహ్మచారి' చిత్రాలు రిలీజ్ అవనున్నాయి. వీటితో పాటు ఓ హిందీ చిత్రం సైతం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. దృష్టిలోపం ఉన్నప్పటికీ పారిశ్రామిక వేత్తగా స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని కొనసాగించారు శ్రీకాంత్ బొల్లా. ఆయన జీవితం ఆధారంగా రూపుదిద్దుకున్న బాలీవుడ్ చిత్రం 'శ్రీకాంత్'. రాజ్‌కుమార్ రావు టైటిల్ రోల్ పోషించారు. ఈ నెల 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. జ్యోతిక, అలయ ఎఫ్, శరద్ కేల్కర్ కీలకపాత్రలు పోషించారు.

ముచ్చటగా మూడు సినిమాలు

మూడోవారంలో సందడంతా హీరో విష్వక్‌సేన్‌దే అనే చెప్పాలి. ఇటీవలే 'గామి' చిత్రంతో సక్సెస్‌ను ఖాతాలో వేసుకున్నారు. ఆయన హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. ఈ నెల 17న విడుదలవుతోంది. కృష్ణ చైతన్య దర్శకుడు. నేహాశెట్టి కథానాయిక. ఇక కాజల్ అగర్వాల్ లీడ్‌రోల్‌లో నటించిన 'సత్యభామ' చిత్రం కూడా 17న విడుదలవుతోంది. ఇందులో కాజల్ పోలీసాఫీసర్‌గా సీరియస్ రోల్‌లో కనిపించనున్నారు. నవీన్‌చంద్ర, ప్రకాశ్‌రాజ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సుమన్ చిక్కాల దర్శకుడు. వీటితో పాటు గెటప్ శ్రీను కథానాయకుడిగా నటించిన తొలి చిత్రం 'రాజు యాదవ్' కూడా 17న ప్రేక్షకుల ముందుకొస్తోంది.



సోలోగా



దెయ్యానికి బాయ్‌ఫ్రెండ్ ఉంటే ఏం జరుగుతుందనే ఉత్కంఠభరిత కథాంశంతో వస్తున్న చిత్రం 'లవ్ మీ'. ఆశిష్, వైష్ణవీ చైతన్య జంటగా నటించారు. అరుణ్ భీమవరం దర్శకుడు. దిల్ రాజు ప్రొడక్షన్స్ బేనర్‌పై హర్షిత్‌రెడ్డి, హన్షిత, నాగమల్లిడి నిర్మిస్తున్నారు. ఈనెల 25న ఈ చిత్రం విడుదలవుతోంది.


చివర్లో సుధీర్‌బాబు

ఈ నెల చివరివారంలో సుధీర్‌బాబు 'హరోం హర' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఈ యాక్షన్ ఎంటర్టైనర్‌కు జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహిస్తున్నాడు. మాళవికా శర్మ కథానాయిక. సునీల్ కీలకపాత్ర పోషించారు. సుమంత్ జి. నాయుడు నిర్మాత. 1989లో చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఈనెల 31న విడుదల చేస్తున్నారు. ఇక అదే తేదీన ఆనంద్ దేవరకొండ నటించిన 'గం గం గణేశా' చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ కామెడీ ఎంటర్టైనర్‌లో ప్రగతి శ్రీ వాస్తవ కథానాయిక. 'బేబీ' లాంటి హిట్ చిత్రం తర్వాత ఆనంద్ నుంచి వస్తున్న చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.




తొలివారం అంతంతమాత్రం

మే నెల్లో తొలి శుక్రవారం అరడజనుకుపైగా చిత్రాలు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. ఇవన్నీ చిన్న చిత్రాలే. తొలి శుక్రవారం సుహాస్ కథానాయకుడిగా నటించిన 'ప్రసన్న వదనం', అల్లరి నరేశ్ హీరోగా నటించిన 'ఆ ఒక్కటి అడక్కు' చిత్రాలు బాక్సాఫీసులో రేసులో నిలవగా, వరలక్ష్మీ శరత్ కుమార్ నటించిన హీరోయిన్ ఓరియంటెడ్ మూవీ 'శబరి' పూర్తిగా నిరాశపరిచింది. డబ్బింగ్ చిత్రం 'బాక్' విడుదలకు ముందు ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగించడంలో సఫలమైంది. అయితే కథ పేలవంగా ఉండడంతో ప్రేక్షకాధరణ కరువైంది. తమన్నా, రాశీఖన్నా లాంటి టాప్ హీరోయిన్లు నటించినా ఈ హారర్ థ్రిల్లర్ ప్రేక్షకులను ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. 'ది ఇండియన్ స్టోరీ', చిత్రానిది సైతం అదే పరిస్థితి. ప్రభుదేవా నటించిన 'ప్రేమికుడు' చిత్రం కూడా ఈ వారంలోనే రీ రిలీజ్ అయింది.







ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
బోడ్కిన్	వెబ్‌సిరీస్	మే 09
మథర్ ఆఫ్ ది బ్రైడ్	హాలీవుడ్ మూవీ	మే 09
థాంక్యూ నెక్స్ట్	వెబ్‌సిరీస్	మే 09
అమెజాన్ ప్రైమ్		
ఆవేశం	మలయాళ చిత్రం	మే 09
ది గోట్	వెబ్‌సిరీస్	మే 09
యోధ	హిందీ చిత్రం	మే 10
జీ 5		
8 ఏ.ఎం. మెట్రో	హిందీ చిత్రం	మే 10
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
మంజుమ్మల్ బాయ్స్	మలయాళ చిత్రం	మే 05
ఆల్ ఆఫ్ అజ్ స్ట్రేంజర్స్	హాలీవుడ్ మూవీ	మే 08
సోనీ లివ్		
అన్ దేఖీ 3	హిందీ సిరీస్	మే 10
లయన్స్ గేట్ ప్లే		
ది మార్ష్ కింగ్స్ డాటర్	హాలీవుడ్ మూవీ	మే 10
ఆపిల్ టీవీ ప్లస్		
డార్క్ మేటర్	వెబ్‌సిరీస్	మే 08
హాలీవుడ్ కాన్ క్వీన్	వెబ్‌సిరీస్	మే 08
మాక్స్‌టన్ హాల్	వెబ్‌సిరీస్	మే 09

కరీనా కపూర్‌కు అరుదైన గౌరవం



బాలీవుడ్ నటి కరీనా కపూర్ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. ఐక్యరాజ్య సమితిలో కీలక భాగమైన స్వచ్ఛంద సేవా సంస్థ యూనిసెఫ్(యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్)కు భారత ప్రతినిధిగా ఆమె శనివారం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కరీనా మాట్లాడుతూ "భావి తరాలకు పునాది లాంటి బాలల హక్కుల సంరక్షణ అనేది చాలా ముఖ్యమైన విషయం. ఈ అవకాశం దక్కడం ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. నా శక్తివంచన లేకుండా పని చేసి వారి బాల్యానికి, విద్యాభ్యాసానికి, సమానత్వానికి ఉపయోగపడేలా మరింత కృషి చేస్తా" అని అన్నారు. కాగా, 2014 నుంచి ఈ సంస్థతో కలసి కరీనా అనాధ బాలల అభివృద్ధి కోసం, వారి హక్కుల పరిరక్షణకు కరీనా పాటుపడుతున్నారు.

రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదు




'ఠాగూర్', 'మాస్', 'మన్మథ' 'షాక్' వంటి ఎన్నో తెలుగు చిత్రాల్లో నటించారు జ్యోతిక. ఓ పక్క తమిళంలోనూ వరుస అవకాశాలతో అగ్ర కథానాయికగా కొనసాగే టైంలోనే నటుడు సూర్యను పెళ్లి చేసుకుని సినిమాలకు విరామమిచ్చారు. రీ ఎంట్రీలో కొన్ని సెలక్టెడ్ సినిమాల్లో నటించిన ఆమె ఈ నెల 10న విడుదలవుతోన్న బాలీవుడ్ చిత్రం 'శ్రీకాంత్'లో ఓ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా మీడియాతో మాట్లాడిన ఆమె..పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "నన్ను చాలా మంది రాజకీయాల్లోకి ఆహ్వానించారని, నేను త్వరలోనే రాజకీయాల్లోకి రానున్నానని అందరూ అనుకుంటున్నారు. కానీ అందులో వాస్తవం లేదు. రాజకీయాల్లోకి రమ్మని నన్నెవరూ సంప్రదించలేదు. అయినా రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదు. నేను సూర్య కలసి మళ్లీ ఎప్పుడు నటిస్తామని అందరూ అడుగుతున్నారు. సూర్యతో కలసి నటించాలని నాకూ ఉంది. అందుకు తగ్గ కథ దొరికితే నటించడానికి ఇద్దరం సిద్ధమే" అని చెప్పారు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● ఆదివారం 5 మే 2024

ఒక ఇంటి ఇరుగు పొరుగు సఖ్యంగా, సహకారంగా ఉంటే ఆ ఇంట్లోని వారి జీవనం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఒక దేశ సరిహద్దు దేశాల విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. భారతదేశం తనవంతు ప్రయత్నంగా 'నైబర్స్ ఫస్ట్' పాలసీతో ఇరుగు పొరుగు దేశాలకు స్నేహ హస్తాన్ని అందిస్తోంది. 2014లో మాల్దీవుల్లో మంచినీటి కొరత వచ్చినపుడు, 2015లో నేపాల్ భూకంప సమయంలో, 2022లో శ్రీలంకలో నిత్యావసర వస్తువులకు, చమురుకు తీవ్ర కొరత ఎదురైనప్పుడు సహాయాన్ని అందించడంలో భారత్ అగ్రభాగాన నిలిచింది.

భారత్ - చైనా సంబంధాలు

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



భారత్‌తో దీర్ఘకాలిక వైరం నెరపుతున్న పాకిస్థాన్, చైనా మినహా మిగతా సరిహద్దు దేశాలన్నీ మనదేశంతో సఖ్యతగానే ఉంటూ వస్తున్నాయి. చిన్న చిన్న వివాదాలున్నప్పటికీ సానుకూల వాతావరణమే భారత్ చుట్టుపక్కల నెలకొంది.

● అయితే, గత దశాబ్ద కాలంగా చైనా చాప కింద నీరులా భారత్ సరిహద్దు దేశాలన్నిటి ఆర్థికవ్యవస్థల్లోకి చొచ్చుకొని వెళ్లి ఒక ప్రణాళికాబద్ధ వ్యూహాన్ని అమలు చేస్తోంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో తన ఆధిపత్యాన్ని నెలకొల్పడం చైనా ప్రధాన ధ్యేయం. ప్రపంచ వాణిజ్యాన్ని శాసించడంతో పాటు వ్యూహాత్మక సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకోవడం ఇందులో ఒక భాగం. కాగా, తనకు పోటీగా ఎదుగుతోన్న మనదేశాన్ని నిలువరించి హిందూ మహాసముద్రంపై భారత్‌కు ఉన్న భౌగోళిక సాధికారతకు చెక్ పెట్టడం మరో ధ్యేయంగా చెప్పుకోవచ్చు.

● ప్రపంచ వాణిజ్యంలో సుదూర ప్రాంతాలకు భారీ ఎత్తున సరుకు రవాణా చేయాలంటే సముద్ర మార్గమే చౌకైనది. దాదాపు 70 శాతం ప్రపంచ కంటైనర్ ట్రాఫిక్ 4/5వ వంతు ప్రపంచ చమురు, గ్యాస్, వాణిజ్య నౌకలు హిందూ మహాసముద్రం నుంచే ప్రయాణిస్తాయి. ప్రపంచ ఆహార, శక్తివనరులు, ఖనిజాల రవాణా పరంగా హిందూ మహాసముద్రం ఆయువుపట్టు వంటిది.

● గత దశాబ్ది కాలంగా భారత్ పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, మయన్మార్, పాకిస్థాన్, నేపాల్, శ్రీలంక, మాల్దీవ్స్‌లో చైనా 150 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టింది. పాకిస్థాన్, మయన్మార్ దేశాలు ఉగ్రవాదం, మానవ హక్కుల ఉల్లంఘనల దృష్ట్యా అంతర్జాతీయ వెలివేతను ఎదుర్కొంటున్నాయి. భారత్, జపాన్, సింగపూర్ వంటి దేశాలు మయన్మార్‌కు ఆర్థిక సహాయం చేయడం, అక్కడ పెట్టుబడులు పెట్టడం వంటి చర్యలను నిలిపి వేశాయి. అయితే ఇదే అదనుగా చైనా ముందుకు వచ్చి... అక్కడి మిలిటరీ జుంటా ప్రభుత్వంతో సఖ్యత పెంచుకుంది. ఆయుధ సరఫరా, మౌలిక సదుపాయాలు, శక్తిరంగంలో ఉదారంగా పెట్టుబడులు కుమ్మరించింది. మయన్మార్‌లో 2021లో జరిగిన మిలిటరీ తిరుగుబాటు, తదనంతర మానవ హక్కుల ఉల్లంఘనల నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల విభాగమైన యునైటెడ్ నేషన్స్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్(యూఎన్‌హెచ్ఆర్‌సీ) ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ తీర్మానంపై సంతకం చేయకుండా తన వీటో అధికారాన్ని ఉపయోగించి అడ్డుకోవడం ద్వారా చైనా మయన్మార్ మిలిటరీ ప్రభుత్వానికి మరింత దగ్గరైంది. దీంతో బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో భాగంగా చేపట్టిన ఒకానొక ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టు చైనా-మయన్మార్ ఎకనామిక్ కారిడార్(సీఎంఈసీ) పనుల్లో వేగం పెరిగింది. ఈ కారిడార్ అనేక మౌలిక సదుపాయాల నిర్మాణానికి సంబంధించిన అనుసంధానతలను కలిగి ఉంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆయిల్, గ్యాస్ పైప్‌లైన్లు, ఆర్థిక నడవాలు, రైల్వేలైన్లు, ఇండస్ట్రియల్ పార్కులు వంటి అనేకం చైనా ఆధీనంలో అభివృద్ధి చెందుతు న్నాయి. వీటి ద్వారా చైనా భారీఎత్తున ఆర్థిక ప్రయోజనాలు పొందనుంది. ఫలితంగా సీఎంఈసీ ఏర్పరిచే సముద్ర అనుసంధానత చైనాకు హిందూ మహాసముద్రానికి మధ్య రాచద్వారాలు తెరుస్తుంది. సీఎంఈసీ ద్వారా మయన్మార్, క్యాక్‌ప్యూ పోర్టు నుంచి నేరుగా బంగాళాఖాత సముద్ర మార్గాన్ని మలక్కా జలసంధితో ప్రమేయం లేకుండానే చైనా వినియోగించుకోగలదు. తద్వారా చైనాకు దక్షిణాసియా, తూర్పుఆఫ్రికా, పశ్చిమాసియా, యూరప్ మార్కెట్లు మరింత దగ్గరగా అందుబాటులోకి వస్తాయి. అయితే బంగాళాఖాత ప్రాంతంలో చైనా ఉనికి, అండమాన్ నికోబార్ దీవులకు అత్యంత సమీపంగా చొచ్చుకొనిరావడం మాత్రం భారత భద్రత దృష్ట్యా ప్రమాదకరం కానుంది.

● ఇక భారత్‌తో నిత్యం కయ్యానికి కాలుదువ్వే పాకిస్థాన్‌కు చైనా ఎప్పుడూ కొమ్ముకాస్తూనే ఉంటుంది. ఉగ్రవాద ప్రోత్సాహాన్ని నిరసిస్తూ పాకిస్థాన్‌కు చిరకాలంగా చేస్తోన్న ఆర్థిక సహాయాన్ని అమెరికా నిలిపివేయడంతో చైనా ఆ అవకాశాన్ని అందిపుచ్చు కుంది. పాక్ మౌలిక రంగాల్లో భారీఎత్తున పెట్టుబడులు పెట్టడం ఆరంభించింది. న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌ల నిర్మాణంలో, ఆయుధాల సరఫరాలో భారీగా పాక్‌కు సహకరించడంతోపాటు బీఆర్‌ఐలో భాగంగా చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌ను పాక్ ఆక్రమిత భారత్ ప్రాంతమైన గిల్గిత్-బాల్టిస్థాన్ ప్రాంతం మీదుగా(కారాకోరం హైవే నిర్మాణం) చేపట్టింది. భారత్ సరిహద్దులకు అతి సమీపంలో ఉన్న ఈ కారిడార్‌లో చైనా అనేక మౌలిక సదుపాయాల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనుంది. రోడ్, రైల్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పవర్ ప్రాజెక్టులు దీనిలో అంతర్భాగంగా ఉంటాయి. సీ అండ్ లాండ్ బేస్డ్ కారిడార్ అయిన ఈ ప్రాజెక్టులో పాకిస్థాన్‌కు చెందిన రెండు నౌకాశ్రయాలైన కరాచీ, గ్వాదర్ పోర్ట్‌లు చైనాకు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రాజెక్టు వల్ల భారీస్థాయిలో పాకిస్థాన్‌కు రుణాలు లభించినప్పటికీ ప్రయోజనం మాత్రం చైనాకే ఎక్కువగా చేకూరనుంది. కరాచీ పోర్ట్ ద్వారా చైనాకు అరేబియా సముద్రం అందుబాటులోకి వచ్చింది. అదేవిధంగా గల్ఫ్ ఆఫ్ ఒమన్ ప్రాంతం గ్వాదర్ పోర్ట్ ద్వారా చైనాకు అందివస్తోంది. ఈ రెండు పోర్టులు మలక్కా జలసంధితో ప్రమేయం లేకుండా హిందూ మహాసముద్రాన్ని అతి తక్కువ దూరంతో చైనా చేరుకోవచ్చు. అదేవిధంగా యూరప్, మధ్యప్రాశ్చ్య ఆఫ్రికా ప్రాంతాలను త్వరగా చేరుకోవచ్చు. అయితే సుమారు మూడువేల కిలోమీటర్ల పొడవునా భారత్ సరిహద్దులకు సమీపంలో చైనా స్థావరాలు ఉన్నాయి. అదేవిధంగా అరేబియా సముద్రంలోనూ భారత్‌కు అత్యంత సమీపంగా చైనా నౌకా స్థావరాలూ ఉండటం ఆందోళన కలిగించే అంశమే. అంతేకాక గల్ఫ్ ఆఫ్ ఒమన్ ప్రాంతం నుంచి ప్రపంచ క్రూడ్ ఆయిల్ సరఫరాలో 1/4వ వంతు రవాణా అవుతుంది. భారత్‌కు చెందిన 65 శాతం చమురు దిగుమతులు ఈ ప్రాంతం నుంచే సరఫరా అవుతాయి. అలాంటి కీలక ప్రాంతంలో మరీ ముఖ్యంగా గ్వాదర్ పోర్ట్ చైనా ఆధీనంలో ఉండబోవడం వ్యూహాత్మకంగా కూడా పెను సవాళ్లను విసరడమే అవుతుంది.

● ఇక బీఆర్ఐ కింద చేపడుతోన్న ఆరు అతి ముఖ్యమైన ఎకనామిక్ కారిడార్లలో బంగ్లాదేశ్‌లో చైనా నిర్మిస్తున్న కారిడార్ అతి ముఖ్యమైనది. ఈ కారిడార్ ద్వారా చైనా 'స్ట్రింగ్ ఆఫ్ పెర్ల్స్' పాలసీ (హిందూ మహా సముద్రం చుట్టూ వ్యూహాత్మక ప్రాంతాల్లో చైనా తన సొంత లేదా నిధులు సమకూర్చి తన ఆధీనంలోకి తెచ్చుకున్న పోర్టులతో నెట్‌వర్క్ ఏర్పరచి హిందూ మహాసముద్రాన్ని తన కంట్రోల్‌లో ఉంచుకునే వ్యూహం)లో ఒక అతి కీలకమైన పోర్టు చిట్టగాంగ్ చైనా ఆధీనంలోకి వెళుతుంది. తద్వారా చైనాకు బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలోకి నేపాల్ నుంచి ప్రవేశం లభిస్తుంది. మౌలిక సదుపాయాలు అంతగా అభివృద్ధి చెందని బంగ్లాదేశ్‌లో దాదాపు 50కి పైగా మౌలిక అవస్థాపన ప్రాజెక్టులను ఇప్పటికే చైనా చేపట్టింది. బంగ్లాదేశ్‌లో 30 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టింది. ఆ దేశ స్టాక్ ఎక్స్‌ఛేంజ్‌లో సైతం భారీగా పెట్టుబడులు పెట్టిన చైనా.. బంగ్లాదేశ్ ఆర్థికవ్యవస్థను, రాజకీయాలను తన నియంత్రణలో ఉంచే ప్రణాళిక రచించింది.

(మిగతా మంగళవారం దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

● ప్రపంచ వాణిజ్యంలో అతిపెద్ద ఎగుమతిదారు చైనా. ఏటా 3.59 ట్రిలియన్ డాలర్ల ఎగుమతులు చేస్తోంది. పైగా అమెరికాను అధిగమించి అన్నిరంగాల్లో అగ్రరాజ్యంగా నిలవాలన్న కాంక్ష చైనాకు ఎప్ప టినుంచో ఉంది. అందుకోసం ప్రపంచ కీలక రవాణా మార్గాలను చైనా కేంద్రీకృతంగా అభివృద్ధి చేస్తూ... వ్యూహాత్మక ప్రదేశాల్లో తన సైనిక మోహరింపు ద్వారా ప్రపంచ వాణిజ్యాన్ని, రాజకీయాలను ఏకకాలంలో ఏలాలన్న బహుముఖ వ్యూహానికి 'బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్(బీఆర్ఐ)' ద్వారా తెర లేపింది.

● బీఆర్ఐ అంటే చైనాను ఖండాంతర్గత మార్గం(రోడ్డు/రైల్) ద్వారా ఆగ్నేయాసియా, దక్షిణాసియా, మధ్య ఆసియా, రష్యా, యూరప్‌లతో; సముద్ర మార్గం ద్వారా చైనా తీర ప్రాంతాలను దక్షిణ పసిఫిక్, ఆగ్నేయ, దక్షిణాసియా, మధ్యప్రాశ్చ్య(మిడిల్ ఈస్ట్), తూర్పు ఆఫ్రికా ప్రాంతాలతో అనుసంధానించే బృహత్తర రవాణా నెట్‌వర్క్. ఆయా ప్రాంతాల్లోని వివిధ దేశాల భూభాగాలు, సముద్ర జలాల ద్వారా అనుసంధానమయ్యే ఈ ప్రాజెక్టు కోసం చైనా అనేక దేశాలతో విస్తృత సంప్రదింపులు జరుపుతోంది. ఈ బీఆర్ఐ ప్రాజెక్టులో అత్యంత కీలక ప్రాంతం హిందూ మహాసముద్రం. ఈ సముద్ర మార్గాలపై పట్టు సాధించడం ద్వారా చైనా వాణిజ్య సుస్థిరతకు, భద్రతకు భరోసా ఏర్పడుతుంది. ఈ ప్రాజెక్టు చాటున భారత సరిహద్దు దేశాల్లో మాటువేసి భారత్ చుట్టూ తన సైనిక వలయం పన్నడం కూడా చైనా అంతర్లీన వ్యూహం. దీనికోసం భారత్ పొరుగు దేశాలకు ధారాళంగా అప్పులిచ్చి తన అప్పుల ఉచ్చులోకి చైనా లాగుతోంది. ఆయుధాల సరఫరా వంటి విభిన్న వ్యూహాలను చైనా అనుసరిస్తోంది.

నిట్ జలంధర్‌లో ఎంబీఏ

జలంధర్‌లోని డా.బీ.ఆర్ అంబేద్కర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్ - ఎంబీఏ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 38 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

స్పెషలైజేషన్‌లు: ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. క్యాట్/సీమ్యాట్/మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. ఈ స్కోర్ ఆధారంగానే అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

వెయిటేజీ: జాతీయ పరీక్ష స్కోర్‌కు 70 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 15 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **జాతీయ పరీక్ష స్కోర్ ద్వారా స్క్రీనింగ్ చేసిన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 22
- **గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 25
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** మే 25
- **కౌన్సెలింగ్ తేదీ:** మే 26
- **వెబ్‌సైట్:** www.nitj.ac.in



సెల్ సైన్స్ సంస్థలో పీహెచ్‌డీ

పుణెలోని నేషనల్ సెంటర్ ఫర్ సెల్ సైన్స్(ఎన్‌సీసీఎస్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌లో ప్రధానాంశం 'మోడరన్ బయాలజీ'. ఇది ఫుల్ టైమ్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఎంపికైన అభ్యర్థులు కోర్సు పూర్తయ్యేవరకూ క్యాంపస్‌లోనే ఉండాలి. ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ విధానంలో హాస్టల్ సౌకర్యం కల్పిస్తారు.



అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీ/స్ట్రక్చరల్ బయాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్/సిస్టమ్స్ బయాలజీ/న్యూరోసైన్స్/ఇమ్యూనాలజీ/ఇన్ఫెక్షన్ బయాలజీ/ క్యాన్సర్ బయాలజీ/మైక్రోబయల్ ఎకాలజీ స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. జూలై నాటికి ఎమ్మెస్సీ డిగ్రీ చేతికందే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ(కేటగిరీ 1)/ఐసీఎంఆర్/బీఐఎన్‌సీ/డీఎస్‌టీ ఇన్‌స్పైర్ నుంచి వ్యాలిడ్ ఫెలోషిప్ ఉండాలి. ఎన్‌సీబీఎస్/టీఐఎఫ్ఆర్ నిర్వహించిన జేజీఈఈబీఐఎల్ఎస్ 2023 డిసెంబరు ఎగ్జామ్‌లో అర్హత పొందినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ లెక్చరర్‌షిప్/డీబీటీ(కేటగిరీ 2) అర్హత ఉన్నవారు, ఐసీఎంఆర్ ప్రాజెక్టు లిస్ట్‌లో ఉన్నవారు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 10
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** మే 20న
- **మొదటి రౌండ్ ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** జూన్ 3 నుంచి 5 వరకు
- **మొదటి రౌండ్ ఇంటర్వ్యూ ఫలితాలు విడుదల:** జూన్ 5
- **ఫైనల్ రౌండ్ ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** జూన్ 6, 7
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 14
- **ఇంటరాక్షన్:** జూలై 22 నుంచి ఆగస్టు 1 వరకు
- **వెబ్‌సైట్:** nccs.res.in

ఐహెచ్‌ఎంలో డిప్లొమా

హాజీపూర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్ఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వైవా, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. దేశవ్యాప్తంగా ఉన్న స్టార్ హోటళ్లలో ఏడాది పాటు ఇంటెన్సివ్ ట్రెయినింగ్, ఆర్నెల్లపాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటాయి.

విభాగాలు-సీట్లు: ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ విభాగాలు ఉన్నాయి. ఒక్కోదానిలో 56 సీట్లు ఉన్నాయి. ప్రతి విభాగంలో జనరల్ అభ్యర్థులకు 26, ఓబీసీలకు 15, ఎస్సీలకు 8, ఎస్టీలకు 4, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 3 సీట్లు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు(స్టేట్/సెంట్రల్) నుంచి ఏదేని గ్రూపుతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్ ఖరీదు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.250; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150; వీటిని పోస్ట్ ద్వారా తెప్పించుకోవాలంటే రూ.50లు అదనంగా చెల్లించాలి.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** మే 31
- **వైవాకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 10
- **వైవా తేదీ:** ఫుడ్ ప్రొడక్షన్ విభాగానికి జూన్ 24న; ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ విభాగానికి జూన్ 25
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** జూన్ 26
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** జూన్ 27 నుంచి జూలై 5 వరకు; జూలై 9 నుంచి 12 వరకు
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **చిరునామా:** ప్రిన్సిపాల్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లయిడ్ న్యూట్రిషన్, రామాశీష్ చౌక్, హాజీపూర్, వైశాలీ-844102
- **వెబ్‌సైట్:** ihmhajipur.net

ఎన్ఐఏబీలో ట్రెయినింగ్ ప్రోగ్రామ్

హైదరాబాద్, గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ(ఎన్ఐఏబీ) - పీజీ అభ్యర్థుల కోసం ప్రాజెక్ట్ వర్క్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. ఈ ట్రెయినింగ్ ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. సంస్థకు చెందిన సైంటిస్టుల ఆధ్వర్యంలో ట్రెయినింగ్ ఉంటుంది. ఈ ప్రోగ్రామ్ జూలై 1న ప్రారంభమౌతుంది. సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ ఎగ్జామ్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి లైఫ్ సైన్సెస్ విభాగాల్లో ఎమ్మెస్సీ, ఎంవీఎస్సీ, ఎంఫార్మసీ, ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ రెండో ఏడాది చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ మొదటి ఏడాది చదువుతున్నవారు; డిగ్రీ, పీజీ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- **ట్రెయినింగ్ ప్రోగ్రామ్ ఫీజు:** రూ.25,000
- **ప్రోగ్రామ్ వ్యవధి:** జూలై 1 నుంచి డిసెంబరు 31 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 7
- **వెబ్‌సైట్:** www.niab.org.in




బిట్స్



ఆవుల ధైర్యం


ఒక ఊరిలో మూడు ఆవులుండేవి. అవన్నీ స్నేహితులు. అడవికి వెళ్లినా నీళ్లు తాగటానికి వెళ్లినా కలిసి వెళ్లేవి. కుంటల్లో, కొలనుల్లో ఎక్కువ సమయం గడిపేవి. మూడింటికి దూడలున్నాయి. ఒక రోజు అడవిలో గడ్డి మేస్తున్న ఆవుల దగ్గరకు ఒక ఎలుగుబంటి పరిగెత్తుకొచ్చింది. 'నాలుగు పులులు వస్తున్నాయి. పరిగెత్తండి' అంటూ అరిచింది. ఆవులు పరిగెత్తపోయినపుడు క్షణాల్లో నాలుగు పులులు చుట్టుముట్టాయి. ఆవులు భయపడలేదు. పైగా కొమ్ములు రువ్వాయి. 'ఆవులు సాధు జంతువులు అనుకున్నా. ఇవేంటీ కొమ్ములు రువ్వుతున్నాయి' అంటూ చెట్టుమీద కోతి అరిచింది. 'ఈ ఆవులు గతంలో సింహాలనే వెంబడించి చంపాయి' అంటూ ఓ చిలుక చిటారుకొమ్మపైన జామపండు పొడుస్తూ గట్టిగా చెప్పింది. వీటితో కొట్లాడితే మా ప్రాణాలకు ఎక్కడ ఇబ్బంది వస్తుందోనని పులులు భయపడ్డాయి.



మూడు ఆవులూ లోపల భయంగా ఉన్నాయి. కానీ బయటికి ధైర్యాన్ని చూపించాయి. ఒక ఆవు ఇలా అంది. 'మనం ఇంటికి వెళ్లాలి. మన పిల్లలు ఎదురు చూస్తుంటారు' అన్నది. ఆవులు ఇంటికి బయలుదేరాయి. ఒక పులికి ఇగో దెబ్బతింది. ఒక్క ఉదుటున ఆవుమీదకు ఎగిరింది. ఆ ఆవు కొమ్ములతో ఎత్తివేసింది. కడుపు దగ్గర కొమ్ములు తగిలి పులి బిక్కచచ్చి పడిపోయింది. ఈ అడవిలో మాకంటే బలవంతులు ఆవులేమో అనుకుని పులులన్నీ వెనక్కి తగ్గాయి.



సరైన నీడ ఏది?



10 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 299

5			7			9		
		8					1	
		9		8	6			
3					1	8		4
1		4	9					7
			3	7		5		
	2					6		
		7			5			1

సుడోకు - 298 సమాధానం

5	8	9	6	1	3	7	2	4
7	2	1	9	4	8	5	6	3
4	3	6	7	5	2	8	9	1
1	5	2	3	7	6	4	8	9
6	4	8	1	2	9	3	5	7
3	9	7	4	8	5	6	1	2
9	1	4	8	6	7	2	3	5
8	7	5	2	3	1	9	4	6
2	6	3	5	9	4	1	7	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.